ప్రభాత

ఆదివారం

వెలుగు

03.02.2019

www.v6velugu.com

హైదరాబాద్

సంపుటి: 4 సంచిక: 348 పేజీలు: 12+12+36 పేజీల ఆదివారం అనుబంధం | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

టాకీస్

కంగనా.. అంత కఠినమా!

'మణికర్ణిక' వివాదంపై అందరూ కంగనాది తప్పని కరాఖండిగా చెప్పేస్తున్నారు. అయినా కూడా కంగనా ఏమాత్రం తగ్గడం లేదు.



09

దేశం- విదేశం

తృణమూల్ అంటే ట్రిపుల్ 'టీ'

తృణమూల్ తోలాబాజీ ట్యాక్స్ అంటూ బెంగాల్ సభలో టీఎంసీపై ఫైర్ అయిన ప్రధాని నరేంద్ర మోడీ



05

బిజినెస్

షేర్లపై స్టాంపుడ్యూటీ

ఈక్విటీ షేర్ల లావాదేవీలపై ఇక నుంచి సింగిల్‌టైం స్టాంప్‌డ్యూటీ వసూలు చేయాలని కేంద్రం నిర్ణయం.



10

దేశం - విదేశం

పాక్‌కు చైనా సాయం

విదేశీ మారక నిల్వలు లేక అల్లాడుతున్న పాకిస్థాన్‌కు 250 కోట్ల డాలర్ల అప్పు ఇచ్చేందుకు అంగీకరించిన చైనా.



05

ప్లే

లాస్ట్ పంచ్ ఎవరిదో?


నేడు న్యూజిలాండ్‌తో ఐదో వన్డే. 4–1 తేడాతో సిరీస్ గెలవాలనే కసితో టీమిండియా. మళ్లీ టీమ్‌లోకి వచ్చిన ధోనీ.



11

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
80.00	78.00	80.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
79.00	78.00	81.00



నేను ప్రెసిడెంట్ అయ్యాక బిజినెస్‌లో చాలా చాలా నష్టపోయాను. ఎన్నో అవకాశాలను కోల్పోయాను. నిజానికి నాకు మనీ అవసరం పెద్దగా లేదు. కానీ ఆర్థికంగా నష్టపోయింది మాత్రం నిజం. నా హోటల్‌లో ఫారిన్ ప్రతినిధులు, అధికారులు బస చేస్తారు. అయినా నాకు చాలా నష్టాలు వస్తున్నాయి

- న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

02

పరికి, మొర్రి, తునికి.. అడవిల దొరికే పండ్లు అడ్రస్ లేకుండ పాయె. సీతాఫల్, జామ, దానిమ్మ, సపోటా, మామిడిపండ్ల గిరాకీ గట్లగట్లనే ఉన్నది. ఫారిన్ కెల్లి వస్తున్న అవకడో, ప్లమ్, పియర్స్, చెర్రీ, థాయ్‌లాండ్ గ్వావా, బ్లూబెర్రీస్, డ్రాగన్‌ఫ్రూట్ కొనుడే ఇప్పుడు ఫ్యాషనైంది. గందుకే ఘర్ కా ముర్గీ దాల్ బరాబర్ అంటరు.

- రాష్ట్రానికి పోటెత్తుతున్న విదేశీ పండ్లు
- 16 దేశాల నుంచి దిగుమతి
- మాల్స్ నుంచి తోపుడు బండ్ల దాకా అవే..
- సీజన్ కాని సీజన్‌లో కన్పిస్తున్న పండ్లు



- జోరుగా సాగుతున్న అమ్మకాలు
- ఏటా 100 కోట్ల వ్యాపారం
- లోకల్ పండ్ల మార్కెట్‌కు దెబ్బ
- పడిపోతున్న గిరాకీ
- మన పండ్లే బెస్ట్ అంటున్న నిపుణులు

మన అంగట్ల ఫారిన్ పండ్లు

హైదరాబాద్, వెలుగు:

పంజాగుట్ట రోడ్డుపై ఓ తోపుడు బండి..అందులో ఇప్పటిదాకా మనం చూడనంత సైజులో జామకాయలు.. సికింద్రాబాద్ మోండా మార్కెట్.. కాలంకాని కాలంలో నోరూరిస్తున్న సీతాఫలాలు.. బంజారాహిల్స్‌లో ఓ మాల్.. నవనవలాడే డ్రాగన్ ఫ్రూట్.. ...ఇలా ఒకట్రెండు కాదు.. ఎన్నెన్నో కొత్త పండ్లు.. అదీ సీజన్ కాని సీజన్‌లో! మనం ఇప్పటిదాకా చూడని, రుచి చూడని, పేరు కూడా వినని ఫ్రూట్లు విదేశాల నుంచి పోటెత్తుతున్నాయి. థాయ్ గ్వావా.. కివీ.. ప్లమ్.. డ్రాగన్.. అవకాడో.. పియర్స్.. రెడ్ గ్రేప్ పేర్లతో మన మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు జిల్లా, పట్టణ కేంద్రాల్లోనూ ఇవి దొరుకుతున్నాయి. చైనా, అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, న్యూజిల్యాండ్, ఇరాన్, థాయ్‌లాండ్, శ్రీలంక వంటి దేశాల నుంచి మన రాష్ట్రానికి వస్తున్నాయి.

వంద కోట్ల వ్యాపారం

మన రాష్ట్రానికి సుమారు 16 దేశాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. దేశవాళీ పండ్ల కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ధరలు ఉంటున్నాయి. అయినా వాటిని కొనేందుకు జనం మొగ్గు చూపుతున్నారు. వేసవిలో వచ్చే మామిడి పండ్లు, శీతాకాలంలో వచ్చే సీతాఫలాలను ఇప్పుడు కిలో రూ.300 నుంచి రూ.500 దాకా అమ్ముడవుతున్నాయి. హైదరాబాద్ గడ్డి అన్నారం లోని ఫ్రూట్ మార్కెట్ ద్వారా ఏటా 25 లక్షల క్వింటాళ్ల దేశీయ పండ్లు రాష్ట్ర మార్కెట్‌లోకి

మిగతా 4లో

ఏ పండు ఎక్కడ్నుంచి?



గ్రీన్ గ్వావా(జామ): థాయ్‌లాండ్

యాపిల్ వెరైటీలు: అమెరికా, చైనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, టర్కీ

కివీ: న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ, గ్రీస్

ప్లమ్: స్పెయిన్, అమెరికా, ఇటలీ, సౌతాఫ్రికా

పియర్స్: అమెరికా, చైనా, సౌతాఫ్రికా

చెర్రీ: అమెరికా, చిలీ, ఇంగ్లండ్, న్యూజిలాండ్, కెనడా, టర్కీ, అర్జెంటీనా

ఆరెంజ్(కినోవా): సౌతాఫ్రికా, ఈజిప్ట్, అమెరికా, ఆస్ట్రేలియా

రెడ్ గ్రేప్: అమెరికా, చిలీ, ఆస్ట్రేలియా, చైనా, ఇటలీ

డ్రాగన్ ఫ్రూట్: వియత్నాం, మెక్సికో, కోస్టారికా, ఆస్ట్రేలియా

నిల్వ చేసినవి మంచిది కాదు..

దేశవాళీ పండ్లు విదేశీ పండ్లకు ఏమాత్రం తీసిపోవు. మన పండ్లలోనూ అత్యధిక పోషక విలువలు ఉన్నాయి. ఫారిన్ పండ్లలో ఏవో ఉన్నాయనుకుంటే పొరపాటు. ఏ ప్రాంతంలో పండే పండ్లు ఆ ప్రాంతంలో తినడానికి అనువుగా ఉంటాయి. ఏ సీజన్‌లో పండ్లు ఆ సీజన్‌లో తింటేనే ఆరోగ్యకరం. పండ్లను రసాయనాలు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచితే సహజ గుణాలను కోల్పోతాయి. అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి వ్యాక్స్, ఫార్మాలీన్ వంటి రసాయాలు వినియోగిస్తారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంది. విదేశీ పండ్లపై రెగ్యులేషన్ ఉండాలి.

- జీవీ రామాంజనేయులు, వ్యవసాయ శాస్త్రవేత్త



మనోళ్లకు మరో గండం

చదువు పూర్తైనా అమెరికాలోనే ఐదారువేల మంది

5వ తేదీతో ముగుస్తున్న 'వీసా మెమొరాండం' గడువు

ఆ తర్వాత దొరికితే అరెస్టు, తిప్పి పంపేయడమే

మూడేళ్లపాటు నిషేధం విధించే అవకాశం

హైదరాబాద్, వెలుగు:

అమెరికాలో ఉత్తుత్తి యూనివర్సిటీ పేరిట వల వేసిన వ్యవహారం కొనసాగుతుండగానే విద్యార్థులకు మరో గండం ఎదురవుతోంది. వీసా గడువు పూర్తయి అక్కడే ఉంటున్న వారికి అమెరికా ప్రభుత్వం ఇచ్చిన టైం రెండు రోజుల్లో ముగియనుంది. మరో ఐదారు వేల మందికి ఇదే తరహా సమస్య ఎదురయ్యే పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.

వేలాది మంది

ఉన్నత చదువుల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏటా వేలాది మంది విద్యార్థులు అమెరికా వెళ్తున్నారు. చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం చేయాలన్న తపనతో నిబంధనలకు విరుద్ధంగా ఉండిపోతున్నారు. ఇలా అక్రమంగా ఉంటున్నవారిని పంపించివేసేందుకు అమెరికా సర్కారు ఇటీవల పలు చట్టాలు చేసింది. అందులో భాగంగా గతేడాది ఆగస్టు 9న యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ అధికారులు పాలసీ మెమొరాండం విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న జే, ఎఫ్, ఎమ్ కేటగిరీ నాన్ ఇమిగ్రెంట్ విద్యార్థులు ఆరు నెలల్లో అమెరికా వదిలి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ గడువు ఫిబ్రవరి ఐదో తేదీతో ముగుస్తోంది. దీంతో అక్కడే చదువు పేరుతో ఉద్యోగం చేసుకుంటూ ఉన్న తెలుగు వారిలో ఆందోళన మొదలైంది. ఇలాంటి విద్యార్థులు ఐదారు వేల మంది వరకు ఉంటారని అంచనా. ఈ నెల 5 తర్వాత అక్కడ పట్టుబడితే సమస్య తీవ్రతను బట్టి.. తర్వాత మూడేళ్ల వరకూ అమెరికా రాకుండా నిషేధం విధిస్తారు. శిక్ష కూడా విధించే అవకాశాలూ ఉంటాయి.

తెలుగువారే ఎక్కువ

అమెరికాకు విద్యార్థులు మూడు కేటగిరీలు ఎఫ్ (స్టూడెంట్స్ వీసా), జే (ఎక్స్చేంజ్ విజిటర్స్), ఎం (ఓకేషనల్ స్టూడెంట్స్) వీసాలపై వెళ్తుంటారు. ఆ వీసాల గడువు ముగిసినప్పుడు స్టేటస్ మార్చుకోవాలి. అంటే ఏదైనా ఉద్యోగం సంపాదించడం, మరో కోర్సులో చేరడం ద్వారా ఆ వీసాలు పొందాలి. అమెరికా ఇమిగ్రేషన్ సర్వీసెస్ లెక్కల ప్రకారం 2018 ఆగస్టు 6 నాటికి అక్కడ 16,62,369 మంది విదేశీ విద్యార్థులున్నారు. అందులో ఎఫ్ కేటగిరీ విద్యార్థులు 4.07 శాతం మంది, జే కేటగిరీ వారు 4.17 శాతం, ఎం కేటగిరీలో 9.54 శాతం మంది తమ స్టేటస్‌ను మార్చుకోలేదు. వారంతా ఆరునెలల్లో వేరే వీసా సంపాదించాలి లేదా తిరిగి వెళ్లిపోవాలి. ఇలాంటివారిలో చాలా మంది తెలుగు వారు ఉన్నట్టు కన్సల్టెంట్ ప్రతినిధులు చెప్తున్నారు.

మిగతా 2లో

బాధితులుగా చూడండి

విద్యార్థుల అరెస్టుపై అమెరికాకు కేంద్రం విజ్ఞప్తి

వారు మధ్యవర్తుల చేతిలో మోసపోయి ఉంటారు

త్వరగా విడుదల చేయండి.. బలవంతంగా తిప్పిపంపొద్దు

దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఢిల్లీలోని ఎంబసీకి లేఖ

02



సీబీఐ కొత్త బాస్ రిషి కుమార్ శుక్లా

న్యూఢిల్లీ:

సీబీఐ కొత్త డైరెక్టర్ గా రిషి కుమార్ శుక్లా నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కమిటీ శుక్లాను ఎంపిక చేసింది. మధ్యప్రదేశ్ డీజీపీగా పని చేసిన శుక్లా 1983వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్నారు. శుక్రవారం ప్రధాని నివాసంలో జరిగిన ఎంపిక కమిటీ సమావేశానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్, ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. శుక్లాతోపాటు 1984 వ బ్యాచ్ ఐపీఎస్ అధికారులు జావెద్ అహ్మద్, రజనీకాంత్ మిశ్రా, ఎస్ఎస్ దేశ్వాల్ పేర్లు వినిపించాయి. రిషికుమార్ శుక్లాపై ఖర్గే అభ్యంతరాలను పక్కన పెట్టిన ప్రధాని మోడీ ఆయనను సీబీఐ చీఫ్ గా ఎంపిక చేశారు.



బడ్జెట్ బాగుండాలె

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా ఉండాలి: కేసీఆర్

ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండొద్దు

అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్, వెలుగు:

"సాగు నీటి ప్రాజెక్టులను ఈ టర్మ్‌లో పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలి. పనులు శరవేగంగా సాగుతున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లో కొరత లేకుండా చూడాలి" అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రూపకల్పనపై శనివారం సాయంత్రం సీఎం ప్రగతిభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా బడ్జెట్ రూపకల్పన జరగాలని సూచించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌పై ఎన్నో ఆశలతో ప్రజలు ఓట్లేశారు. పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయండి" అని చెప్పారు. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థిక సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు గణపతి రెడ్డి, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదాద్రికి సీఎం కేసీఆర్

03



180 కిలోమీటర్ల స్పీడు, 10 నిమిషాలు లేటు

180 కిలోమీటర్ల స్పీడుతో దూసుకెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇది. కానీ ట్రయల్ రన్ రోజే లేటుగా వచ్చింది. మొన్నటి వరకు 'ట్రైన్ 18'గా ఉన్న దీని పేరును ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ కన్నా వేగంగా వెళ్తుంది. ఢిల్లీ–వారణాసి మధ్య పరుగులు తీస్తుంది. కేవలం 8 గంటల్లోనే అటు నుంచి ఇటు తీసుకెళుతుంది. కానీ శనివారం మాత్రం షెడ్యూల్ టైం కన్నా 10 నిమిషాలు లేటుగా గమ్యస్థానానికి చేరుకుంది.

ఎన్నారై జయరాంది హత్యే

- విషప్రయోగం జరిగిందని నిర్ధారణ
- మేనకోడలి విచారణ

విజయవాడ, వెలుగు: కోస్టల్ బ్యాంకు డైరెక్టర్, ఎన్నారై చిగురుపాటి జయరాం హత్యకు హైదరాబాద్‌లో కుట్ర జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య జరిగిన రోజు జయరాం ఇంటికి ఆయన మేనకోడలు శిఖాచౌదరి వెళ్లినట్లు విచారణలో తేలింది. ఏపీలోని కృష్ణా జిల్లా కంచికచర్ల పీఎస్‌లో శిఖాచౌదరి, ఆమె చెల్లెలు మనీషాను పోలీసులు ప్రశ్నించారు. జయరాం భార్య పద్మశ్రీతో ఫోన్‌లో మాట్లాడారు. జయరాం స్నేహితుల వివరాలపై ఆరా తీశారు. జయరాం కుటుంబసభ్యులను జగ్గయ్యపేటలోని సిమెంట్ కంపెనీకి చెందిన ఒక గెస్ట్ హౌస్‌లో వి



చారించారు. శిఖా చౌదరి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా హైదరాబాద్‌లో సోదాలు చేశారు. గచ్చిబౌలిలోని శిఖాచౌదరి ఇల్లు, దసపల్లా హోటల్‌లో తనిఖీలు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. జయరాం శరీరంపై తీవ్రగాయాలు ఏవీ లేవని, ఆయన తలపై ఉన్న బ్లడ్ ముక్కు నుంచి వచ్చినట్లు పోస్ట్ మార్టం రిపోర్ట్‌లో వెల్లడైందని చెప్పారు. జయరాంపై విషప్రయోగం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. శాంపిల్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. గురువారం దసపల్లా హోటల్‌లో ఫార్మా కంపెనీ సమావేశం జరిగిందని, తర్వాత వైట్ కలర్ షర్ట్ వేసుకున్న ఓ వ్యక్తితో జయరాం వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అతనెవరని ఆరా తీస్తున్నారు. టోల్ గేట్ల వద్ద దొరికిన ఫుటేజ్‌లో జయరాం పక్కన మరో వ్యక్తి ఉన్నారని తేలింది. అదే రోజు రాత్రి కృష్ణా జిల్లా నందిగామలోని ఐతవరం వద్ద హైదరాబాద్ - విజయవాడ జాతీయరహదారి పక్కన కారులో జయరాం మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

ప్రెసిడెంట్‌గిరితో మస్తు లాసయిన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

లండన్:

వీసా రూల్స్ అన్నీ మార్చి పారేస్తానని మీసాలు మెలేస్తారు ఓసారి.. మెక్సికో బోర్డర్‌లో గోడ కట్టేస్తానంటూ తొడ గొడతారు మరోసారి.. 'ఏ దోస్తీ.. హమ్ నహీ తోడేంగే..' అంటూ బద్ధ శత్రువు ఉత్తర కొరియా అధ్యక్షుడితో సాంగ్ వేసుకుంటారు ఇంకోసారి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏం అన్నా.. ఏం చేసినా వార్తే! ఈసారీ అలాంటి కామెంట్లే చేశారు. తాను అమెరికా అధ్యక్షుడిని అయిన తర్వాత బావుకున్నదేమీ లేదని, ఆర్థికంగా చాలా నష్టపోయానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్ష పార్టీ దారిలోకి రాకుంటే మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టేందుకు దేశంలో ఎమర్జెన్సీ విధిస్తానని హెచ్చరించారు. దీనిపై డెమోక్రాట్స్‌తో జరుపుతున్న చర్చలు టైంవేస్ట్ అని తేల్చిపారేశారు. తాజాగా న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం విదేశాల నుంచి అధ్యక్షుడు గిఫ్ట్‌లు తీసుకోవద్దు. కానీ వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌కు సమీపంలోనే ట్రంప్‌కు పెద్ద హోటల్ ఉంది. ప్రెసిడెంట్‌ను కలిసేందుకు విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, ఇతర అధికారులంతా అందులోనే దిగుతారు. దీంతో హోటల్ బిజినెస్ బాగా పెరిగిందటగా అని ఇంటర్వ్యూలో జర్నలిస్టు ప్రశ్నించారు. ఇందుకు ట్రంప్‌కు తనదైన స్టైల్‌లో సమాధానమిచ్చారు. "హా.. అవును. అది నా హోటలే. వాళ్లు అందులో బస చేసేది కూడా నిజమే. కానీ నాకు చాలా నష్టాలు వస్తున్నాయి. నిజానికి నేను ప్రెసిడెంట్ అయ్యాక బిజినెస్‌లో చాలా చాలా నష్టపోయాను. ఎన్నో అవకాశాలను కోల్పోయాను. నాకు నిజానికి మనీ అవసరం పెద్దగా లేదు. కానీ ఆర్థికంగా నష్టపోయింది మాత్రం నిజం" అని అన్నారు.

సైనిక నిధులు వాడుతా..

మెక్సికో బోర్డర్‌లో గోడ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ట్రంప్ స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధుల విడుదలకు అడ్డుపడుతున్న డెమోక్రాటిక్ నేత, స్పీకర్ నాన్సీ పెలోసీ అమెరికాకు తీవ్ర నష్టం చేస్తున్నారంటూ మండిపడ్డారు. గోడ కట్టేందుకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ద్రవ్య వినిమయ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం తెలపకపోవడంతో ఇటీవల 35 రోజులపాటు పాలన పూర్తిగా స్తంభించిపోయింది. అయితే ఈసారి మరో షట్‌డౌన్ ఉండబోదని, ఎమర్జెన్సీ విధించి మరీ గోడ నిర్మాణానికి సైనిక నిధులను ఉపయోగిస్తానని ట్రంప్ చెప్పారు. డెమోక్రాట్లతో చర్చలు సఫలమయ్యే సూచనలు లేవని, ఎమర్జెన్సీకి దగ్గరవుతున్నామని అన్నారు. 2020 ప్రెసిడెంట్ ఎన్నికల్లో సొంత పార్టీలో తనకు పోటీగా నామినేషన్ వేస్తారని భావించడం లేదన్నారు. డెమోక్రాటిక్ పార్టీ నుంచి కమలా హ్యారిస్ శుభారంభం చేశారని, రేసులో ఆమెనే ముందంజలో ఉందని చెప్పారు.

స్పీకర్ ఆఫీస్ ఖండన

మరోవైపు ట్రంప్ ఆరోపణలను స్పీకర్ ఆఫీస్ తిప్పికొట్టింది. ట్రంప్ నిర్లక్ష్య ధోరణి అమెరికాకు మంచిది కాదన్నారు. బోర్డర్ సిబ్బందితో పాటు డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్‌బీఐ, హోంలాండ్ సెక్యూరిటీ తదితర కీలక విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు జీతాలందక ఇబ్బంది పడ్డ విషయాన్ని నాన్సీ అధికార ప్రతినిధి గుర్తుచేశారు.



- ఎన్నో మంచి అవకాశాలు జారిపోయాయి
- మెక్సికో బోర్డర్‌లో గోడ కట్టి తీరతాం
- అవసరమైతే ఎమర్జెన్సీ పెడతా
- డెమోక్రాట్లతో చర్చలు టైం వేస్ట్

మనోళ్లకు మరో గండం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు అమెరికాలోని ఏదైనా యూనివర్సిటీలో చేరి ఏడాది కోర్సు పూర్తి చేసిన తర్వాత కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (సీపీటీ) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిలో ఆ వర్సిటీ పరిధిలోనే వారానికి కొన్ని గంటలు పనిచేసుకోవడానికి అనుమతిస్తారు. బయట పనిచేసుకోవడానికి వీలుండదు. ఇక కోర్సు పూర్తయ్యాక ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)కు అవకాశం ఉంటుంది. అంటే అదే కోర్సుకు సంబంధించి ఆరు నెలల నుంచి ఏడాది పాటు ఉద్యోగం చేసుకోవచ్చు. దీన్ని మరో రెండేళ్లపాటు పొడిగించే అవకాశముంది. మొత్తంగా ఓ ఏడాది కోర్సు, ఏడాది సీపీటీ, మూడేళ్లు ఓపీటీ మీద ఉండొచ్చు. అప్పటికే అక్కడ ఏదైనా కంపెనీలో ఫుల్‌టైం ఉద్యోగం దొరికితే.. హెచ్1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ వీసాలను నిర్ణీత సంఖ్యలో, లాటరీ పద్ధతిలో ఇస్తారు. దాంతో చాలా మందికి అవకాశం రాదు. అలాంటి వారంతా ఏదో ఒక వర్సిటీలో స్టడీ కోసం చేరడం, సీపీటీ, ఓపీటీ చేయడం మొదలుపెడుతుంటారు. ఈ క్రమంలోనే నకిలీ, మోసపూరిత వర్సిటీల్లో చేరి సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు.

రెండు వర్సిటీల్లో మరో 10 వేల మంది!

పెన్సిల్వేనియా, కెంటకీ ప్రాంతాల్లో రెండు యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా సమస్య తలెత్తే అవకాశం ఉందని సమాచారం. అమెరికాలోని ఏ యూనివర్సిటీలో చేరినా ఏడాది కోర్సు పూర్తయ్యాకే సీపీటీకి అనుమతివ్వాలి. కానీ ఆ రెండు వర్సిటీల్లో చేరిన రోజు నుంచే 'సీపీటీ' ఇస్తున్నారని తెలిసింది. చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వర్సిటీలపై అమెరికా సర్కారు కన్నేసిన నేపథ్యంలో.. ఈ వర్సిటీల్లో చదివే విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ రెండింటిలో సుమారు పదివేల మంది తెలుగువారు ఉంటారని అంచనా.

సాయానికి ముందుకు..

ఫార్మింగ్టన్ యూనివర్సిటీ వ్యవహారంలో పోలీసుల నోటీసులు అందుకున్న వందలాది మంది తెలుగు విద్యార్థులకు సాయం చేసేందుకు అమెరికాలోని తెలుగు అసోసియేషన్లు రంగంలోకి దిగాయి. విద్యార్థులు, అరెస్టైనవారి స్నేహితులు, బంధువులు తమను సంప్రదించాలని, తోడ్పాటు అందిస్తామని ప్రకటించాయి. తెలుగు ఎన్నారై రేడియో తమ రేడియోలో ఇమిగ్రేషన్ న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కొందరు అటార్నీల (న్యాయవాదుల)ను సిద్ధం చేయగా, మరికొందరు అవసరమైన డబ్బు కోసం నిధుల సేకరణ ప్రారంభించారు.

- మిషిగన్‌లో కొందరు అటార్నీలను నియమించుకున్నామని, వారి సాయంతో డిటెన్షన్ సెంటర్లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతున్నామని అమెరికన్ తెలంగాణ అసోసియేషన్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రకటించాయి. సాయం అవసరమైన విద్యార్థుల స్నేహితులు, బంధువులు తమను సంప్రదించాలని సూచించాయి. తెలంగాణ అసోసియేషన్ ప్రెసిడెంట్ వినోద్ కుకునూర్ +1(248) 8806127, వెంకట్ మంతెన +1 (412) 498 4809 నంబర్లను, తెలుగు అసోసియేషన్ Info@atausa.org మెయిల్ ఐడీని ఇచ్చింది.
- నోటీసులు జారీ అయిన విద్యార్థులు, పోలీసుల అదుపులో ఉన్న విద్యార్థులకు సంబంధించినవారు త్వరగా డిఫెన్స్ లేదా ఇమిగ్రేషన్ అటార్నీని నియమించుకోవాలని టీమ్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ సూచించింది. సహాయం కావాలంటే teamaid.org వెబ్‌సైట్లో తమను సంప్రదించాలని తెలిపింది.
- ఎన్నారై లాయర్ జనేత కంచర్ల (Janetha@janet halaw. com), మరో ఎన్నారై అడపా ప్రసాద్(adapa_p@hotmail.com) కూడా సహాయం చేస్తామని ప్రకటించారు.



కాళ్లకు ట్రాకింగ్ డివైజ్‌లు

అమెరికాలో అరెస్టు చేసిన విదేశీ విద్యార్థుల్లో కొందరిని జైళ్లకు తరలించగా.. మరికొందరిని మాత్రం హౌజ్ అరెస్టు చేసినట్టు ఆ దేశ అధికారవర్గాలు చెప్పాయి. ఇలా హౌజ్ అరెస్టు చేసినవారి కాళ్లకు ట్రాకింగ్ డివైజ్‌లు బిగించినట్టు తెలుస్తోంది. ఆ ప్రదేశం నుంచి బయటికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనిస్తున్నట్టు సమాచారం. ఈ ట్రాకింగ్ డివైజ్‌లను తీసేయాలని చూసినా, ఆ ప్రదేశం దాటి వెళ్లేందుకు ప్రయత్నించినా వారిని అరెస్టు చేసి, జైలుకు తరలిస్తారు.

ఇబ్బంది పడకుండా చూడాలి

లక్షల్లో ఫీజులు చెల్లించి పేద, మధ్య తరగతి విద్యార్థులు అమెరికా వర్సిటీల్లో చదువుతున్నారు. చాలా మంది భూములు తాకట్టు పెట్టి, అప్పులు చేసి వెళ్తున్నారు. వారిని ఇబ్బందులకు గురిచేయకుండా, శిక్షలు వేయకుండా స్వస్థలాలకు పంపాలి.

- ఎం.రాజ్‌కుమార్, తెలంగాణ ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

బాధితులుగా చూడండి

విద్యార్థుల అరెస్టుపై అమెరికాకు కేంద్రం విజ్ఞప్తి

- త్వరగా విడుదల చేయండి.. బలవంతంగా తిప్పిపంపొద్దు
- విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ: నకిలీ యూనివర్సిటీలో చేరిన భారత విద్యార్థులను బాధితులుగా చూడాలని అమెరికాకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వర్సిటీలో చేర్పించిన మధ్యవర్తులతో విద్యార్థులను పోల్చలేమని, వారిని మధ్యవర్తులు మోసం చేసి ఉంటారని పేర్కొంది. విదేశాంగ శాఖ భారత్‌లోని అమెరికన్ ఎంబసీకి శనివారం లేఖ రాసింది. అమెరికాలో అరెస్టైన భారత విద్యార్థులు భారత కాన్సులేట్ సాయం అందుకునేందుకు అవకాశం కల్పించాలని కోరింది. "నకిలీ యూనివర్సిటీలో చేరారంటూ అమెరికాలో కొందరు భారత విద్యార్థులను అరెస్టు చేసిన అంశంలో చర్యలు తీసుకుంటున్నాం. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆ దేశ ఎంబసీ, అధికారులతో మాట్లాడుతున్నాం. అరెస్టు చేసిన విద్యార్థులు భారత అధికారులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని అమెరికా కాన్సులేట్ ద్వారా విజ్ఞప్తి చేశాం" అని వెల్లడించింది.

వారిని బాధితులుగా చూడాలి

అమెరికా పోలీసులు యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్ పేరిట నకిలీ వర్సిటీ పెట్టి చదువు పేరిట ఉద్యోగాలు చేసే విదేశీయులకు గాలం వేసిన విషయం తెలిసిందే. అలా చేరిన విద్యార్థులు, వారిని చేర్పించిన మధ్యవర్తులపై ఫెడరల్ పోలీసులు బుధ, గురువారాల్లో దాడులు చేసి అరెస్టు చేశారు. మొత్తంగా 130 మంది విదేశీ విద్యార్థులను అదుపులోకి తీసుకోగా.. అందులో 129 మంది భారత్‌కు చెందిన వారేనని, ముఖ్యంగా తెలుగువారు ఎక్కువగా ఉన్నారని గుర్తించారు. ఈ నేపథ్యంలో భారత విద్యార్థులను విడిపించేందుకు, సాయం చేసేందుకు విదేశాంగ శాఖ రంగంలోకి దిగింది. నకిలీ యూనివర్సిటీ వ్యవహారం, అరెస్టైన విద్యార్థుల వివరాలను తెలపాల్సిందిగా ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేసింది. విద్యార్థులను త్వరగా విడుదల చేయాలని, బలవంతంగా తిప్పిపంపే చర్యలేమీ తీసుకోవద్దని కోరింది.

ప్రత్యేకంగా 'హాట్‌లైన్'

అమెరికాలోని భారత కాన్సులేట్ అధికారులు అరెస్టైన విద్యార్థులను కలుస్తున్నారని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లోని జైళ్లకు వెళ్లి 30 మంది విద్యార్థులను కలిశారని, సాయం చేసేందుకు చర్యలు చేపట్టారని తెలిపింది. అక్కడి విద్యార్థులకు సహాయం కోసం ఇండియన్ ఎంబసీలో ప్రత్యేకంగా హాట్‌లైన్ ఏర్పాటు చేశామని ప్రకటించింది. హెల్ప్‌లైన్ నంబర్లు (+1 202 322 11902, +1 202 340 2590), ఈ మెయిల్ ఐడీ (cons3.washington@mea.gov.in)లో సంప్రదించాలని సూచించింది. ఈ అంశం మొత్తాన్నీ కో ఆర్డినేట్ చేసేందుకు అమెరికాలోని భారత ఎంబసీ ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించిందని తెలిపింది. అమెరికా అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటామని, భారత విద్యార్థుల కోసం ప్రభుత్వం, ఎంబసీ, కాన్సులేట్లు చర్యలు చేపడతాయని పేర్కొంది.

నా చావుతోనైనా మారండి..!

చెన్నై:

'తిండీ, నిద్రా మానేసి పని చేస్తున్నాం. మేం చేసిన తప్పేంది? నడిరోడ్డుమీద బూతులు తిడుతారా.. మీ ఇష్టమున్నట్లు కొడుతారా?! మేం మనుషులం కాదా! నా చావుతోనైనా పోలీసుల తీరు మారుతుందని ఆశిస్తున్నా..' ఇదీ తన సూసైడ్‌కు ముందు ఓ ట్యాక్సీ డ్రైవర్ సోషల్ మీడియాలో పెట్టిన సెల్ఫీ వీడియో. ఇప్పుడు ఇది తమిళనాడులో సంచలనంగా మారింది. ట్యాక్సీ డ్రైవర్ల దయనీయ స్థితిని అతడు తన వీడియోలో వివరించిన తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది. కాంచీపురం సమీపంలోని కమ్మవర్ అనే గ్రామానికి చెందిన 25 ఏళ్ల రాజేశ్, చెన్నైలో ఓ ప్రైవేట్ కంపెనీ ట్యాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ట్యాక్సీని పాడి ఏరియా సిగ్నల్ దగ్గర నిలపడం చూసిన ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు.. 'నో పార్కింగ్ ఏరియాలో కారు ఎందుకు ఆపావు' అంటూ బూతులు తిడుతూ దాడి చేశారు. ట్యాక్సీని సైతం ధ్వంసం చేశారు. ఈ సంఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన రాజేశ్... చెన్నై సమీపంలోని మరైమలైనగర్ ఏరియా దగ్గరున్న రైల్వే ట్రాక్‌పై తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశ్ మొండం నుంచి తల వేరుపడింది. రాజేశ్ తన ఆత్మహత్యకు ముందు.. ఓ సెల్ఫీ వీడియోని తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. 'ఓ మహిళా ఉద్యోగిని డ్రాప్ చేసి మరో ఉద్యోగి కోసం అక్కడ వేచి ఉన్నాను. అంతలోనే పోలీసులు వచ్చి నన్ను కొట్టారు. కట్టెతోనో, చేత్తోనో తెలియదు కానీ దెబ్బ బలంగా తగిలింది. తర్వాత ఇష్టం వచ్చినట్లు తిట్టారు. నా కారును కూడా బాదారు. నా ముందు ఆపిన మరో కారుడ్రైవర్ పరిస్థితీ ఇదే. అందులో ఓ మహిళ ఉద్యోగిని ఉందని తెలిసి కూడా బూతులు తిట్టారు. రోజూ తిండీ, నిద్రా మానేసి డబ్బుల కోసం పని చేస్తున్నాం. డ్రైవర్లకు ఉండేది మూడు, మూడున్నర గంటల నిద్రే. రక్షించాల్సిన పోలీసులే ఇలా వ్యవహరిస్తే ఎలా? నా చావుతోనైనా పోలీసుల ఆగడాలు ఆగిపోవాలి' అని వీడియోలో తన బాధను వెల్లబోసుకున్నాడు. రాజేశ్ సెల్‌ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించిన వెంటనే పోలీసులు డిలీట్ చేశారు. పోలీసుల తీరుపై ట్యాక్సీ డ్రైవర్లు, మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు.



- తమిళనాడు ఖాకీల తీరుపై ఓ ట్యాక్సీ డ్రైవర్ సెల్ఫీ వీడియో
- తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య

తిరుపతి ఆలయంలో కిరీటాలు మాయం

తిరుపతి: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో కిరీటాలు మాయమయ్యాయి. ఉత్సవమూర్తులకు అలంకరించిన 3 కిరీటాలు శనివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. విషయం తెలుసుకున్న టీటీడీ ఈవో, జేఈవో, తిరుపతి ఎస్పీ ఆలయానికి చేరుకున్నారు. కిరీటాలు ఎలా మాయమయ్యాయో తెలుసుకోడానికి అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'అన్ని లోక్‌సభ సెగ్మెంట్లలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు'

ప్రయాగ్‌రాజ్: దేశంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని, లేనిచోట త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి మనోజ్‌సిన్హా చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా స్మారక తపాలా స్టాంప్‌ను శనివారం ఆయన విడుదల చేశారు. 2014 వరకు 77 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలుండగా వాటిని తాము 300 దాకా పెంచామన్నారు. సేవా కేంద్రాలు లేని ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలాఖరుకు ఏర్పాటు చేస్తామని సిన్హా చెప్పారు.



శనివారం హైదరాబాద్‌లో ఉత్తమ డ్రైవర్ అనంతయ్యకు సన్మాన పత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ

ఇంధన పొదుపులో తొలి స్థానమే లక్ష్యం

- ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ
- 66 మంది ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

హైదరాబాద్, వెలుగు: ఇంధన పొదుపులో టీఎస్ ఆర్టీసీ దేశంలో మూడో స్థానంలో ఉందని, నంబర్ వన్ ప్లేస్‌కు చేరడమే లక్ష్యంగా పనిచేయాలని డ్రైవర్లకు సంస్థ ఎండీ సునీల్ శర్మ సూచించారు. ఇంధన సంరక్షణ క్షమతా మహోత్సవంలో భాగంగా ఇంధనం పొదుపు చేసిన 11 మంది ఉత్తమ డ్రైవర్లను శనివారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఇంధన పొదుపుకు దోహదం చేసిన మెకానిక్‌లకు అవార్డులు, రివార్డులు అందజేశారు. అనంతరం సునీల్ శర్మ మాట్లాడుతూ 10వేలకుపైగా బస్సులు నడుపుతున్న ఆర్టీసీ ఏటా 22.66 కోట్ల లీటర్ల డీజిల్ వాడుతోందన్నారు. 5.30 కేఎంపీఎల్ సాధిస్తే ఏడాదికి సంస్థకు రూ.43 కోట్లు ఆదా అవుతుందన్నారు. 6.00 కేఎంపీఎల్ సాధించిన 1,468 మంది డ్రైవర్లను స్ఫూరిగా తీసుకుని మిగతావారు పనిచేయాలన్నారు.

66 మంది ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఇంధన పొదుపునకు కృషి చేసిన 66 మంది డ్రైవర్లను సునీల్ శర్మ సన్మానించారు. రాష్ట్రస్థాయిలో 11 మందికి, జిల్లాకు ఐదుగురు చొప్పున 55 మందిని సత్కరించారు. రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన వారిలో బి. అనంతయ్య (మియాపూర్ డిపో), జేఆర్ రెడ్డి (ఉప్పల్ డిపో), ఎండీ గౌస్ (మహబూబ్‌నగర్), బుచ్చయ్య (హైదరాబాద్1), పి. రమేష్ (వరంగల్ 2), కేపీసీ రావు (మధిర), మల్లేశం (సిద్దిపేట), దేవ (సూర్యాపేట), శ్రీనివాస్ (మంచిర్యాల), లక్ష్మయ్య (కరీంనగర్ 1), మనోహర్ (నిజామాబాద్2) ఉన్నారు.



బొగ్గు రవాణా పెంచాలి

జీఎంల సమీక్షలో సింగరేణి సీఎండీ

హైదరాబాద్ వెలుగు: బొగ్గు ఉత్పత్తితోపాటు రవాణానూ పెంచితేనే లక్ష్యాలను సాధిస్తామని సింగరేణి సీఎండీ శ్రీధర్ అన్నారు. లక్ష్యాలు సాధించడంలో కాంట్రాక్టర్లు అలసత్వం చూపితే చర్యలు తీసుకోవాలని జీఎం, అధికారులను ఆదేశించారు. శనివారం సింగరేణి ఉత్పత్తి, రవాణాపై సమీక్ష జరిపిన సీఎండీ.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గనులవారీ యంత్రాల కొనుగోలు మార్చి నెలకల్లా పూర్తవ్వాలని, ఇందుకు ప్రతిపాదనలు, టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కొత్తగూడెం, సత్తుపల్లి రైలు మార్గానికి ఆటంకం లేకుండా అధికారులతో సంప్రదింపులు జరపాలని చెప్పారు. సింగరేణి ప్రాంత జిల్లాలకు రూ. 1,500 కోట్లు చెల్లించామని, సింగరేణి పరిసర గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా జిల్లా అధికారులతో మాట్లాడాలన్నారు. గత నెలలో సగటున 40 రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేయడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు.



ఓట్ల బడ్జెట్: దాసోజు

న్యూఢిల్లీ, వెలుగు: ప్రధాని మోడీ ఆధ్వర్యంలో కేంద్ర సర్కారు ప్రవేశపెట్టింది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాదని, ఓట్ల బడ్జెటని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ విమర్శించారు. గత ఎన్నికల హామీలను నెరవేర్చకుండానే మరోసారి మోసపూరిత వాగ్దానాలతో ఎన్నికలకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేవలం 15 మంది నల్ల కుబేరులకు రూ.3.5లక్షల కోట్లు రుణమాఫీ ప్రకటించిన కేంద్రం అన్నదాతలకు రోజుకు రూ.17 విదిలించడం వారిని అవమానించడమేనన్నారు. పంటలకు 50 శాతం అదనపు మద్దతు ధర ఇస్తామని విఫలమయ్యారని మండిపడ్డారు. విత్తనాలు, పురుగుల మందు ధరలు పెరగడంతో పెట్టుబడి భారమై రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఎరువులు, ఫొటాష్‌పై జీఎస్టీ మరింత భారంగా మారిందన్నారు.

కాపీ కూడా కొట్టరాలె

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు: 'కేంద్ర సర్కారు ప్రవేశపెట్టింది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాదు. ఓట్ల కోసం పెట్టిన బడ్జెట్' అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గట్టు రాంచందర్‌రావు, చాడ కిషన్‌రెడ్డి, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో పాటు ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు పథకాన్ని కేంద్రం సరిగా కాపీ కొట్టలేకపోయిందని, రైతులకు బిచ్చం వేసినట్టు కేవలం ఆరు వేలు మాత్రమే ఇవ్వడం ఏంటని విమర్శించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రస్తావన లేకపోవడం దారుణమని, బీసీలను పూర్తిగా విస్మరించారని గట్టు మండిపడ్డారు. దేశంలో 700 యూనివర్సిటీలుంటే ఒక్క దానికైనా రూ.4 కోట్లు కేటాయించలేదని గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

'సౌతిండియాలో బీజేపీకి ఒక్క సీటు రాదు'

హైదరాబాద్, వెలుగు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సౌతిండియాలో బీజేపీ ఒక్క సీటు గెలుచుకోదని టీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ శనివారం అన్నారు. రైతులకు సాగు పెట్టుబడి కోసం కేంద్రం ఇచ్చేదానికంటే రాష్ట్రం ఇస్తున్న మొత్తమే ఎక్కువన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుబంధు తరహా పథకం మూడేళ్ల క్రితం ప్రవేశపెట్టి ఉంటే ఎక్కువ మందికి మేలు జరిగేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్‌కు ఎలా పట్టంకట్టారో లోక్‌సభ ఎన్నికల్లోనూ అలాంటి తీర్పే ఇస్తారని చెప్పారు.

ఓటరు నమోదుకు రేపటితో గడువు ముగింపు

- నేడు స్పెషల్ క్యాంపెయిన్

హైదరాబాద్, వెలుగు: ఓటరు నమోదుకు సోమవారంతో గడువు ముగుస్తుందని సీఈవో రజ త్‌కుమార్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేపడతామన్నారు. ఇప్పటికే ఓటర్‌జాబితాలో పేరున్నవారు తప్పులుంటే సవరించుకోవచ్చన్నారు. 2019 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సీఈవో విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించేందుకు ఫోన్ నెంబరు: 1950 లేదా సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆల్ ది బెస్ట్.. బాగా పనిచేయండి

- కొత్త సర్పంచ్‌లకు సీఎస్ జోషి శుభాకాంక్షలు

హైదరాబాద్, వెలుగు: కొత్తగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన సర్పంచ్‌లకు సీఎస్ ఎస్‌కే జోషి శనివారం శుభాకాంక్షలు తెలిపారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, హరితహారాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పటిష్టపరచాలన్నారు. ప్రజలకు పన్నులపై అవగాహన కల్పించి, గ్రామాభివృద్ధికి తోడ్పడేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి సర్పంచ్‌కి ప్రభుత్వ పథకాలు, సూచనలతో కూడిన హ్యాండ్‌బుక్ అందజేస్తామని, పంచాయతీ రాజ్ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.



సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సన్మాన కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, వి.హనుమంతరావు వర్గీయుల మధ్య ఘర్షణ



వీహెచ్‌ను సముదాయిస్తున్న భట్టి

గాంధీభవన్ సాక్షిగా డిష్యుం.. డిష్యుం

వీహెచ్ X నూతి శ్రీకాంత్

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ నేతల లొల్లి మరోసారి రచ్చకెక్కింది. గాంధీ భవన్ సాక్షిగా వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గీయులు గల్లలు పట్టుకున్నారు. తిట్ల పురాణం అందుకున్నారు. ఒకరి మీద ఒకరు పడి పిడిగుద్దులు గుద్దుకున్నారు. కుర్చీలు విసురుకున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సన్మాన సభ వీరి కొట్లాటకు వేదికైంది.

ఏం జరిగింది..!

సీఎల్పీ నేతగా బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్కకు శనివారం గాంధీభవన్‌లో పీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. అంబర్‌పేట నియోజకవర్గ నేత, ఓబీసీ సెల్ నగర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్ తన అనుచరులతో కలిసి భట్టిని సన్మానించేందుకు వేదికపైకి వెళ్లారు. అక్కడే ఉన్న మాజీ ఎంపీ వి.హన్మంతరావుకు నూతి శ్రీకాంత్ అనుచరులు తగిలారు. కావాలనే తనపై దాడికి అనుచరులను పురామయించారని భావించిన వీహెచ్.. వారిని తిట్టడం మొదలుపెట్టారు. దీంతో నూతి అనుచరులు 'వీహెచ్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. వీహెచ్ వర్గానికి చెందిన శ్రీకాంత్ అనే మరో నేత, ఇంకొందరు.. నూతి వర్గంపైకి దూసుకొచ్చారు. అంతే, పరిస్థితి అదుపుతప్పింది. ఒకరి గల్లలు ఒకరు పట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకున్నారు. కొందరు కుర్చీలను గాల్లోకి విసిరారు. ఫలితంగా సన్మాన సభ కాస్త కొట్లాట సభగా తయారైంది. వేదికపై ఉన్న నేతలు వారించడంతో ఇరువర్గాలు శాంతించినట్లే శాంతించి.. పీసీసీ చీఫ్ ఉత్తమ్ చాంబర్ వైపు తమ లొల్లిని మళ్లించాయి. అక్కడ వీహెచ్ వర్గీయులు.. నూతిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా వీహెచ్ అడ్డుకున్నారని నూతి వర్గీయులు ఆందోళనకు దిగారు. వీహెచ్ ఫిర్యాదు మేరకు నూతి శ్రీకాంత్‌ను బీసీ సెల్ నగర అధ్యక్షుడి పదవి నుంచి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చిత్తరంజన్ దాస్ తొలగించారు.

అంబర్‌పేట టు గాంధీభవన్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల నుంచి వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గీయులకు మధ్య పడటం లేదు. ఈ ఇద్దరిదీ హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గం. ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఇద్దరు నేతలు ఆశించినా పొత్తుల్లో భాగంగా టీజేఎస్‌కు వెళ్లింది. కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన శక్తి యాప్‌లో నూతి శ్రీకాంత్ అత్యధికంగా సభ్యులను చేర్పించి పీసీసీ చీఫ్ ఉత్తమ్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా కూడా వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గాల మధ్య గొడవ జరిగినట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అలా.. ఇద్దరి మధ్య విభేదాలు మొదలై గాంధీ భవన్ సాక్షిగా రచ్చకెక్కాయని అంటున్నాయి. ఇటీవల పార్టీ ఓటమిపై గాంధీభవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ గల్లలు పట్టుకొని కొట్టుకున్నారు. అది మరువక ముందే మరోసారి కాంగ్రెస్ నేతలు ఇలా తలపడటం క్యాడర్‌ను విస్మయానికి గురిచేస్తోంది.

- తిట్ల పురాణం.. పిడిగుద్దులు.. కుర్చీలతో కొట్లాట
- గల్లలు పట్టుకున్న ఇరువర్గాల అనుచరులు
- భట్టి సన్మాన సభ రసాభాస
- ఆపై ఉత్తమ్ చాంబర్‌లో లొల్లి
- ఓబీసీ సెల్ పదవి నుంచి నూతి తొలగింపు

భవిష్యత్తు మనదే : భట్టి

అసెంబ్లీ ఫలితాలతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశ చెందొద్దని, గడ్డు పరిస్థితులు పార్టీకి కొత్తేమి కాదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. 'భవిష్యత్తు మనదే. మళ్లీ అధికారంలోకి వస్తాం. ఆందోళన చెందొద్దు' అని సన్మాన సభలో అన్నారు. 'మందబలంతో మమ్మల్ని కట్టడి చేయాలని టీఆర్ఎస్ నేతలు చూసినా వాళ్ల వల్ల కాలేదు. సామాజిక తెలంగాణ కోసం పోరాడుతాం. బడుగు, బలహీన వర్గాలను గుర్తించేది కాంగ్రెస్సే' అన్నారు. రాష్ట్ర కమిటీలో, పార్టీ కార్యవర్గంలో బీసీలకు 40% పదవులివ్వాలని పీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ చిత్తరంజన్ దాస్ అన్నారు.

నేడు యాదాద్రికి సీఎం



హైదరాబాద్/యాదాద్రి, వెలుగు: సీఎం కేసీఆర్ ఆదివారం యాదాద్రిలో పర్యటిస్తారు. ఉదయం 10.30 గంటలకు ప్రగతి భవన్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుంటారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశాక ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి పనులపై అధికారులకు సూచనలిస్తారు. తర్వాత అధికారులు, స్థపతులు, వైటీడీఏ వైస్ చైర్మన్, సభ్యులతో సమీక్షిస్తారు. కాగా, భువనగిరి మండలం వడాయిగూడెంలోని హెలిప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేశారు. శనివారం రాత్రి డీసీపీ రామచంద్రారెడ్డి, భువనగిరి ఆర్డీవో భూపాల్‌రెడ్డి హెలిప్యాడ్‌ను పరిశీలించారు. గుట్టపై పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. వడాయిగూడెం నుంచి యాదాద్రి వరకు బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేసింది. ప్రధాన ఆలయ పనులు చివరి దశకు వచ్చాయి. గర్భగుడి పనులు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ రాజగోపురాల పనులు అయిపోయాయి. తిరుమాడ వీధుల పనులు కొనసాగుతున్నాయి. స్వామివారి కల్యాణ మండపం పనులను శనివారం ప్రారంభించారు. శివాలయ నిర్మాణ పనులనూ వేగవంతం చేశారు. నెలాఖరులో నిర్వహించే బ్రహ్మోత్సవాల నాటికి ప్రధానాలయం, శివాలయం, కల్యాణ మండపం, విష్ణు పుష్కరిణి పనులను పూర్తి చేసి స్వామివారి స్వయంభూదేవాలయాన్ని ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రధాన ఆలయంలో నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ సీఎస్ జోషి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి రోజూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

కొత్త సర్పంచులకు రేపు ట్రైనింగ్

కొత్త సర్పంచులకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేసిన 300 మందిని మాస్టర్ ట్రైనర్స్‌గా రెడీ చేస్తున్నారు. సోమవారం రాజేంద్రనగర్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయా రంగాల నిపుణులు, ఉన్నతాధికారులు వీరికి శిక్షణ ఇస్తారు. తర్వాత వీరిని జిల్లాల వారీగా విభజించి సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

బడ్జెట్ బాగుండాలె

(మొదటిపేజీ తరువాయి..)

మిషన్ భగీరథ, కాకతీయలకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలంటూ నీతి ఆయోగ్ సిఫార్సు చేసినా కేంద్రం ఇంతవరకు నయా పైసా ఇవ్వలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని పలు సందర్భాల్లో ప్రధాని, కేంద్ర జల వనరుల శాఖ మంత్రిని సీఎం కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కాళేశ్వరానికి కనీసం రూ.10 వేల కోట్ల సాయం చేయాలని ప్రధానిని కోరినా ఎలాంటి హామీ దక్కలేదు. కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలపై విన్నవించినా ఏపీకి ఎక్కువ ఇచ్చి తెలంగాణకు తక్కువగా కేటాయించారు. జాతీయ రహదారులుగా గుర్తించినా వాటి విస్తరణపై చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్లలో కేంద్ర ప్రభుత్వ వాటా ఒక్కో పింఛన్‌కు రూ.200గా ఉంది. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కూడా ఇలాగే ఉంటుందని ఆశించినా కేంద్రం అందుకు విరుద్ధంగా నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని పేర్కొంది. ఈ పథకంపైనా రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. కేంద్ర ప్రాయోజిత పథకాలు, గ్రాంట్లు, పన్నుల్లో వాటా రూపేణ ఆశించిన మేర ఆదాయం సమకూరడం లేదు. ఈ అంశాలన్నింటినీ పేర్కొంటూ ఆర్థిక సంఘానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సీఎం సూచించినట్టుగా తెలిసింది. రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం పర్యటనపైనా సీఎం అధికారులతో చర్చించినట్టుగా తెలిసింది. ఈ నెల 18 నుంచి 20 వరకు రాష్ట్రంలో ఆర్థిక సంఘం బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా రాష్ట్రం ప్రాధాన్యాలను కళ్లకు కట్టేలా సిఫార్సులు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించినట్టుగా సమాచారం.



ఆటో బాబు

ఆటోలపై జీవితకాల పన్ను రద్దు చేసినందుకు ఏపీ సీఎం చంద్రబాబుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పెద్ద సంఖ్యలో బాబు నివాసానికి చేరుకున్న ఆటో డ్రైవర్లు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బాబు ఖాకీ చొక్కా వేసుకొని ఆటో నడిపి అందరిలో హుషారు నింపారు. ఇంధన చార్జీలు, ఇన్సూరెన్స్ భారం కూడా తగ్గించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- విజయవాడ, వెలుగు

జీవితాలను మార్చే శక్తి చదువుకే

- ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ఏపీ సీఎం

హైదరాబాద్, వెలుగు: జీవితాలను మార్చే శక్తి చదువుకే ఉందని, పిల్లలకు తల్లిదండ్రులు ఎంత మంచి చదువు చెప్పిస్తారనేదే ముఖ్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శనివారం హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మోడల్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఒకప్పుడు పార్టీ కార్యకర్తల పిల్లలకే ఇక్కడ ఉచిత విద్య అందించే వాళ్లమని, ఇపుడు పేద పిల్లలకూ చదువు చెప్పిస్తున్నామన్నారు. మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి రానున్న రోజుల్లో ఓ వ్యవస్థగా, యూనివర్సిటీగా తీర్చిదిద్దుతారని అన్నారు. నాణ్యమైన విద్యకు ట్రస్ట్ ఎక్కువ ప్రాధాన్యమిస్తోందని భువనేశ్వరి చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చంద్రబాబు అవార్డులు అందచేశారు. ఏపీ మంత్రి లోకేశ్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

3 ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో నోటిఫికేషన్

ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో..

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. అక్కడ ఓటరు నమోదు ప్రక్రియ పూర్తవడంతో ఈనెల రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ జారీ చేసేందుకు రెడీ అయింది. ఓటరు నమోదు గడువు పొడిగించాలని విజ్ఞప్తులు వచ్చినా ఢిల్లీ నుంచి ఆదేశాలు అందలేదని సీఈవో వర్గాలు తెలిపాయి. మార్చి 29 నాటికి రెండు టీచర్స్, ఓ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల పదవీకాలం ముగుస్తుంది. దీంతో అక్కడ ఓటర్ల నమోదు చేపట్టగా శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 81,332 ఓట్లు నమోదయ్యాయి. పాతూరి సుధాకర్‌రెడ్డి (టీచర్స్ ఎమ్మెల్సీ) ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 8,874 ఓట్లు.. పూల రవీందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలో 2,555 ఓట్లు నమోదయ్యాయి.



ఉవ్వెత్తున ఎగిసిన అల

పోర్చుగల్ పశ్చిమ తీరంలోని నార్త్ బీచ్‌లో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలివి. పది మీటర్ల ఎత్తు వరకూ ఎగిసిపడుతున్న ఈ భారీ అలలను నజారే లైట్‌హౌజ్ రూఫ్‌నుంచి దగ్గరగా చూడొచ్చు. పెనుగాలులతో విరుచుకుపడే ఈభారీ అలలను చూసేందుకు టూరిస్టులు ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు.

మన అంగట్ల ఫారిన్ పండ్లు

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్నాయి. దేశీయ పండ్ల మార్కెట్ దాదాపు రూ.750 కోట్ల దాకా ఉంది. ఇవిగాకుండా మరో రూ.100 కోట్ల విలువైన విదేశీ పండ్ల వ్యాపారం జరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రోజుకు కోటిన్నర రూపాయల పండ్ల వ్యాపారం ఒక్క హైదరాబాద్ మార్కెట్‌లోనే జరుగుతోంది. సూపర్ మార్కెట్లు, మాల్స్‌లలో ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. కివీ ఫ్రూట్స్ రోజుకు 50 క్వింటాళ్లు, కినోవా 1855 క్వింటాళ్లు అమ్ముడవుతున్నాయి.

మన పండుపై ప్రభావం

ఫారిన్ ఫ్రూట్లు పోటెత్తడంతో దేశీయ పండ్ల మార్కెట్ కుదేలవుతోంది. కొన్ని రకాల దేశీ పండ్లకు గిరాకీ తగ్గిపోతోంది. మన జామకాయకు పోటీగా థాయ్‌లాండ్ జామ వచ్చింది. అమెరికా, చైనా తదితర విదేశీ రకాల యాపిల్ పండ్లు కాశ్మీరీ , సిమ్లా యాపిల్‌పండ్ల మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. సీతాఫలాల్లోనూ విదేశీ రకాలు వచ్చి దేశీ రకాలకు సవాల్ విసురుతున్నాయి. రేగుపండ్లు, గంగరేగు పండ్లు, తునికి పండ్లు, సహజంగా విత్తనాలతో వచ్చే నల్ల ద్రాక్ష పండ్ల మార్కెట్ తగ్గిపోయింది. సీడ్ లెస్ గ్రేప్స్ రావడంతో మన ద్రాక్ష పండ్ల బిజినెస్ తగ్గుతోంది. మరోవైపు విదేశీ పండ్ల డిమాండ్ నేపథ్యంలో కొందరు రైతులు ఇక్కడ కూడా అలాంటివి కొన్ని పండిస్తున్నారు. మలేసియా, వియత్నాం. మెక్సికో, కోస్టారికా, ఆస్ట్రేలియాలో పండే డ్రాగన్ ఫ్రూట్‌ను తక్కువ నీటితో పండించే అవకాశం ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా దాని సాగును ప్రోత్సహిస్తోంది. ఒక ఎకరాను యూనిట్‌గా తీసుకుని మూడున్నర లక్షల రాయితీ కల్పిస్తోంది. ఆపిల్ బేర్, లిచీ, అవకాడో, పాషన్ ఫ్రూట్, పర్పుల్ మ్యాంగోస్టీన్ వంటి విదేశీ రకాలనూ అక్కడక్కడ సాగు చేస్తున్నారు.

నియంత్రణ ఏది?

విదేశీ పండ్లను నియంత్రించే వ్యవస్థ లేకపోవడంతో అవి మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయన్న విమర్శలున్నాయి. వాటిని ఎక్కడ, ఎలా పండించారు? ఏయే మందులు వాడారు? తాజాగా ఉంచేందుకు ఎలాంటి కెమికల్స్ వాడుతున్నారన్న వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఫారిన్ ఫ్రూటు- మస్తు రేటు (రూ.ల్లో)

అమెరికా యాపిల్ (20 కేజీ బాక్స్)	3,500-4000
చెర్రీ:	కేజీ. 2,000-2,500
కివీ: హోల్‌సేల్‌గా	కేజీ. 250. విడిగా 15-20
ప్లమ్:10 కేజీలు	3,500-4,000
అవకాడో:	కేజీ. 250-400
పియర్స్:	కేజీ. 200-400
సౌతాఫ్రికా ఆరెంజ్:	15 కేజీల బాక్స్ 2,000
రెడ్ గ్రేప్:	కేజీ. 250-300
డ్రాగన్ ఫ్రూట్:	కేజీ. 100-170
గ్రీన్ గ్వావా (థాయ్ జామ):	కేజీ. 100-150



ఇక్కడ కూడా పండిద్దాం..

దేశీయ పండ్లను ప్రోత్సహిస్తూనే విదేశీ రకాలను సాగు చేసేందుకు అనువైన పరిస్థితులు అన్వేషిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి దేశీయ పండ్లను ఎక్స్‌పోర్ట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పండ్లు, పండ్ల రసాలతో చేసిన పల్ప్, జ్యూస్, జామ్‌లు తదితర ఉత్పత్తులను మార్కెట్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- సి.పార్థసారథి,
వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

రాయితీలు ఇస్తున్నాం

విదేశీ పండ్లకున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోనూ వాటి సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. డ్రాగన్ ఫ్రూట్, యాపిల్ బేర్, థాయ్ జామ రకాలు సాగు చేస్తున్నారు. కాప్సికమ్, కార్న్ వెజిటబుల్ రకాలను కూడా సాగు చేయిస్తున్నాం. డ్రాగన్ ఫ్రూట్ పండించే రైతులకు రాయితీ కల్పిస్తున్నాం.

- వెంకట్రామిరెడ్డి,
సంచాలకులు, ఉద్యాన శాఖ




గౌరవాధ్యక్ష పదవులకు కవిత రాజీనామా

హైదరాబాద్, వెలుగు: అన్ని సంఘాల గౌరవాధ్యక్ష పదవులకు నిజామాబాద్ ఎంపీ కవిత రాజీనామా చేశారు. తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్, తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘాల గౌరవ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. శనివారం సంబంధిత సంఘాల ప్రధాన కార్యదర్శులకు రాజీనామా లేఖలు పంపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు మరింత సమయం కేటాయించేందుకు బాధ్యతల నుంచి తప్పుకున్నానని కవిత తెలిపారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు, లాభాల్లో వాటా పెంపు, విద్యుత్ కార్మికులకు ఫిట్‌మెంట్, కాంట్రాక్టు జూనియర్ లైన్‌మన్ల రెగ్యులరైజేషన్, అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్ల వేతనాల పెంపునకు కవిత కృషి చేశారు.

తనిఖీలేవి సారూ

హైదరాబాద్, వెలుగు:

'కేరళ విద్యా విధానం చాలా బాగుంది. అక్కడి సర్కారు పాఠశాలల్లో ఉన్నత వర్గాల పిల్లలు కూడా చదువుతారు. మరి మన రాష్ట్రంలో ఎందుకు అలా చేయడం లేదు. మన విద్యా విధానంలో మార్పు రావాలి' అని రాష్ట్ర హైకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు విద్యను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారుల తీరుతో బోధన కుంటుపడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. పాఠశాలల పనితీరును పరిశీలించి, మెరుగైన బోధన జరిగేలా చూడాల్సిన విద్యాశాఖ మాత్రం తనిఖీలు నిర్వహించడానికి ఆసక్తి చూపడం లేదు. ఏటా రెండు సార్లు తనిఖీ చేయాల్సి ఉన్నా రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్టీ) అధికారుల తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో 38 వేలకు పైగా ప్రభుత్వ, లోకల్‌బాడీ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 50లక్షల మంది దాకా చదువుతున్నారు. విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంచేందుకు ఐదేళ్ల క్రితం నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ సిస్టం అమలుతో పాటు టీచర్ల బోధన విధానాలు, పాఠశాలల్లో వసతులు ఇతర అంశాలను పర్యవేక్షించేందుకు విద్యాశాఖ తనిఖీ చేయాల్సి ఉంటుంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు నెలలకు, ముగింపునకు మూడు నెలల ముందు తనిఖీలు చేపట్టాలి. రాష్ట్రస్థాయి టీములు తనిఖీలకు వస్తున్నాయంటే టీచర్లు, హెచ్‌ఎంలు బోధనపై దృష్టిపెట్టే అవకాశం ఉంటుంది. కొందరు అధికారులు ఇందుకు ఎన్నికలను సాకుగా చూపుతున్నట్టు తెలుస్తోంది. గత సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం రద్దైంది. అప్పటికే జిల్లా, రాష్ట్ర తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ పనిచేయలేదు. చాలాచోట్ల ఇన్‌చార్జిలుగా డీఈవోలు, ఎంఈవోలు ఉండడంతో తనిఖీలు చేయడానికి ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలొస్తున్నాయి.



- ఎస్‌సీఈఆర్టీ, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం
- నేటికీ తనిఖీ బృందాలు ఏర్పాటు చేయని వైనం
- బోధన మెరుగుపడేలా చూడాలంటున్న విద్యావేత్తలు



విచ్చలవిడిగా స్కానింగ్‌లు

ఏటా రాష్ట్రంలో 15 లక్షలు

- లింగ నిర్ధారణకోసమే ఎక్కువ పరీక్షలు
- నియంత్రణకు ప్రభుత్వం చర్యలు
- వివరాలివ్వాలని స్కానింగ్ సెంటర్లకు ఆదేశాలు
- రాజస్థాన్ తరహాలో త్వరలో 'ముఖ్బీర్ యోజన'

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో గర్భిణులకు స్కానింగ్‌లు పెరిగిపోతున్నాయి. గర్భస్థ పిండం ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు నిర్వహించే స్కానింగ్‌ను, లింగ నిర్ధారణ కోసం వినియోగించుకుంటున్నారు. అప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రుల్లో చాలా మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు డబ్బులు ఇచ్చి పుట్టబోయేది ఆడ బిడ్డో, మగ బిడ్డో తెలుసుకుంటున్నారు. ఇలా ఏటా 13 నుంచి 15 లక్షల స్కానింగ్‌లు జరుగుతున్నాయి. ఏడాదికి 6.5 లక్షల ప్రసవాలు నమోదవుతున్నాయి. గర్భిణిగా ఉన్న సమయంలో వారికి కనీసం రెండు సార్లు స్కానింగ్ చేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైద్య, ఆరోగ్య శాఖలో నియమించిన ప్రత్యేక నోడల్ అధికారి రోజూ జరుగుతున్న స్కానింగ్ టెస్ట్‌లపై ఆరా తీస్తున్నారు. స్కానింగ్ రిపోర్టులను వైద్య, ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లోకి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆస్పత్రులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో 3,700 స్కానింగ్ సెంటర్లు ఉండగా వాటిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 163, ప్రైవేట్ కింద 3,537 ఉన్నాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోని 1,147 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఈ స్కానింగ్ సెంటర్లన్నింటికి యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ఇచ్చారు.

20 రోజుల్లో 75 వేల స్కానింగ్‌లు

రాష్ట్రవ్యాప్తంగా గత 20 రోజుల్లో 75 వేల స్కానింగ్ రిపోర్టులు అప్‌లోడ్ అయ్యాయి. ఇందులో 20 వేల రిపోర్టులు హైదరాబాద్‌లో జరిగినవే. మొత్తం రిపోర్టుల్లో 5 నుంచి 10 శాతం రిపోర్టులను పీహెచ్‌సీల స్థాయిలో తప్పనిసరిగా ఆడిట్ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు.

వివరాలన్ని ఫామ్–ఎఫ్‌లో..

స్కానింగ్‌కు వచ్చిన గర్భిణుల వివరాలను డయాగ్నస్టిక్ సెంటర్లలోని ఫామ్-ఎఫ్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. సెంటర్ పేరు, రిజిస్ట్రేషన్ నంబర్, గర్భిణి పేరు, తండ్రి, భర్త పేర్లు, అంతకుముందు పిల్లలు ఉంటే ఎంత మంది ఉన్నారు.. తదితర వివరాలు తెలియజేయాలి. స్కానింగ్‌కు పంపిన డాక్టర్ వివరాలు పేర్కొనాలి. అంతేగాక పుట్టబోయేది ఆడో, మగో తాను తెలుసుకోలేదని స్కానింగ్ చేయించుకున్న గర్భిణి సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. తాము స్కానింగ్ మాత్రమే నిర్వహించామని, లింగ నిర్ధారణ చేయలేదని సంబంధిత డాక్టర్ కూడా ధ్రువీకరిస్తూ ఫామ్-ఎఫ్‌లోని డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది.

నిఘా ఇలా..

ఫామ్-ఎఫ్‌లోని వివరాల ప్రకారం అప్పటికే ఒకరు లేదా ఇద్దరు, ముగ్గురు కూతుళ్లు ఉన్న గర్భిణులను హైదరాబాద్‌లోని నోడల్ ఆఫీసర్, సహాయక సిబ్బంది గుర్తిస్తారు. వివరాలను జిల్లా స్థాయి అధికారులకు పంపి ఎంక్వైరీ చేయమంటారు. వారి ఆదేశాలతో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ వెళ్లి ఆరా తీస్తారు. అప్పటి నుంచి అనుమానం ఉన్న గర్భిణిపై నిఘా పెంచుతారు. ఆమెకు అబార్షన్ జరిగినట్లు తెలిస్తే లోతుగా విచారణ జరుపుతారు. లింగ నిర్ధారణ తర్వాతే అబార్షన్ జరిగిందని తేలితే స్కానింగ్ సెంటర్, గర్భిణి కుటుంబంపై చర్యలు తీసుకుంటారు.

గతేడాది 10 సెంటర్లపై కేసులు

2018లో రాష్ట్రంలో 10 స్కానింగ్ సెంటర్లపై కేసులు నమోదు కాగా, వాటిలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సెంటర్లు ఆరు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి, మేడ్చల్ జిల్లాల్లో రెండు చొప్పున, హైదరాబాద్, కరీంనగర్‌లో ఒకటి చొప్పున సీజ్ అయ్యాయి. పక్కా సమాచారంతో, పోలీసుల సహకారంతో సర్చ్ చేసి ఈ స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే రికార్డులు సరిగ్గా నిర్వహించని మూడు సెంటర్లు, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మరో సెంటర్‌పై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు.

త్వరలో ఇన్‌ఫార్మర్ ఇన్సెంటివ్ స్కీమ్

లింగ నిర్ధారణ పరీక్షలపై సమాచారమిచ్చే ఇన్‌ఫార్మర్లకు రాజస్థాన్ ప్రభుత్వం రూ.2.50 లక్షల బహుమతి ఇస్తోంది. ఇన్‌ఫార్మర్లు స్కానింగ్ సెంటర్లకు ముందుగా నకిలీ గర్భిణిని తీసుకెళ్తారు. అక్కడ లింగ నిర్ధారణ చేస్తున్నట్లుగావారి స్టింగ్ ఆపరేషన్లో తేలితే.. ఇన్‌ఫార్మర్‌కు రూ. లక్ష, గర్భిణిగా నటించే మహిళకు రూ.లక్ష, ఆమెకు సాయంగా వచ్చే వ్యక్తికి రూ.50 వేలు అందజేస్తున్నారు. ముఖ్బీర్ యోజన(ఇన్‌ఫార్మర్ ఇన్సెంటివ్) పేరుతో రాజస్థాన్‌లో అమలవుతున్న ఈ స్కీమ్‌ను రాష్ట్రంలోనూ అమలు చేస్తే సత్ఫలితాలనిస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఆమోదం తెలిపితే లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

త్వరలో జెడ్పీల విభజన!

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్ (జెడ్పీ)లూ పెరగనున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు పాత పాలకవర్గాలతోనే జెడ్పీలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలవారీగా తొమ్మిది జిల్లా పరిషత్‌లున్నాయి. 2016 అక్టోబర్ 2 నుంచి 31 కొత్త జిల్లాలు అమలులోకి వచ్చాయి. ఇందులో హైదరాబాద్ మినహా 30 జిల్లాలకు కొత్తగా జెడ్పీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ములుగు, నారాయణపేట జిల్లాలను ప్రకటించారు. ఇందుకు సంబంధించి గత డిసెంబర్ 31న నోటిఫికేషన్ విడుదలైంది. వీటిపై అభ్యంతరాలకు నెల రోజులు గడువిచ్చారు. అది కూడా పూర్తయిన నేపథ్యంలో కొత్త జిల్లాల ప్రక్రియ త్వరలో పూర్తికానుంది. ఆ వెంటనే జెడ్పీ ఎలక్షన్లకు వెళ్లే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 50కి పైగా కొత్త మండలాలు, 4,383 పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు పెరగనున్నాయి.

జూన్‌లో జెడ్పీ ఎలక్షన్స్!

ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ ఏడాది జూన్ 1న ముగుస్తుంది. అప్పటిలోగా కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌లు ఏర్పాటుచేసి యంత్రాంగాన్ని సమకూర్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశముంది. మరోవైపు ఈ నెల చివర్లో లేక మార్చి తొలి వారంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది. అవి పూర్తయిన వెంటనే జూన్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.



- ఈ నెలలోనే గైడ్‌లైన్స్ విడుదలకు అవకాశం
- రెండు కొత్త జిల్లాలు ఏర్పడిన వెంటనే నిర్ణయం
- జూన్ 1తో ముగియనున్న జెడ్పీల పదవీకాలం

ముగ్గురు జెడ్పీటీసీలతో జెడ్పీ.. ఎలా?

కొత్తగా ఏర్పడిన మేడ్చల్ జిల్లాలో 14 మండలాలున్నా ప్రస్తుతం మూడింటికి, వరంగల్ అర్బన్ జిల్లాలో 11 మండలాలున్నా ఐదు మండలాలకే జెడ్పీటీసీలున్నారు. ఇంత తక్కువ జెడ్పీటీసీలతో జిల్లా పరిషత్‌ను ఎలా ఏర్పాటు చేస్తారనే సందేహాలున్నాయి. అందుకే జెడ్పీటీసీల సంఖ్య పెరగనుందని అంటున్నారు.

గైడ్‌లైన్స్ మార్చే యోచన

- ఉమ్మడి జెడ్పీల్లో 40పైనే జెడ్పీటీసీ స్థానాలున్నాయి. ప్రస్తుత జిల్లాల్లో ఆ పరిస్థితి లేదు. కొత్తగా ఏర్పాటయ్యే ములుగు, నారాయణపేట జిల్లాలతోపాటు ఇప్పటికే ఉన్న జిల్లాల్లో మండలాల సంఖ్య తక్కువగా ఉంది.
- ఆయా జెడ్పీటీసీ పరిధిలో ఉన్న జనాభా మధ్య భారీ వ్యత్యాసాలున్నాయి. వీటిని తగ్గించే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.
- ప్రస్తుతం ప్రతి మండల పరిషత్ ఏరియా ఒక్కో జెడ్పీటీసీ పరిధిగా కొనసాగుతోంది. కొన్ని మండలాల్లో 15వేల జనాభా ఉండగా మరికొన్ని చోట్ల 50వేల వరకు జనాభా ఉంది.
- వీటిని సవరించి ఒక్కో జెడ్పీ స్థానం పరిధిలో 10వేల జనాభా ఉండేలా గైడ్‌లైన్స్ మార్చనున్నట్టు తెలుస్తోంది. ఇలాచేస్తే పెద్ద మండలాల్లో రెండు జెడ్పీటీసీ స్థానాలూ ఉండొచ్చు.
- ఉమ్మడి జిల్లాల్లో 465 మండలాలుండగా కొత్తగా 55 వచ్చి చేరాయి. దీంతో ఎంపీటీసీల సంఖ్య కూడా పెరగనుంది. వీటితోపాటే జెడ్పీటీసీ స్థానాల పరిధి మారే అవకాశాలున్నాయి.



ఒకే చోట 40 మమ్మీలు

ఒకటి కాదు.. రెండు కాదు.. 40 మమ్మీలు.. ఒకే చోటు.. మమ్మీలకు పుట్టినిల్లయిన ఈజిప్టులోనే కనుక్కున్నారు. దక్షిణ కైరోలోని మిన్యా ప్రావిన్స్‌లో రాతి సమాధుల్లో వీటిని గుర్తించారు. అందులో 10 మమ్మీలు చిన్నపిల్లలవేనని పురాతత్వ శాస్త్రవేత్తలు చెప్పారు. వాళ్లందరూ మధ్య తరగతి కుటుంబీకులే అంటున్నారు. బైజాంటిన్ లేదా ఎర్లీ రోమన్ లేదా టాలమిక్ కాలానికి చెందిన వారని భావిస్తున్నారు. అప్పట్లో ఆ కుటుంబాలు వాడిన పాత్రలు, వస్తువులు, రంగు రంగుల మమ్మీ కేసులనూ వెలికితీశారు.

ఈ నెల 5న ప్రత్యేక దర్శన టికెట్లు విడుదల

తిరుమల, వెలుగు: మే నెల కోటాకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను 5న విడుదల చేస్తామని టీటీడీ శనివారం ప్రకటించింది. ఆన్‌లైన్, ఈ దర్శన్ కౌంటర్లు, పోస్టాఫీసుల్లో ఈ టికెట్లు అందుబాటులో ఉంటాయంది. భక్తులు ఆన్‌లైన్‌లో ముందస్తు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

షర్మిల కేసులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, వెలుగు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యమైన పోస్టింగ్స్ పెట్టిన కేసులో నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరుకు చెందిన స్టూడెంట్ ఈ పోస్ట్‌లు పెట్టినట్లు ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించారు. ఇతడిని హైదరాబాద్‌కు తరలించారు.



ప్రయాణికుడి లగేజీలో చిరుతపిల్ల

చెన్నై: చెన్నై ఎయిర్ పోర్టులో అక్రమంగా తరలిస్తున్న చిరుతపిల్లను అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఓ ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా చిరుతపిల్ల బయటపడింది. నిందితుడిని బ్యాంకాక్ నుంచి వచ్చిన ఖాజా మొయిద్దీన్ గా గుర్తించారు. చిరుత పిల్లను చెన్నైలోని అన్నా జూవాలాజికల్ పార్క్ కు తరలించారు. తదుపరి విచారణ కోసం మొయిద్దీన్ ను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

దుర్గమ్మను దర్శించుకున్న సీజేఐ గొగొయ్

విజయవాడ, వెలుగు: ఏపీ హైకోర్టు ప్రారంభోత్సవానికి శనివారం విజయవాడ చేరుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తి ఎన్.వి.రమణ సతీసమేతంగా కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆలయ పండితులు వారికి స్వాగతం పలికారు. పంచ హారతుల తర్వాత న్యాయమూర్తులకు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను ఈవో కోటేశ్వరమ్మ అందజేశారు.

ఆదివారం | హైదరాబాద్
03.02.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

ఆ ముగ్గురితో.. మోడీకి ముచ్చెమటే!

ప్రియాంక కాంగ్రెస్ తురుపు ముక్క | దళితుల ఆశాకిరణం మాయావతి | ఫైర్‌బ్రాండ్ మమత

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ముగ్గురు మహిళల నుంచి బీజేపీ కి సవాల్ ఎదురుకానుంది.ఈ ముగ్గురూ వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వారు. వారి నేపథ్యం వేరు. వారు రాజకీయాల్లోకి ప్రవేశించిన పరిస్థితులు వేర్వేరు. అయినా ఈ ముగ్గురూ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని సవాల్ చేయబోతున్నారు. వీరే ప్రియాంక గాంధీ, మమతా బెనర్జీ, మాయావతి.



న్యూఢిల్లీ : ప్రియాంక గాంధీ లేటెస్ట్ గా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆమెకు చాలా కాలం నుంచి రాజకీయాలతో సంబంధాలు లేకపోలేదు.అమ్మ సోనియా, అన్న రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారానికే ఆమె పరిమితం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న అనేక కీలక నిర్ణయాల్లో కూడా ఆమె పాత్ర ఉంది. రాహుల్ చెల్లిగా కొన్ని కీలక సమయాల్లో చక్రం తిప్పారు. మూడు హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు, ముఖ్యమంత్రుల నియామకంలో ప్రియాంక మాటే చెల్లుబాటు అయింది. లోక్ సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో ప్రియాంక ను ఒప్పించి ఆమెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావడంలో రాహుల్ సక్సెస్ అయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ పదవి అప్పగించి ఉత్తరప్రదేశ్ లో కీలకమైన తూర్పు ప్రాంత బాధ్యతలు అప్పగించారు.

బీజేపీని కట్టడి చేయడానికి టీఎంసీ మాస్టర్ ప్లాన్

లోక్ సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ వరకు బీజేపీని కట్టడి చేయడానికి మమతా బెనర్జీ మాస్టర్ ప్లాన్ వేశారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 42 సీట్లలో 34సీట్లు తృణమూల్ కాంగ్రెస్ గెలుచుకుంది.

అలుపెరుగని పోరాటం



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ నుంచి ప్రధాని మోడీ సవాల్ ఎదుర్కోబోతున్నారు. ప్రస్తుత దేశ రాజకీయాల్లో మమతా బెనర్జీ అంటే ఓ ఫైర్ బ్రాండ్. అస్సాం జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్నార్సీ) వివాదం సహా ఎన్డీయే సర్కార్ అనుసరిస్తున్న అనేక విధానాలపై పార్లమెంటు లోపల, బయటా అలుపెరుగని పోరాటం చేస్తున్న మహిళా నేత. ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా ఏర్పాటైన మహాకూటమిలో ఆమె ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. గతనెల 19న కోల్ కతాలో బీజేపీయేతర ప్రతిపక్షాల మెగా బహిరంగ సభను సక్సెస్ చేశారు.

బీజేపీకి రెండు సీట్లు దక్కాయి. ఈసారి మొత్తం 42 సీట్లను మమత టార్గెట్ చేశారు. బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా మాస్టర్ ప్లాన్ వేశారు.

మోడీయే ఇప్పటికీ పాపులర్

ప్రియాంక, మమత, మాయావతి వంటి లీడర్లు ఎంతమంది ఉన్నా, ప్రస్తుత రాజకీయాల్లో ఇప్పటికీ ప్రధాని మోడీయే పాపులర్ అని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఆయనకున్న చరిష్మా మరే నేతకు లేదన్నారు. మహిళాభివృద్ధి కోసం ఎన్డీయే సర్కార్ అనేక పనులు చేసిందన్నారు. ‘ బేటీ పడావో, బేటీ బచావో ’ వంటి పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి ఆడవారు గౌరవంగా బతికేలా చేసిందన్నారు. నాలుగున్నరేళ్లుగా మోడీ ప్రభుత్వం అనేక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు.




పక్కా ఓటుబ్యాంకు

ప్రధాని మోడీ నాయకత్వానికి సవాల్ విసురుతున్న మరో మహిళ ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం,బీఎస్పీ చీఫ్ మాయావతి. దేశంలో 16.6 శాతం ఉన్న దళిత వర్గానికి ఆమె జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఆమె పార్టీకి ఫిక్స్ డ్ ఓటు బ్యాంక్ ఉంది. మంచి కేడర్ ఉంది. ఓబీసీలపై పట్టున్న సమాజ్ వాది పార్టీతో మాయావతి పార్టీ లేటెస్ట్ గా పొత్తు పెట్టుకుంది.ఇప్పటికే యూపీ వరకు ఎస్పీ,బీఎస్పీ కూటమి బీజేపీకి సవాల్ విసురుతోంది. మాయావతి కార్యక్షేత్రం మౌలికంగా ఉత్తరాది రాష్ట్రాలైనప్పటికీ దేశమంతా ఆమెకు ఒక సక్సెస్ ఫుల్ ముఖ్యమంత్రి ఇమేజ్ ఉంది. యూపీ లాంటి అత్యంత కీలకమైన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో శాంతిభద్రతలను బాగా కంట్రోల్ చేశారన్న పేరు తెచ్చుకున్నారు.

నానమ్మలా ప్రభావితం చేస్తారా ?



అచ్చు నానమ్మ ఇందిరలా ఉండే ప్రియాంక మొత్తం ఉత్తరప్రదేశ్ నే ప్రభావితం చేస్తారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సమాజ్ వాది పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూటమిగా ఏర్పడ్డ నేపథ్యంలో యూపీలో కాంగ్రెస్ ఒంటరిపోరుకు సిద్ధమైన పరిస్థితుల్లో తురుపుముక్కగా ప్రియాంక ను రాహుల్ ప్రయోగిస్తున్నారు. ఇందిర పోలికలు ఉండటమే కాదు దూకుడు మనస్తత్వం కూడా ప్రియాంకకు వారసత్వంగా వచ్చింది. యూపీ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రియాంక మీద బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఇందిర కుటుంబాన్ని అభిమానించే వారందరినీ ప్రియాంక ఒక తాటి మీదకు తెస్తారని భావిస్తున్నారు. బీజేపీకి సంప్రదాయ ఓటుబ్యాంకుగా ఉన్న కొన్ని సామాజిక వర్గాలు ప్రియాంక రాకతో కాంగ్రెస్ వైపు వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



4,000 మందిపై జీఎం వేటు!

న్యూయార్క్: పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ సుమారు నాలుగు వేల మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పొదుపు చర్యల్లో భాగంగా 15 శాతం ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తామని గత ఏడాది నవంబర్ లో జనరల్ మోటార్స్ ప్రకటించింది. ఉత్తర అమెరికాలోని ఐదు ప్లాంట్లతోపాటు మొత్తం ఏడు ప్లాంట్లు మూసివేస్తామని వెల్లడించింది. జనరల్ మోటార్స్ నిర్ణయంతో దాదాపు 14 వేల మంది ఉద్యోగాలు కోల్పోవచ్చని అమెరికా మీడియా అంచనా వేసింది. దీనిపై మాట్లాడేందుకు ఆ కంపెనీ అధికార ప్రతినిధి నిరాకరించారు. దాదాపు 2,300 మంది స్వచ్ఛందంగా వైదొలుగుతారని, 1,500 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తారని సమాచారం. కెనడాలోని ఒంటారియో ప్లాంట్ మూసివేతతో 3 వేల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. జనరల్ మోటార్స్ నిర్ణయాన్ని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్ ఖండించారు.

పాక్‌కు చైనా సాయం

2.5 బిలియన్‌డాలర్ల రుణానికి ఆమోదం



ఇస్లామాబాద్: విదేశీ మారక నిల్వలు అడుగంటిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన పాకిస్థాన్‌ను ఆదుకోవడానికి చైనా ముందుకొచ్చింది. మరో 2.5 బిలియన్‌డాలర్ల అప్పు ఇచ్చేందుకు అంగీకరించింది. పాక్ ఖజానాలో ప్రస్తుతం కేవలం 8.12 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఏడు వారాల పాటు దిగుమతులకయ్యే చెల్లింపులకు ఈ మొత్తం సరిపోతుంది. విదేశీ మారక నిల్వలు కనీస స్థాయికన్నా దిగువకు చేరడంతో పాక్‌కు కొత్తగా రుణాలివ్వలేమంటూ వరల్డ్‌బ్యాంక్, ఏషియన్‌డెవలప్‌మెంట్ బ్యాంక్ లు చేతులెత్తేశాయి. ఈ నేపథ్యంలో 2.5 బిలియన్ డాలర్లను స్టేట్‌బ్యాంక్‌ఆఫ్‌పాకిస్థాన్‌లో డిపాజిట్ చేయడానికి చైనా అంగీకరించిందని పాక్ ఆర్థిక మంత్రి వెల్లడించారు. దీంతో ఒక్క ఈ ఆర్థిక సంవత్సరంలో చైనా ఇచ్చిన అప్పు 4.5 బిలియన్‌డాలర్లకు చేరనుంది. కాగా, అధికారంలోకి రాకముందు విదేశీ రుణాలతో గవర్నమెంట్ నడపడమేంటని విరుచుకుపడ్డ ఇమ్రాన్‌ఖాన్.. ప్రమాణస్వీకారం చేశాక అప్పు కోసం చైనా, సౌదీ దేశాల్లో పర్యటించారు. మూడు శాతం వడ్డీకి 3 బిలియన్‌డాలర్ల రుణం ఇచ్చేందుకు యూఏఈ అంగీకరించిన యూఏఈ ఇప్పటికే బిలియన్‌డాలర్ల వరకూ పాక్‌సర్కారుకు అందజేసింది. రెండు నుంచి మూడేళ్లలో ఈ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని పాక్‌ఒప్పందం కుదుర్చుకున్నా.. గడువు పొడిగించుకునే పరిస్థితే తప్ప ఇప్పట్లో రుణాల చెల్లింపు కుదిరేది కాదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఆయిల్‌కొనుగోలుకు సంబంధించి 3.2 బిలియన్‌డాలర్లను యూఏఈ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని తెలిపాయి.

ఎన్నికలు మళ్లీ జరపండి



- వెనెజులా ప్రెసిడెంట్‌కు వ్యతిరేకంగా నిరసనలు
- ప్రతిపక్ష నేత గుయిడో ఆధ్వర్యంలో ర్యాలీలు

కారకాస్: వెనెజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం ముదురుతోంది. రాజధాని కారకాస్ లో వేలాది మంది మద్దతుదారులతో కలసి ప్రతిపక్ష నేత జువాన్‌గుయిడో నిరసనలు చేపట్టారు. ప్రెసిడెంట్ నికోలస్‌మదురో పదవి నుంచి దిగిపోవాలని, అధ్యక్ష ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సోషలిస్టు పార్టీ అధికారంలోకి వచ్చి శనివారానికి 20 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా భారీ ర్యాలీలు చేపట్టాలని నిర్ణయించామని గుయిడో చెప్పారు. యూరోపియన్‌యూనియన్‌సభ్యులు జారీ చేసిన అల్టిమేటమ్‌ను అనుసరించి ఎన్నికలు నిర్వహించాలన్నదే తమ నిరసనల ఉద్దేశమని స్పష్టం చేశారు. తూర్పు కారకాస్‌లోని యూఈ ఆఫీసుల నుంచి ర్యాలీలు ప్రారంభించారు. తమ నిరసన ప్రదర్శన వెనెజులా చరిత్రలోనే అతి పెద్దదని గుయిడో అన్నారు.

నేటితో ముగియనున్న డెడ్‌లైన్

వెనెజులా ప్రెసిడెంట్ ఎన్నికలను మళ్లీ నిర్వహించాలని మదురోకు ప్రధాన యూరోపియన్‌దేశాలు వారం కిందట అల్టిమేటమ్‌జారీ చేశాయి. ఇందుకు ఆదివారం (3వ తేదీ) వరకు డెడ్‌లైన్‌విధించాయి. ఎన్నికలు నిర్వహించాల ని, లేకపోతే అమెరికా మాదిరే తాము కూడా నేషనల్‌అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్న గుయిడోను అధ్యక్షుడిగా గుర్తిస్తామని హెచ్చరించాయి. యూరోపియన్ పార్లమెంట్ ఇప్పటికే గుయిడోను తాత్కాలిక ప్రెసిడెంట్‌గా గుర్తించింది. అమెరికా సహా డజనుకుపైగా లాటిన్ అమెరికా దేశాలు గుయిడోకు మద్దతుగా నిలిచాయి. రష్యాతో పాటు కొన్ని దేశాలు మాత్రమే మదురో వైపు ఉన్నాయి. అయితే కీలకమైన మిలటరీ మదురోకు వెన్నుదన్నుగా ఉంది. గత వారం జరిగిన గొడవల్లో 40 మందికిపైగా ప్రజలు చనిపోయారు.

చైనాకు గుయిడో మైత్రి సందేశం

మదురోకు మద్దతుగా ఉన్న చైనాకు గుయిడో మైత్రి సందేశం పంపారు. వెనెజులాతో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలను గౌరవిస్తానని చెప్పారు. వీలైనంత త్వరగా చైనాతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. వెనెజులా భవిష్యత్ అభివృద్ధికి, ఎకానమీ వృద్ధికి చైనా మద్దతు ఎంతో అవసరమని అన్నారు.

బీహార్‌లో షాబుద్దీన్ అనుచరుడి హత్య

సివన్: బీహార్‌లో మాఫియా డాన్ షాబుద్దీన్‌కు అత్యంత సన్నిహితుడైన మహ్మద్ యూసుఫ్ దారుణ హత్యకు గురయ్యాడు. బీహార్‌లోని సివన్ టౌన్‌లో పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోనే యూసుఫ్ రక్తం మడుగులో పడి ఉన్నాడని, హాస్పిటల్‌కు తరలిస్తుండగా చనిపోయాడని జిల్లా ఎస్పీ నవీన్‌చంద్ర శనివారం చెప్పారు. ‘‘గన్ పేలుడు సౌండ్ వినగానే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు . బుల్లెట్ గాయాలతో పడివున్న యూసుఫ్‌ను హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా చనిపోయాడు’’ అని ఎస్పీ చెప్పారు. పలు సమావేశాల్లో షాబుద్దీన్ భార్య, కుమారుడితో కలిసి యూసుఫ్‌కనిపించేవాడు. జంట హత్యల కేసులో షాబుద్దీన్ ప్రస్తుతం తీహార్ జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్నాడు.




ఆర్‌ఎల్‌ఎస్పీ చీఫ్‌పై విరిగిన లాఠీ

పాట్నా : రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్పీ), పోలీసుల మధ్య జరిగిన పెనుగులాట సందర్భంగా ఆ పార్టీ చీఫ్, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా గాయపడ్డారు. ప్రాథమిక చికిత్స చేసి, విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు సలహా ఇచ్చినట్లు డాక్టర్లు చెప్పారు. పాట్నాలో శనివారం ఈ సంఘటన జరిగింది. విద్యారంగంలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ రాజ్ భవన్ కు ఆర్ ఎల్ ఎస్పీ నాయకులు, కార్యకర్తలు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల చర్యను నిరసిస్తూ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు, కార్యకర్తల మధ్య చాలా సేపు పెనుగులాట జరిగింది. పరిస్థితిని కంట్రోల్ చేయడానికి పోలీసులు లాఠీలు, వాటర్ క్యాన్లు ప్రయోగించారు. దీంతో ప్రదర్శనకు నాయకత్వం వహిస్తున్న మాజీ కేంద్రమంత్రి ఉపేంద్ర కుష్వాహా కు లాఠీ దెబ్బలు తగిలాయి.

టెక్నాలజీ సాయంతో బంగ్లా బోర్డర్ సీల్

కేంద్రం హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ వెల్లడి



ఫాలాకాటా (పశ్చిమబెంగాల్): పశ్చిమ బెంగాల్, అస్సాంలోని బంగ్లాదేశ్ సరిహద్దును టెక్నాలజీ సాయంతో మూసివేస్తామని కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. శనివారం పశ్చిమ బెంగాల్ లోని అలీపూర్ ద్వార్ జిల్లాలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. 'బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా పశ్చిమ బెంగాల్ లోకి వలస వస్తున్నారు. సరిహద్దులో కంచె వేసేందుకు స్థలం కేటాయించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడిగాం. టెక్నాలజీ సాయంతో బోర్డర్ మూసివేస్తాం. దీంతో చొరబాట్లు, స్మగ్లింగ్ తగ్గుతుంది' అని అన్నారు. పశ్చిమ బెంగాల్ లో ఎక్కువ హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని రికార్డులు చెబుతున్నాయన్నారు. తృణమూల్ పాలనలో ఎవరికీ రక్షణ లేదని ఆరోపించారు. వంద మంది బీజేపీ కార్యకర్తలను హత్య చేశారని, బాధ్యులను విడిచిపెట్టబోమని అన్నారు. పశ్చిమ బెంగాల్ లో రాజకీయ హింస అంతం కానుందని, 2021లో బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు.

యూపీలో రైతుల పోరుబాట



నోయిడా: ఉత్తరప్రదేశ్‌లో రైతులు పోరుబాట పట్టారు. 2013కు ముందు భూసేకరణ కింద ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమ యూపీ నుంచి తరలివచ్చిన వందలాది మంది రైతులు శనివారం డీఎన్డీ ఫ్లైఓవర్ పై నిరసనకు దిగారు. దీంతో యూపీ ఢిల్లీలను కలిపే హైవేపై రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. ఆందోళనకారుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నారు. డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. 2008-12మధ్యకాలంలో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో తపోల్, మధుర, అలీఘర్ లోని రైతులు నష్టపోయారని, 2013లో పార్లమెంట్‌లో ఆమోదించిన భూసేకరణ చట్టం కింద పరిహారం చెల్లించాలని అక్కడి రైతులు నిరసనలు చేపడుతున్నారు.



గంగా నదిలో పడవ బోల్తా

ప్రయాణికులు క్షేమం

ప్రయాగ్‌రాజ్: పదకొండు మంది భక్తులతో వెళ్తున్న పడవ గంగానదిలో శనివారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వెంటనే స్పందించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నీటిలో మునిగిన ఎనిమిది మంది పురుషులు, ముగ్గురు మహిళలను కాపాడారు. త్రివేణి సంగమం వద్ద బ్యాలెన్స్ తప్పడంతోనే పడవ బోల్తాపడ్డట్టు అధికారులు చెప్పారు.



హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీని కప్పేసిన మంచుదుప్పటి

ఉత్తరాదిని చలి వదలట్లే

న్యూ ఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. హిమాచల్‌ప్రదేశ్ లాహౌల్ జిల్లా కీలాంగ్ లో మైనస్ 14డిగ్రీలు, కిన్నూర్‌జిల్లా కల్పలో మైనస్ 7.8డిగ్రీలు, మనాలీలో మైనస్ 3.8డిగ్రీలు, కుఫ్రీ, డల్హౌసీలో మైనస్ 2.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పంజాబ్ , హర్యానాలను పొగమంచు కమ్మేసింది . 4.4డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంబాలా, కర్నాల్ జిల్లాల్లో దట్టమైన పొగమంచు వ్యాపించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు రైళ్లు, విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోనూ మంచువర్షం కొనసాగుతుండడంతో రవాణాకు అంతరాయం కలుగుతోంది. యూపీ, ఢిల్లీలోనూ చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది.



పశ్చిమబెంగాల్ దుర్గాపూర్‌లో ప్రధాని మోడీని శనివారం పూలమాలతో సత్కరిస్తున్న బీజేపీ నేతలు

తృణమూల్ అంటేనే ట్రిపుల్ టీ

తృణమూల్, తోలాబాజీ, ట్యాక్స్ అని అర్థం చెప్పిన ప్రధాని

బెంగాల్ సభలో తీవ్ర ఆరోపణలు | జనం సొమ్ము మమత లూటీ చేస్తోందన్న మోడీ | సిటిజన్ షిప్ బిల్లుకు ప్రశంసలు

దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్): ప్రజల సొమ్ము దోపిడీ చేయడమే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పని గా పెట్టుకుందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్, మూడు ‘టీ’ లకు ప్రసిద్ధి పొందిందని చెప్పారు. ‘ టీ ’ అంటే తృణమూల్,తోలాబాజీ,ట్యాక్స్ అని ఆయన చెప్పారు. ఒక పద్ధతి ప్రకారం ఇతరుల సొమ్మును దోపిడీ చేయడాన్ని స్థానికంగా ‘తోలాబాజీ’ అంటారు. ప్రజలపై మమత సర్కార్ అనవసరపు పన్నులు వేసి వారి కష్టార్జితాన్ని దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను మమత సర్కార్ గాలికొదిలేసిందన్నారు. పశ్చిమ బెంగాల్లో లోక్ సభ ఎన్నికల ప్రచారానికి ప్రధాని శనివారం శ్రీకారం చుట్టారు. దుర్గాపూర్ లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ సర్కార్ పనితీరు పై మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పై విమర్శలు కురిపించారు. ప్రజల ఆకాంక్షలకు పూర్తి భిన్నంగా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇది ఎక్కువ రోజులు కొనసాగదన్నారు. తృణమూల్ కాంగ్రెస్ పాలన నుంచి బెంగాల్ బయటపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ను ప్రధాని మోడీ ప్రశంసించారు. కేంద్రం విధానమైన ‘సబ్ కా సాత్, సబ్ కా వికాస్ ’ లో భాగంగానే బడ్జెట్ ను రూపొందించినట్లు చెప్పారు. మధ్యతరగతికి మేలు చేసే అనేక అంశాలను బడ్జెట్ లో పెట్టినట్లు ఆయన చెప్పారు. కేంద్రం తీసుకువచ్చిన సిటిజన్ షిప్ (సవరణ) బిల్లు పై ఈశాన్య రాష్ట్రాల్లో అపోహలు నెలకొన్నాయని ప్రధాని మోడీ చెప్పారు. అంతకుముందు ఠాకూర్ నగర్ లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ సిటిజన్ షిప్ బిల్లు ను ప్రశంసించారు. ‘‘ ఇరుగు పొరుగు దేశాల్లో ఉంటున్న హిందువులు, సిక్కులు, పార్శీలు, క్రైస్తవులు అక్కడ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. బాధలు అనుభవించారు. ఎక్కడకు వెళ్లాలో తెలియక చివరకు ఇండియాకు వచ్చారు. అలాంటివారికి ఆపన్నహస్తం అందించడానికే సిటిజన్ షిప్ బిల్లు తీసుకువచ్చాం ’’ అని ప్రధాని మోడీ అన్నారు. బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ని ఆయన కోరారు. పశ్చిమ బెంగాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్న విదేశీయులకు బిల్లు ఎంతో అవసరం అన్నారు.

మధ్యంతర బడ్జెట్ ప్రారంభం మాత్రమే

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయినా రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని ప్రధాని మోడీ చెప్పారు. దీంతో వారి సంక్షేమం కోసం ఎన్డీయే సర్కార్ అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగమే ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అని అన్నారు. ‘‘ ఇది ప్రారంభం మాత్రమే. లోక్ సభ ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో రైతులు, యువత కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తాం ’’ అని ఆయన అన్నారు.

మోడీ పర్యటన సందర్భంగా ఉద్రిక్తత

ప్రధాని మోడీ పర్యటన తో పశ్చిమ బెంగాల్లో ఉద్రిక్తత నెలకొంది. మోడీ వస్తున్న సందర్భంగా పశ్చిమ బుర్ద్వాన్ జిల్లాలో బీజేపీ కార్యకర్తలు పోస్టర్లు వేశారు. ఈ పోస్టర్లను చించేసి వాటి స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ నేతల పోస్టర్లు వేసినట్లు బీజేపీ స్థానిక నాయకుడు శయంతన్ బసు ఆరోపించారు. దీని వల్లే బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఆరోపణలను తృణమూల్ కాంగ్రెస్ తోసిపుచ్చింది. సీఎం మమతా బెనర్జీ పోస్టర్లపై బీజేపీ లీడర్లే నల్లరంగు వేశారని ఎదురుదాడి చేసింది. పోస్టర్ల సంఘటనపై రెండు వర్గాలు పోలీసులు ఫిర్యాదు చేశాయి. బీజేపీ పై ప్రజలు చూపుతున్న ఆదరణను తట్టుకోలేకే హింసను ప్రేరేపిస్తోందని ప్రధాని మోడీ ఈ సందర్భంగా ఆరోపించారు.



సభలో తొక్కిసలాట..

ఠాకూర్ నగర్ లో ప్రధాని మోడీ బహిరంగ సభ దగ్గర తొక్కిసలాట జరగడంతో 16 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో పలువురు మహిళలు, పిల్లలు ఉన్నారు. సభ జరుగుతున్న ప్రాంగణం బయట పెద్ద ఎత్తున జనం గుమికూడారు. వీరు లోపలకు రావడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగినట్లు పోలీసు అధికారులు చెప్పారు. తొక్కిసలాట వల్ల స్పృహ కోల్పోయిన వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. దీంతో ప్రధాని మోడీ అర్ధాంతరంగా ప్రసంగాన్ని ముగించారు.

వాళ్లకు గెలుపు భయం: మమత

కోల్ కతా: ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు గెలుపు భయం పట్టుకుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సొంత నియోజకవర్గాల్లో గెలుస్తామోలేదో అన్న భయంవారికి పట్టుకుందన్నారు. ప్రధాని, కేంద్రహోంశాఖమంత్రి శనివారం రాష్ట్రంలో రెండు సభల్లో పాల్గొన్నారు. ఈ సభల్లో వారు మమత బెనర్జీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈనేపథ్యంలో ఆమె వారిని టార్గెట్ చేశారు. ఆ ఇద్దరు బీజేపీ నాయకులు ‘బయటివారు’ అని అన్నారు. ‘‘పశ్చిమ బెంగాల్ లో వారికి (బీజేపీ) నాయకులే లేరు. అందుకే బెంగాల్ ఆచారవ్యవహారాలు తెలియని బయటవారిని స్థానిక నాయకులు ఇక్కడకు తీసుకొస్తున్నారు. బెంగాల్ గురించి ఆలోచించేముందు ఆ నాయకులిద్దరూ వారి సొంత రాష్ట్రాల గురించి ఆలోచించుకుంటే మంచిది’’అని మమత సలహా ఇచ్చారు.

క్విక్ బైట్స్



నర్సాపూర్ అడవిలో పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ప్రకాశ్ కుమార్ ఝూ

రాష్ట్రంలో 129 అర్బన్ పార్క్‌లు

మెదక్, వెలుగు: రాష్ట్ర వ్యాప్తంగా 129 అర్బన్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ప్రకాశ్ కుమార్ ఝూ తెలిపారు. శనివారం ఆయన అడిషనల్ పీసీసీఎఫ్ దోబ్రియల్, మెదక్ సర్కిల్ సీసీఎఫ్ ఏ.కె. సిన్హా, మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి, డీఎఫ్ఓ పద్మ జారాణితో కలిసి నర్సాపూర్ సమీపంలో అటవీ ప్రాంతంలో జరుగుతున్న అర్బన్ పార్క్ పనులు పరిశీలించారు. అక్కడ చేపట్టిన పనుల గురించి ఫారెస్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టుపక్కల 59, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల పరిధి లో 70 అర్బన్ పార్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఇందులో 16 చోట్ల పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. అర్బన్ పార్క్‌లలో పచ్చదనం పెంపొందింపజేసి ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు, సందర్శకులు హాయిగా సేద తీరేందుకు వీలుగా అన్ని వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. అలాగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఏకో టూరిజం అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

కలెక్టర్ ధర్మారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ అర్బన్ పార్క్‌ను రూ.20 కోట్ల వ్యయంతో 750 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పార్క్‌లో40 అడుగుల ఎత్తుతో వాచ్ టవర్, గెజిబో, 7 కిలోమీటర్ల మేర ప్రహరీ, లోనికి ప్రవేశించే చోట ఆకర్షణీయమైన కమాన్‌లు నిర్మించనున్నట్టు తెలిపారు. నర్సాపూర్ హైదరాబాద్ సమీపంలో ఉన్నందున పర్యాటక అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఎవరైనా అడవిలో చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

94 లక్షల బతుకమ్మ చీరలు తయారు చేయండి

- సిరిసిల్ల నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఆర్డర్

రాజన్న సిరిసిల్ల, వెలుగు: సిరిసిల్ల నేతన్నలకు 2019 సంవత్సరానికి గాను ప్రభుత్వం బతుకమ్మ చీరలు 6.3 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయడానికి ఆర్డర్ ఇచ్చింది. ఈ ఆర్డర్‌ను 121 మాక్స్ సంఘాల సొసైటీలకు, 84 ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులకు శనివారం రాష్ట్ర జౌళి శాఖ డైరెక్టర్ శైలజరామయ్యార్ అందజేశారు. సుమారు రూ. 300 కోట్ల విలువైన 94 లక్షల చీరలు ఆగస్టు 15 వరకు తయారు చేసి అందించాల్సి ఉంది. ఈ సందర్భంగా జౌళిశాఖ డైరెక్టర్ శైలజరామయ్యార్ మాట్లాడుతూ గత సంవత్సరం బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్ కొంత అలస్యంగా ఇవ్వడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, అందుకోసమే ముందుగానే ఈ సంవత్సరం ఇస్తున్నామన్నారు. బతుకమ్మ చీరల తయారీని సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణలు పాటించాలని సూచించారు. కార్మికులకు ఉపాధి కల్పించడం కోసమే ప్రభుత్వం తయారీ ఆర్డర్ సిరిసిల్ల నేతన్నలకు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో టెస్కో జీఎం యాదగిరి, డీడీ తస్లీమ్, ఏడీ అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు భిన్నంగా ఉంటాయ్



నిజామాబాద్, వెలుగు: పార్లమెంట్ ఎన్నికలు భిన్నంగా ఉండబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ అన్నారు. ఉత్తర తెలంగాణలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిజామాబాద్‌లో నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే ఫలితాలు తారుమారవుతాయన్న భయంతోనే కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారన్నారు. మోడీని మరోసారి ప్రధానిగా చూడాలనే బలమైన కోరిక కోట్లాది మందిలో ఉందన్నారు. ప్రజల ఆకాంక్షను అనుకూలంగా మార్చుకోవడానికి దేశ వ్యాప్తంగా కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఐదు పార్లమెంట్ స్థానాలను కలిపి క్లస్టర్‌గా చేశామని, అన్ని క్లస్టర్ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేసే బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని అన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఒకే ఎంపీని పంపామని, ఈ సారి మాత్రం సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఎంపీలను కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఉన్నారు.

13 న అమిత్ షా రాక

ఈ నెల 13వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నిజామాబాద్‌కు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణాలోని ఐదు పార్లమెంట్ స్థానాల పరిధిలో జరిగే కార్యకర్తల సమ్మేళనానికి అమిత్‌షా హాజరవుతారన్నారు. ఈ నెల 5న సికింద్రాబాద్, మల్కాజ్‌గిరితో పాటు, హైదరాబాద్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారన్నారు.

మాఘ అమావాస్య జాతరలు

- రేపటి నుంచి పుల్లూరు, కూడవెల్లిలో మూడు రోజులు వేడుక
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

సిద్దిపేట, వెలుగు:

సిద్దిపేట జిల్లాలో మాఘ అమావాస్య జాతరలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సిద్దిపేట మండలం పుల్లూరు శ్రీలక్ష్మినరసింహ్మస్వామి, దుబ్బాక మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి, కొహెడ మండలం సింగరాయ జాతరలు జరగనున్నాయి. ఈ జాతరలకు తెలంగాణ జిల్లాలతో పాటు సమీప కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై మాఘ స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటారు. పుల్లూరు, కూడవెల్లి జాతరలు మూడు రోజులపాటు సాగితే సింగరాయ జాతర ఒకే రోజు జరుగుతుంది. జాతరల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లను చేస్తోంది. భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లతో పాటు నిరంతర నిఘాను ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు భక్తుల కనీస అవసరాలు తీరే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పుల్లూరు బండ జాతర

పుల్లూరు బండ జాతర ఫిబ్రవరి 4 నుంచి 6 తేదీ వరకు జరగనుంది. దాదాపు 800 సంవత్సరాల క్రితం స్వయంభూగా వెలసిన లక్ష్మినరసింహ్మస్వామికి కాకతీయుల రాజు గణపతి దేవుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు శిలా శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయంలోని నరసింహ్మస్వామి మూలవిగ్రహం వద్ద శిలాశాసనం ఉంది. పుల్లూరు గ్రామ సమీపంలోని పెద్ద బండపై వెలియడంతో పుల్లూరు బండ జాతరగా ప్రసిద్ధి చెందింది. జాతర మొదటి రోజు పుష్కరిణిలో భక్తులు మాఘ పుణ్యస్నానాలు చేసుకుని స్వామిని దర్శించుకుంటారు. పుల్లూరు బండపై ఉన్న గుండంలో పుణ్యస్నానాలు చేయడానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. రెండవ రోజు గోపాల కాల్వలు, మూడవ రోజు స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమంతోపాటు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో ఈ మూడు రోజులే ప్రధానం. తరువాత మూడు రోజుల పాటు అనేక కార్యక్రమాలను నిర్వహించి చక్రతీర్థం నిర్వహిస్తారు. మూడు రోజుల్లో సిద్దిపేట జిల్లాతో పాటు సమీప జిల్లాల నుంచి లక్ష మంది భక్తులు జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు.

కూడవెల్లి జాతర

దుబ్బాక మండలం రామేశ్వరంపల్లిలో దాదాపు 600 సంవత్సరాలకు పూర్వం శ్రీరామలింగేశ్వరస్వామి స్వయం భూగా వెలిశారు. కూడవెల్లి వాగు పక్కనే దేవాలయం ఉండటంతో కూడవెల్లి జాతరగా ప్రసిద్ధి చెందింది. మాఘ అమావాస్య నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. జాతర సందర్భంగా మూడు రోజుల్లో దాదాపు లక్షకు పైగా భక్తులు హాజరవుతారు. కూడవెల్లి వాగులో పుణ్య స్నానాలు ఆచరించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



ఆలయంలోని స్వామివార్ల విగ్రహాలు



పుల్లూరులో మాఘస్నానాలు చేస్తున్న భక్తులు(ఫైల్‌ఫోటో)

సింగరాయ జాతర

ఫిబ్రవరి 4న సింగరాయ జాతర జరగనుంది. కొహెడ మండలం కూరెల్ల గ్రామ పరిధిలోకి వచ్చే ఈ దేవాలయం 11వ శతాబ్దంలో వెలసినట్టు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. మోయ తుమ్మెద వాగు పక్కన అటవీ ప్రాంతంలోని గుట్టల మధ్య రాతిగుహలో సింగరాయస్వామి (శ్రీలక్ష్మినరసింహ్మస్వామి) వెలిశారు. ప్రకృతి రమణీయమైన ప్రదేశంలో ఏర్పడిన స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల భావన. మాఘ అమావాస్య ఒక్క రోజు జరిగే ఈ జాతకు దాదాపు లక్ష మంది హాజరై స్వామిని దర్శించుకుంటారు. ఇక్కడి కొండ చెరియల్లోంచి జాలువారే నీటిని ఔషధ నీటిగా భావించి భక్తులు తాగుతారు.

శాఖాహార పద్ధతిలో జాతర జరగడం దీని ప్రత్యేకత. జాతరలో చిక్కుడు, టమాట, వంకాయలతో వంటలు చేస్తారు. పక్కనే వున్న మోయ తుమ్మెద వాగులో స్నానమాచరించి భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకుంటారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు జాతరకు హాజరవుతారు. జాతర సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

గోదావరిలో ముగ్గురు యువకులు గల్లంతు

భద్రాచలం, వెలుగు : పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం వేలేరు వద్ద గోదావరిలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం గల్లంతయ్యారు. బూర్గంపాడు మండల కేంద్రానికి 3 కి.మీ. దూరంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన గాదె విజయ్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అదే గ్రామానికి చెందిన కుందూరు శ్రీనివాసరెడ్డి, కారంపూడి దుర్గాశేషు, తిరుమలరెడ్డి శివారెడ్డి, గాదె పృథ్వీరెడ్డి, కుందూరు సతీష్‌రెడ్డి గోదావరి నదిలో స్నానానికి వెళ్లారు. గోదావరిలో ఈత కొడుతూ ముగ్గురు గల్లంతయ్యారు. గల్లంతయిన వారిలో కుందూరు శ్రీనివాసరెడ్డి ఐటీసీ కాగితపు పరిశ్రమలో ట్రైనీ ఉద్యోగిగా, కారంపూడి దుర్గా శేషు బీమా కంపెనీలో పని చేస్తున్నారు. శివారెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే బూర్గంపాడు ఎస్సై వెంకటప్పయ్య సంఘటనా స్థలానికి వెళ్లి నాటు పడవలు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సురక్షితంగా బయటపడిన ముగ్గురు యువకుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. గల్లంతైన వారంతా 20 సంవత్సరాల వయస్సు ఉన్నవారే కావడం గమనార్హం. ఈ ఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సంఘటన జరిగిన ప్రదేశం ఆంధ్రాలో విలీనమైన కుక్కునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. దీంతో సమాచారాన్ని కుక్కునూరు పోలీసులకు అందజేశారు. సహాయక చర్యలను బూర్గంపాడు పోలీసులు చేపట్టారు.



నాటుపడవలో గాలిస్తున్న బూర్గంపాడు ఎస్సై వెంకటప్పయ్య

29 నియోజకవర్గాలు.. 34 పిటిషన్లు

జనగామ, వెలుగు: అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలు, పోలింగ్, కౌంటింగ్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగగా 29 నియోజకవర్గాల్లో అవకతవకలు జరిగాయంటూ 34 పిటిషన్లు దాఖలయ్యాయి. పలు నియోజకవర్గాల్లో పోలింగ్ రోజున అధికారులు ఇచ్చిన సంఖ్యకు.. కౌంటింగ్ రోజు ఇచ్చిన సంఖ్యకు లెక్క సరిపోవడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరచాలని ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

పిటిషన్లు వేసిన నియోజకవర్గాలివే...

పిటిషన్లు దాఖలైన నియోజకవర్గాల్లో హుస్నాబాద్, మంచిర్యాల, తుంగతుర్తి నియోజకవర్గాలపై విచారణకు కోర్టు అనుమతిచ్చింది. మిగిలిన నియోజకవర్గాలపై వేసిన పిటిషన్లు స్క్రూట్నీ దశలో ఉన్నాయి. వీటిలో కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌తో పాటు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్ల, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ కూడా ఉన్నాయి. వీటితో పాటు గద్వాల, కరీంనగర్, ఆసిఫాబాద్, దేవరకద్ర, వేములవాడ, పటాన్‌చెరు, ఖైరతాబాద్, మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, ధర్మపురి, జూబ్లీ హిల్స్, జనగామ, వరంగల్ వెస్ట్, నాంపల్లి, వికారాబాద్, పరిగి, హుజురాబాద్, కోదాడ, నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్, ఇబ్రహీంపట్నం, గోషామహల్, కొత్తగూడెం నియోజకవర్గాలు ఉన్నాయి.

తప్పిపోయిన వ్యక్తి తమిళనాడులో మృతి

మెదక్, వెలుగు: శబరిమల యాత్రకు వెళ్లి తప్పిపోయిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా ప్రాంతంలో నివసించే సున్నం రాజు(35), మరో ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి గత నెల 4న శబరిమలకు వెళ్లారు. అయప్పస్వామిని దర్శనం చేసుకున్న అనంతరం రైలులో తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యలో తమిళనాడు రాష్ట్రంలోని పెరుందురై వద్ద రాజు రైలు దిగి మళ్లీ ఎక్కలేదు. అతనితోపాటు ఉన్న ఫ్రెండ్స్ ఫోన్ చేయగా రైల్ మిస్సయిందని తరువాతి రైలులో తిరుపతి వస్తానని, అక్కడ కలుద్దామని చెప్పాడు. కానీ ఒక రోజు గడచినా రాజు తిరుపతికి చేరకపోగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. చేసేది లేక మిగిలినవారు మెదక్‌కు తిరిగి వచ్చారు. శబరిమల యాత్రకు వెళ్లిన రాజు వారం రోజులైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు కలిసి పెరుందురై వెళ్లి నలుగైదు రోజులపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా రాజు ఆచూకీ లభించలేదు. బంధువులు మూడు రోజుల క్రితం మళ్లీ పెరుందూరై వెళ్లి అక్కడి పోలీస్ స్టేషన్‌లలో సంప్రదించారు. కుటుంబీకులు చెప్పిన ఆనవాళ్ల ఆధారంగా రాజు 10 రోజుల క్రితం అనుమానాస్పద పరిస్థితిలో చనిపోయాడని తెలిపారు. సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో ఖననం చేసినట్టు పేర్కొన్నారు. దీంతో కుటుంబీకులు శుక్రవారం రాత్రి మెదక్ తిరిగి వచ్చారు.

ఎప్పుడేం జరుగుతుందో.!

- సింగరేణిలో ఏసీబీ, విజిలెన్స్ హల్‌చల్
- ఆందోళనలో కార్మికులు

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు:

ఏ నిమిషానికి ఏమి జరుగునో.. అన్నట్లుగా సింగరేణి కాలరీస్ కంపెనీలో ఎప్పుడేం జరుగుతుందోననే భయం కార్మికులతో పాటు ద్వితీయ శ్రేణి ఉద్యోగుల్లో నెలకొంది. నెలరోజులుగా సింగరేణిలో జరుగుతున్న బదిలీలతో కార్మికులు, ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు. ఇక ఇప్పుడేమో ఓవైపు ఏసీబీ, మరోవైపు సింగరేణి విజిలెన్స్ బృందాలు వరుస విచారణలు జరుపుతుండటంతో కంపెనీలో అసలేం జరుగుతుందోనన్న చర్చ సింగరేణి వ్యాప్తంగా సాగుతోంది. సింగరేణిలో పనిచేస్తున్న ఓ కార్మిక సంఘానికి చెందిన నేతకు, కంపెనీలో ప్రధాన భూమిక పోషిస్తున్న అత్యున్నత స్థాయి అధికారి మధ్య నెలకొన్న వివాదం చినికిచినికి గాలివానగా మారింది. కంపెనీవ్యాప్తంగా చుట్టుకుంటోంది. గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన ఓ అధికారికి నమ్మిన బంటుగా ఉన్న ఈ నేత డబ్బులు తీసుకుని భారీగా పైరవీలు చేశారనే ఆరోపణలున్నాయి. పెద్దఎత్తున డబ్బులు తీసుకుని మెడికల్ బోర్డులో కార్మికులను అన్‌ఫిట్ చేయించారనే విమర్శలున్నాయి. అర్హత లేకున్నా కార్మికులను అన్‌ఫిట్ చేయించి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించారనే ప్రచారం ఆ నేతపై ఉంది. కార్మికులు, ఉద్యోగుల బదిలీల విషయంలోనూ డబ్బులు తీసుకుని పైరవీలు చేశారనే ఆరోపణలున్నాయి. గతంలో జాతీయ సంఘంలో ఉండి తర్వాత ప్రస్తుతం గుర్తింపు సంఘంలోనూ కొనసాగారు. ఇదే సమయంలో సంఘంలోని ముఖ్యనేతలు నిధులు దుర్వినియోగం చేశారంటూ ఫిర్యాదు చేశారు. ఇటీవలి కాలంలో కంపెనీకి చెందిన అత్యున్నత స్థాయి అధికారిపై పలు ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. దాంతో వివాదం ముదిరింది. ఇటీవలి కాలంలో పలు ఆరోపణలు, గైర్హాజరు పేరుతో యాజమాన్యం అతడిని డిస్మిస్ చేసింది. ఆయన ఉంటున్న క్వార్టర్‌ను ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ నేతతో ఫోన్లో మాట్లాడటం, ఆయనతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో పలువురిని యాజమాన్యం ఇటీవల బదిలీ చేసింది. మరికొందరు ఆ జాబితాలో ఉన్నట్టుగా కంపెనీలో ప్రచారం సాగుతోంది. బదిలీలతో తమకు సంబంధం లేదని, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వస్తున్న ఆదేశాలను మాత్రమే తాము అమలు చేస్తున్నామని హెడ్డాఫీస్‌లోని అధికారులు పేర్కొంటుండటం గమనార్హం.

కార్మికుల విచారణ

రెండు రోజులుగా ఏసీబీ, సింగరేణి విజిలెన్స్ అధికారులు పలువురు కార్మికులను విచారిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకుడి హయాంలో మెడికల్ బోర్డ్‌లో అన్‌ఫిట్ అయిన కార్మికులతో పాటు వారి వారసులను హెడ్డాఫీస్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఆ నేతకు ఎన్ని డబ్బులిచ్చారు. అప్పుడేం జరిగిందంటూ ఓ వైపు ఏసీబీ, మరోవైపు విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహిస్తుండటంతో అసలేం జరుగుతోందనే చర్చ సింగరేణి వ్యాప్తంగా సాగుతోంది. మరోవైపు పైరవీలతో బదిలీలైన వారి వివరాలను సేకరిస్తున్నారు. ప్రశాంతంగా ఉద్యోగం చేసుకుంటున్న తమను పిలిపించి ఎన్ని డబ్బులిచ్చావంటూ గుచ్చిగుచ్చి అడుగుతున్నారని విచారణకు వచ్చిన పలువురు కార్మికులు వాపోతున్నారు. తాము ఉదయం నుంచి ఇక్కడే ఉన్నామని, కనీసం అన్నం కూడా పెట్టలేదని, తామేం తప్పు చేశామని అంటున్నారు. ఆ నేత హయాంలో మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయి ఉద్యోగం పొందిన సమయంలో ఆ కార్మికుడి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో ఎంత మొత్తం డబ్బులను డ్రా చేశారనే విషయంపై అధికారులు దృష్టి సారించారు. అడిగిన విధంగా జవాబివ్వకపోతే మీ కొడుకును బదిలీ చేస్తామని విజిలెన్స్ అధికారులు బెదిరిస్తున్నారని ఓ కార్మికుడు వాపోయాడు.

మాజీ డైరెక్టర్‌నూ విచారణలో భాగంగా పిలిచినట్టుగా ప్రచారం సాగుతోంది. ఎవరితో ఏం మాట్లాడితే ఏం జరుగుతుందో, ఎటుపోయి ఎటు వస్తదో అంటూ కార్మికులతో పాటు అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేత కేసులో భాగంగా మరో 15 మంది వరకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్టుగా సమాచారం.


తల్లి మరణం తట్టుకోలేక..

- కుమారుడి మృతి
- చిన్నప్పుడు దత్తత తీసుకున్న తల్లి
- ఆమె మృతిని తట్టుకోలేకపోయిన దత్త కుమారుడు

ఖమ్మం, వెలుగు: తల్లి మరణవార్తను విని తట్టుకోలేక కుమారుడు చనిపోయిన ఘటన ఖమ్మం నగరంలోని చర్చి కంపౌండ్ లో విషాదాన్ని నింపింది. జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం బీరోలుకు చెందిన దాశరథి లక్ష్మీనర్సమ్మ చాలా ఏళ్ల క్రితం కుటుంబంతో సహా వచ్చి చర్చి కంపౌండ్ లో స్థిరపడ్డారు. ఆమె 90 ఏళ్ల వయస్సులో అనారోగ్యానికి గురై శుక్రవారం రాత్రి 11:30 గంటల సమయంలో చనిపోయారు. చనిపోయే వరకు చివరి నిమిషాల్లో ఆమె కుమారుడు దాశరథి వేణునాథ స్వామి (63) తల్లికి సేవ చేస్తూనే ఉన్నారు. తల్లి మరణాన్ని తట్టుకోలేని ఆ కుమారుడి గుండె కొన్ని గంటల్లోనే ఆగిపోయింది. శనివారం తెల్లవారుజామున ఐదున్నర గంటల సమయంలో వేణునాథస్వామి తల్లి మృతదేహం పక్కనే కన్నుమూశారు. ఈ విషయం తెలిసి ఇంటికి చేరుకున్న మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా రోధించారు. కొన్ని గంటల సమయంలోనే ఇద్దరు చనిపోవడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చాలా ఏళ్ల క్రితం టీచర్ గా పనిచేసిన శేషయ్య, లక్ష్మీనర్సమ్మ దంపతులకు పిల్లలు లేకపోవడంతో బంధువులబ్బాయి వేణునాథ స్వామిని ఐదేళ్ల వయస్సులో దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి ఈ తల్లిదండ్రులతోనే వేణు ఉంటున్నారు. ప్రభుత్వ టీచర్‌గా పనిచేసిన వేణు ఐదేళ్ల క్రితం రిటైరయ్యారు. తండ్రి చాలా ఏళ్ల క్రితమే చనిపోవడంతో తల్లిని చూసుకుంటూ, దైవ సంబంధిత సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. తల్లిని అమితంగా ప్రేమించే వేణు.. చివరకు తల్లి మరణాన్ని తట్టుకోలేకపోయారు. వేణుకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



లక్ష్మీనర్సమ్మ



దాశరథి వేణునాథ స్వామి

మావోయిస్టు ఏరియా కమిటీ మహిళా సానుభూతిపరుల అరెస్ట్

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఏటూరునాగారం, వెలుగు : మావోయిస్టు పార్టీ మద్దెడు ఏరియా కమిటీ సానుభూతిపరులైన దుబ్బ పుష్ప(25), మట్టి పద్మ(26), పులిసే లోకేశ్వరి(27) అనే ముగ్గురు మహిళలను శనివారం అరెస్ట్ చేసి వాజేడు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేరూరు ఎస్సై ఆర్.స్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... శనివారం మధ్యాహ్నం సుమారు నాలుగు గంటల సమయంలో సి విల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వాజేడు మండలం టేకులగూడెం అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చత్తీస్‌గడ్‌రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం మండలం దేపేలా గ్రామానికి చెందిన దుబ్బ పుష్ప, మట్టి పద్మ, పులిసే లోకేశ్వరి పోలీసులకు తారసపడ్డారు. విచారణలో వారు ముగ్గురూ సీపీఐ మావోయిస్టు పార్టీ మద్దెడు ఏరియా కమిటీ మహిళా సానుభూతిపరులని తేలింది. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వాజేడు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

18న రాష్ట్రానికి ఫైనాన్స్ కమిషన్

- 3 రోజుల టూర్.. సీఎం, ఆర్థిక శాఖ అధికారులతో భేటీ
- సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పనుల పరిశీలన
- 15వ ఆర్థిక సంఘం టూర్ తర్వాతే బడ్జెట్ సమావేశాలు?

హైదరాబాద్, వెలుగు: ప్రముఖ ఆర్థిక నిపుణుడు ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ నెల 18 నుంచి 20 వరకు రాష్ట్రానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమ పథకాల ఆర్థిక డిమాండ్లు, ప్రతిపాదలను కమిషన్ స్వీకరిస్తుంది. తొలి రెండు రోజులు హైదరాబాద్‌లోనే ఉండనున్న ఈ బృందం ముఖ్యమంత్రి కేసీఆర్, వివిధ పార్టీల నేతలు, ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం కానుంది. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ఎత్తిపోతల పథకాలు, రైతుబంధు, బీమా, పంచాయతీరాజ్ వ్యవస్థకు నిధుల బదలాయింపు తదితర అంశాలపై కమిషన్‌ప్రతినిధులకు సీఎం కేసీఆర్ వివరించనున్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులతోపాటు మిషన్ భగీరథ పనులను కమిషన్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్టు సమాచారం. 2020 ఏప్రిల్‌తో మొదలయ్యే ఆర్థిక సంవత్సరం నుంచి 15వ ఆర్థిక సంఘం అమల్లోకి వస్తుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కమిషన్ పర్యటించి రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు, డిమాండ్లను స్వీకరిస్తుంది. వీటిపై అక్టోబర్ 30 నాటికి కేంద్రానికి నివేదిక సమర్పిస్తుంది. ఫైనాన్స్ కమిషన్ పర్యటన నేపథ్యంలో ఈ నెల మూడో వారం చివరలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

బండి కిరాయి ఇస్తలేరు

హైదరాబాద్, వెలుగు :

అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాడుకున్న అద్దె వాహనాలకు అధికారులు ఇంతవరకు డబ్బులివ్వ లేదు. ఎన్నికలు అయిపోయి నెలన్నర కావొస్తున్నా డబ్బులందకపోవడంతో డ్రైవర్లు, ఓనర్లు ఇబ్బంది పడుతున్నారు. అద్దె వాహనాల కోసం ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే నిధులు విడుదల చేసింది. కొన్ని చోట్ల డబ్బులు పంపిణీ పూర్తవగా మరికొన్ని చోట్ల అధికారులు సాకులు చూపుతూ అద్దెను పెండింగ్‌లో పెట్టారు. 31 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 80 నుంచి 100 వాహనాలను అధికారులు వాడుకున్నారు. పర్యటనలు, ఎన్నికల సామగ్రి తరలింపు ఇతర అవసరాలకు వాటిని ఉపయోగించారు.



- ఎన్నికలప్పుడు వెహికిల్స్ అద్దెకు తీసుకున్న అధికారులు
- నెలన్నర కావస్తున్నా ఓనర్లకు అందని డబ్బులు
- సాకులు చెప్పి తప్పించుకుంటున్న వైనం
- నిధులు విడుదల చేశామంటున్న ఎలక్షన్ కమిషన్

ఆర్సీ ఉందా, పొల్యూషన్ ఉందా?

బండి కిరాయికి తీసుకునే సమయంలో ఎటువంటి అభ్యంతరాలు చెప్పని అధికారులు.. తీరా బిల్లులడిగే సరికి సతాయిస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండికి పొల్యూషన్, ఆర్సీ, డ్రైవర్లకు లైసెన్సులు లేవనే కారణాలు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఎవరైనా గట్టిగా అడిగితే 'బ్యాంక్ అకౌంట్ నంబర్ ఇచ్చారుగా.. వచ్చినప్పుడు వేస్తాం' అని దబాయిస్తున్నారని డ్రైవర్లు చెబుతున్నారు. అయితే ఏజెన్సీల ద్వారా వెళ్లిన వారిలో కొందరికి అద్దె డబ్బులు వచ్చాయని, నేరుగా వాహనం నడిపిన వారికి మాత్రం రావడంలేదని అంటున్నారు. ఏజెన్సీలు కమీషన్లు ఇస్తుండడంతో వారికి తొందరగా ఇస్తున్నట్లు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

ఏ బండికెంత?

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో కిరాయి పెంచాలని ఓనర్లు, డ్రైవర్లు ఎన్నికలకు ముందు ఈసీ రజత్‌కుమార్‌ను కలవడంతో ఆయన అద్దె పెంచుతూ జీఓ ఇచ్చారు. దాని ప్రకారం 12 టన్నులు అంతకంటే ఎక్కువ బరువున్న వాహనాలకు రూ.1,600, 12 టన్నులలోపున్నవాటికి రూ.1,550, 16 నుంచి 35 సీట్లు ఉండే బస్సులకు రూ.2,200, 35 సీట్ల కంటే ఎక్కువ సీట్లున్న బస్సులకు రూ.3,450, ఆరు సీట్లున్న టాక్సీలకు రూ.1,100, ఏడు సీట్లున్న టాక్సీలకు రూ.1,200, ఆటోలకు రూ.350, మినీ బస్సులకు (8 నుంచి 16 సీట్లకు)రూ.1,600 అద్దె నిర్ణయించారు. వీటితోపాటు డ్రైవర్లకు రూ.400, బండి వెంట మరో వ్యక్తి ఉంటే రూ.300 బత్తా చెల్లించాలి.

ఇంకా పైసలియ్యలే

ఎన్నికలప్పుడు నా కారును కలెక్టర్ ఆఫీసులో అద్దెకు పెట్టిన. నెలపాటు వాడుకున్నరు. రూ.25వేల వరకు రావాలె. ఎలక్షన్లు అయిపోయి ఇన్నాళ్లయినా బిల్లులు రాలేదని చెబుతున్నారు. ఎప్పుడు అడిగినా ఏదో ఒకటి చెప్పి పంపిస్తున్నరు. - రాజు, కామారెడ్డి

రేపుమాపు అంటున్నరు

ఇంకా బిల్లులు రాలేదంట. ఎప్పుడు పోయినా రేపుమాపు అంటున్నరు. బండి కాగితాలన్నీ ఉన్నయ్. ఇన్నాళ్లయినా కిరాయి ఇయ్యకపోవుడు ఏంది? పై అధికారులు పట్టించుకుని డబ్బులు వచ్చేలా చూడాలె.

- శ్రీపాల్‌రెడ్డి, అంబర్‌పేట

ఆర్టీఏలో త్వరలో పదోన్నతులు?

- ఉమ్మడి రాష్ట్రంలోని సర్వీస్ రూల్స్ మార్చిన ప్రభుత్వం

హైదరాబాద్, వెలుగు: ఆర్టీఏ అధికారులకు తీపికబురు. త్వరలోనే వాళ్లకు పదోన్నతులు రానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్రంలోని సర్వీస్ రూల్స్ మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో నంబర్ ఎంఎస్ 2ను విడుదల చేసింది. ఉప రవాణా కమిషనర్‌గా పదోన్నతి పొందడానికి ఆర్టీవోలకు, అసిస్టెంట్ సెక్రటరీలకు మధ్య 24:1 నిష్పత్తి నిర్ణయిస్తూ ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో 22 ఆర్టీవో పోస్టులున్నాయి. వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు 340, మినిస్టీరియల్ సిబ్బంది 260 మంది ఈ పోస్టులకు పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో రెండు అసిస్టెంట్ సెక్రటరీ పోస్టుల పదోన్నతి కోసం మరో 40 మంది వరకు వేచి చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తాజా ఉత్తర్వులతో వీరికి పదోన్నతి లభించే అవకాశం ఉంది.

లా పూర్తిచేసిన ఎస్టీలకు స్కాలర్‌షిప్

హైదరాబాద్, వెలుగు: న్యాయవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన ఎస్టీ అభ్యర్థులు స్కాలర్‌షిప్‌కు అప్లై చేసుకోవాలని ఎస్టీ సంక్షేమ శాఖ కమిషన్ డైరెక్టర్ క్రిస్టినా చెప్పారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రకారం జిల్లాకు 30 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి నెలకు రూ.వెయ్యి అందజేస్తామన్నారు. పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.6 వేలు ఇస్తామని చెప్పారు. అభ్యర్థులు మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4 వారాల్లో అప్పీల్ విచారించండి

- రాష్ట్ర సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, వెలుగు: ఆర్టీఐ అప్పీల్ దరఖాస్తులను నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని హైకోర్టు రాష్ట్ర సమాచార కమిషన్‌కు సూచించింది. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ఎం.శ్రీనివాస్‌కేసు విచారణలో జస్టిస్ పీవీ సంజయ్ కుమార్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ప్రైవేటు ఆస్పత్రులు పేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాయో చెప్పాలంటూ శ్రీనివాస్ వైద్య విద్యాశాఖ సంచాలకుడికి దరఖాస్తు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో రాష్ట్ర కమిషన్ కు అప్పీల్‌చేశానని, అక్కడ కూడా అధికారులు స్పందించలేదని కోర్టును ఆశ్రయించారు. అప్పీల్ దరఖాస్తును నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లో పరిష్కరించాలని రాష్ట్ర కమిషన్‌ను ఆదేశించింది.



బ్రహ్మోత్సవాలు షురూ

నాగర్‌కర్నూల్, వెలుగు: నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి ఆలయం ముందు ధ్వజారోహణంతో లాంఛనంగా వేడుకలను ప్రారంభించారు. దేవాలయ ప్రధాన అర్చకుడి ఇంటినుంచి స్వామివారి ఉత్సవ ప్రతిమను ఊరేగింపుగా దేవాలయానికి తరలించిన తర్వాత విశేష పూజలు నిర్వహించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ స్వామి వారిని సేవించుకున్నారు.



టెన్త్ విద్యార్థులకు స్పెషల్ మెనూ

హైదరాబాద్, వెలుగు: ఎస్సీ రెసిడెన్సియల్ హాస్టళ్లలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందించాలని ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్ సూచించారు. ఎస్సీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో సబ్జెక్టుల వారీగా ట్యూటర్లను నియమించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని సూచించారు. విద్యార్థుల డైట్, కాస్మొటిక్ బిల్లులు ప్రతి నెలా చెల్లించేలా జిల్లా సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లలో మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునేలా సంప్‌ల నిర్మాణంపై సూచనలు ఇచ్చారు. సంప్‌ల నిర్మాణం కోసం క్రూషియల్ వెల్ఫేర్ ఫండ్ వినియోగించుకోవాలన్నారు.

అర మీటర్ లోతులో

- తగ్గిన భూగర్బ జల మట్టం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో భూగర్భ జలాలు మరో 0.76 మీటర్ల కిందికి వెళ్లిపోయాయి. భూగర్భ జల వనరుల శాఖ జనవరి నివేదికలో ఈ విషయం వెల్లడించింది. రాష్ట సగటు భూగర్భ జలమట్టం 11.91 మీటర్లు. 20 జిల్లాల్లో నీటి మట్టం పడిపోగా, 11 జిల్లాల్లో స్వల్పంగా పెరిగింది. సంగారెడ్డిలో అత్యధికంగా 7.49 మీటర్లు తగ్గగా, నాగర్ కర్నూల్‌లో 1.56 మీటర్లు పెరిగింది. ఈ ఏడాది 852 మి.మీ. సాధారణ వర్షపాతానికి, 15 శాతం తక్కువగా 720 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

ర్యాంకు తగ్గితే పనిష్మెంట్

సిద్దిపేట, వెలుగు: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచి సిద్దిపేట జిల్లాను మొదటి ర్యాంక్ సాధించేలా ఉమ్మడిగా బాధ్యత తీసుకుందామని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో ప్రభుత్వ, మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూళ్ల హెచ్‌ఎం, ఎంఈవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి స్కూల్లో 95 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధిస్తేనే ఫస్ట్ ర్యాంకు సాధిస్తామని, గత ఏడాది ఇలాంటి సమీక్షల వల్ల 13వ స్థానం నుంచి మూడోస్థానానికి వచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పది పాయింట్లు సాధించే పదోతరగతి స్టూడెంట్స్‌కు తన వంతు రూ.25వేల నగదు బహుమతిని అందిస్తానని ప్రకటించారు. ఈ ఘనత సాధించిన హెచ్‌ఎంలను, టీచర్లను తాను ఘనంగా సన్మానిస్తానన్నారు. గత ఏడాదికంటే ర్యాంకు తగ్గితే కారకులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఎలాంటి సహాయం కావాలన్నా తాను అందిస్తానని, చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.



టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

- పది ఫలితాల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది

రైతుల అవసరాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని ఎరువులు, విత్తన డీలర్ల శిక్షణా తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడారు. డీలర్లు నకిలీవి అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సిద్దిపేట పట్టణంలోని బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న జగ్జీవన్‌భవన్, ఇండోర్ ఆడిటోరియం, హజ్‌హౌజ్ పనులను పరిశీలించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్దిపేట మునిసిపాల్టీ పరిధిలోని 26వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీకృష్ణయాదవ భవనాన్ని, రాఘవేంద్ర నగర్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం వార్డు మహిళలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

రేపటి నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మీటింగ్

కమిషనర్ నవీన్‌మిట్టల్

హైదరాబాద్, వెలుగు: హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రీసోర్స్ కౌన్సిల్‌సమావేశం ఈ నెల 4,5 (సోమ, మంగళ వారాల్లో) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ లింబాద్రితో కలిసి దీనికి సంబంధించిన విషయాలు శనివారం వెల్లడించారు. రెండ్రోజులపాటు జరిగే సమావేశాల్లో ఇండస్ట్రీ, ఐటీ విభాగాల్లో ఎలాంటి కోర్సులు అవసరం, ఉపాధి కల్పించే కోర్సులు, సిలబస్‌పై చర్చిస్తామన్నారు. ఆ తర్వాత అమలు సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆరు రాష్ట్రాల నుంచి 50 మంది కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు, ఐటీ, ఇండస్ట్రీ, ఏఐసీటీఈ, విద్యాశాఖ ఉన్నతాధికారులు, వర్సిటీల వీసీలు, డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు.

వికారాబాద్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయండి

- హైకోర్టులో కేసు ఉంటే ఈవీఎంలు ఎలా ఓపెన్ చేశారు?
- 122 ఈవీఎంలను ట్యాంపర్ చేశారు
- సీఈవోకు కాంగ్రెస్ నేతల వినతి

హైదరాబాద్, వెలుగు: వికారాబాద్ కలెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీఈవో రజత్‌కుమార్‌ను కాంగ్రెస్ నేతలు కోరారు. శనివారం ఆయన్ను వికారాబాద్‌లో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ , నిరంజన్‌లు కలిశారు. శాసనసభ ఫలితంపై హైకోర్టులో ఎన్నికల పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు స్ట్రాంగ్ రూంలోని ఈవీఎంల సీళ్లను కలెక్టర్ ఓపెన్ చేశారని వారు ఆరోపించారు. 122 ఈవీఎంలను ట్యాంపర్ చేశారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను ఆయన బేఖాతరు చేశారన్నారు. అనంతరం వాళ్లు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఈవీఎంలు, వీవీప్యాట్ స్లిప్పులను భద్రపరచాల్సిందిపోయి కావాలనే వాటిని డిస్టర్బ్ చేశారని ఆరోపించారు. ఈ ఘటన వెనక ఎవరెవరున్నారో తెలుసుకునేందుకు కలెక్టర్, ఆర్వో కాల్‌డేటాను పరిశీలించి దర్యాప్తు చేయాలని కోరారు. మంగళవారంలోపు కలెక్టర్‌పై చర్య తీసుకోకపోతే సీఈవోను మళ్లీ కలుస్తామన్నారు. ఓటర్ల జాబితాపై ఆందోళనలు చేస్తామన్నారు.

యూనియన్ లీడర్లదే ఇష్టారాజ్యం

- రూల్స్‌కు విరుద్ధంగా పర్యవేక్షణ పోస్టుల్లో నియామకం
- సెక్టోరల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జ్ ఎంఈవోలుగానూ బాధ్యతలు
- యూనియన్ పనులపైనే దృష్టి
- ఫిర్యాదులున్నా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

హైదరాబాద్, వెలుగు: విద్యాశాఖలోని పర్యవేక్షణ పోస్టుల్లో యూనియన్ లీడర్ల రాజ్యమే నడుస్తోంది. కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబాబాద్ ఇలా మెజార్టీ జిల్లాల్లోని పలు పోస్టుల్లో వీరిదే హవా. అయితే అసలు పనికంటే యూనియన్‌పనులపైనే లీడర్లంతా దృష్టిసారిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి పర్యవేక్షణ పోస్టుల్లో యూనియన్ లీడర్లను నియమించకూడదనే రూల్ ఉన్నా.. ఉన్నతాధికారులు దాటిని పక్కనపెట్టి బాధ్యతలు అప్పగించేశారు. ఇలాంటి వారు అధికార దుర్వినియోగానికి పాల్పడటంపై విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

పెత్తనం వారిదే..

సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) జిల్లా ప్రాజెక్టు పరిధిలో ముగ్గురు సెక్టోరల్ ఆఫీసర్లు ఉంటారు. ఎస్ఎస్ఏకు ప్రత్యేకంగా పోస్టులు లేకపోవడంతో గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో ఈ పోస్టులను భర్తీ చేస్తున్నారు. చాలా మండలాల్లో ఎంఈవో పోస్టులూ ఖాళీగా ఉండటంతో సీనియర్ హెచ్‌ఎంలను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి బాధ్యతలనూ హెచ్‌ఎంలు, సీనియర్ టీచర్లకు అప్పగిస్తున్నారు. జిల్లాల్లో ఈ పోస్టులన్నీ కీలకమైనవి కావడంతో హెచ్‌ఎంలు, టీచర్స్ యూనియన్లలో క్రియాశీలక సభ్యులు, ఆఫీస్ బేరర్స్, ప్రధాన బాధ్యతల్లో ఉన్న వారు అర్హులు కాదనే రూల్‌ఉంది. విద్యాశాఖలో లేదా స్వచ్ఛంధ సంస్థల్లో పదేళ్లు పని చేసిన అనుభవం ఉండాలి. అయితే పలు జిల్లాల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. వీటిని పట్టించుకోకుండా యూనియన్‌లీడర్లకే ఇలాంటి బాధ్యతలను అప్పగించేస్తున్నారు. దీంతో అసలు పనికంటే యూనియన్ పనులపైనే వారంతా దృష్టి పెడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ఇలా చాలామంది ద్వంద బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సెక్టోరల్ ఆఫీసర్లుగా ఉన్న పలువురు లీడర్ల డిప్యూటేషన్ గడువు ముగిసినా ఇంకా విధుల్లోనే కొనసాగుతున్నారు. కొందరు యూనియన్ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటున్నారు. కరీంనగర్‌లోని ఓ యూనియన్ ప్రధాన బాధ్యునిగా ఉన్న సెక్టోరల్ ఆఫీసర్.. కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. పలు జిల్లాల్లోని నేతలు ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

యూనియన్ లీడర్లను తొలగించాలి

యూనియన్ లీడర్లు సెక్టోరల్ ఆఫీసర్స్‌గా, ఎంఈవోలుగా కొనసాగుతూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యా శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. స్పందించకపోతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం.

– ఎం.చెన్నయ్య, పీఆర్టీయూటీ స్టేట్ జనరల్ సెక్రెటరీ

ఇలాంటి వారిని బాధ్యతల నుంచి తొలగించాలనే ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

దేశం మెచ్చుకునేలా 'మిషన్ భగీరథ'

- ఆర్వో, క్యాన్ నీళ్లతో కలిగే అనర్థాలను వివరిస్తాం
- తాగునీరు అందించే బాధ్యత ఇంజినీర్లదే: ఈఎన్ సీ కృపాకర్ రావు

హైదరాబాద్, వెలుగు: ఆర్వో, క్యాన్ నీళ్లతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామని మిషన్ భగీరథ ఈఎన్ సీ కృపాకర్‌రెడ్డి అన్నారు. భగీరథ ఆపరేషన్స్, మెయింటెనెన్స్ పై హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇస్కీలో జరుగుతున్న మూడురోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఈఎన్ సీ కృపాకర్ మాట్లాడారు. దేశం మెచ్చుకునేలా మిషన్ భగీరథ పథకాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికీ నీళ్లు అందించే బాధ్యత ఇంజినీర్లదేనని చెప్పారు. వర్క్‌షాప్‌లో విలువైన సూచనలు, సలహాలు అందాయన్నారు. ఇంటేక్‌వెల్స్, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, పైప్‌లైన్ వ్యవస్థపై నిజామాబాద్ ఎస్‌ఈ రాజేంద్రకుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు. నీటి సరఫరా, ప్రాజెక్టు నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై రిటైర్డ్ ఇంజినీర్ డీఎం మోహన్ పలు సూచనలు చేశారు. వివిధ దేశాల్లో అమలు చేస్తున్న పాలసీని వివరించారు. భవిష్యత్తులో ఈ పథకం దేశానికి రోల్ మోడల్ అవుతుందని ఆయన అన్నారు. నీటి నాణ్యతపై చీఫ్ ఇంజినీర్ విజయపాల్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వర్క్‌షాప్‌లో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, సీఈలు జగన్మోహన్, వి. శ్రీనివాసరావు, విజయప్రకాశ్, వినోభాదేవి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, కన్సల్టెంట్లు నర్సింగరావు, జగన్, మనోహర్‌బాబు ఇంజినీర్లు పాల్గొన్నారు.



ముందు రోడ్లు బాగు చేద్దాం

హైదరాబాద్, వెలుగు:

- ఇటీవల సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారుల కసరత్తు
- వారంలో అన్ని జిల్లాల అధికారులతో మీటింగ్స్
- గ్రామీణ రోడ్ల పరిస్థితులపై నివేదికలు కోరే యోచన

ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. త్వరలోనే అన్ని జిల్లాల పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మీటింగ్స్‌కు చీఫ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నాయి, ఎన్నింటికి లేవు, ఎక్కడ మరమ్మతులు చేపట్టాలి, ఎన్ని నిధులు అవసరం వంటి వివరాలను జిల్లా అధికారుల నుంచి కోరనున్నారు. ఆ నివేదికల ఆధారంగా నిధులకు ప్రతిపాదనలు తయారు చేసి సీఎం కేసీఆర్ అనుమతితో పనులు ప్రారంభించాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.


కదలిక తెచ్చిన సీఎం సమీక్ష

ఎన్నాళ్లుగానో గ్రామీణ రోడ్లు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. చాలా గ్రామాలకు బీటీ రోడ్లు లేవు. ఉన్న చోట్ల కూడా గుంతలు పడి ఏ మాత్రం సౌకర్యంగా లేవు. ఈ పరిస్థితిని ముందే గ్రహించిన సీఎం ఇటీవల ప్రగతి భవన్‌లో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ తర్వాత ప్రభుత్వం రోడ్లకు ప్రాధాన్యం ఇస్తున్నదని, గ్రామీణ రోడ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు ఏ పార్టీ వారున్నా.. తేడాలు చూపకుండా, అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఇదే సమయంలో పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ, జాతీయ రహదారుల నిర్వహణ, మరమ్మతుల విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపాన్ని ఎత్తి చూపుతూ హెచ్చరికలు చేశారు. కొత్త రోడ్లు వేసే వరకు పాత రోడ్లను పట్టించుకోవడంలేదని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సీఎం సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకున్న ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగి కార్యాచరణ ప్రారంభించారు.



అంబేడ్కర్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశీ వర్సిటీల్లో ప్రవేశం పొందాలనుకునే ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు చెప్పారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజీలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియా దేశాల్లోని వర్సిటీల్లో అడ్మిషన్లు పొందాలనుకునే వారికి ఈ పథకం కింద రూ.20 లక్షల స్కాలర్‌షిప్, అడ్మిషన్ పొందినవారికి విమానచార్జీలు ఇస్తామన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించరాదని, జూలై ఒకటి నాటికి 35 ఏళ్లలోపున్న వారు అర్హులని చెప్పారు.



ముందు ఈ బడ్జెట్ విషయంలో ఒక క్లారిటీకి రావాలి. కేంద్రం దీన్ని మధ్యంతర బడ్జెట్‌గా చెప్పకుంటోంది. కానీ నిజానికిది తాత్కాలిక బడ్జెట్ కాదు. ఖర్చులు, పన్నుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన పెద్ద పెద్ద హామీలను బట్టి చూస్తే ఇదే భావన కలుగుతుంది. ఇంటరిం బడ్జెట్ అంటే విధాన పరమైన నిర్ణయాలు ఉండకుడదు. ఈసారి ఆ లిమిట్స్‌ని దాటిపోయారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలకు వెళ్లే గవర్నమెంట్ ఇలా చేయడాన్ని రాజ్యాంగ పరిధిని దాటివెళ్లడమేనని చెప్పాలి.

వచ్చే ప్రభుత్వం నెత్తిన భారం

తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రతిపాదించిన మధ్యంతర బడ్జెట్ పూర్తిగా ఎలక్షన్ కోణంలో ఉంది. తలకుమించిన బరువుతో అంకెలున్నాయి. అసలు టెక్నికల్‌గా ఆలోచిస్తే... త్వరలో దిగిపోయే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ని తేవాలంటే ఫైనాన్స్ బిల్లును మార్చాలి. దీనికి రాజ్యాంగం అనుమతించదు. పైగా మధ్యంతర బడ్జెట్ పేరుతో రానున్న సర్కారుపై ఖర్చుల, సుంకాల భారాన్ని మోపటానికీ ఒప్పుకోదు. ముఖ్యంగా ఇలా చిన్న రైతులకు నగదు బదిలీలు చేయటం, ఆదాయ పన్ను రాయితీలు ఇవ్వటంపై కట్టుబాట్లు పెడుతుంది. కానీ, దురదృష్టవశాత్తూ ఇప్పుడు గవర్నమెంట్లు ఇలాంటి రాజ్యాంగపరమైన షరతులను పాటించట్లేదు. 'అదేంటి' అని అడిగే స్థాయి అధికారి కూడా లేకుండా పోతున్నాడు.

ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా ఇది ముమ్మాటికీ 'ప్రీ-ఎలక్షన్' బడ్జెట్. 'ప్రొ-ఎలక్షన్' బడ్జెట్. బడ్జెట్ స్పీచ్ మొత్తం 'ఫీల్-గుడ్' ఇంప్రెషన్ కలిగించాలనే దిశగానే సాగింది. ఖర్చుల కేటాయింపులను, పన్నుల సవరణలను పక్కన పెట్టింది. ఆర్థిక రంగ దశ-దిశలను మార్చే నిజమైన మార్పులను లెక్కలోకి తీసుకోలేదు. ఈ లిస్టులో ప్రధానంగా చెప్పుకోదగ్గ అంశం... రైతులకు నేరుగా ఇవ్వనున్న ఆర్థిక సాయం. రెండు హెక్టార్ల లోపు భూమి ఉన్న అన్నదాతలకు ఏడాదికి రూ.6,000 ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీనివల్ల దేశంలో సుమారు 12 కోట్ల మంది చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని అంచనా. 2015-16 వ్యవసాయ లెక్కల ప్రకారం లబ్ధిదారులను గుర్తిస్తారు. వాళ్లకు మూడు విడతల్లో రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 ఇస్తారు. మూడేళ్ల కిందటి ఈ డేటా ప్రకారం రెండున్నర హెక్టార్ల లోపు 'సాగులో ఉన్న వ్యవసాయ భూముల' (ఆపరేషనల్ హోల్డింగ్స్) సంఖ్య 12.5 కోట్లు. అయితే, ఈ కమతాలన్నింటికీ క్యాష్ ట్రాన్స్‌ఫర్ చేస్తారా లేదా అనేది స్పష్టం కాలేదు.

ల్యాండ్ టైటిల్స్ లేనివారికి, కౌలు రైతులకు, మహిళా రైతులకు ఎలా లబ్ధి చేకూరుస్తారనేది చెప్పలేదు. ఈ పథకాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే తక్షణం (2018 డిసెంబర్ నుంచే) అమలు చేసేందుకు రూ.20 వేల కోట్లను కేటాయించారు. కానీ, 2019-20 ఆర్థిక సంవత్సరంలో పేమెంట్లకు కావాల్సిన రూ.75 వేల కోట్ల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. సాగుదార్లకు ఇస్తున్న ఈ ఫైనాన్సియల్ సపోర్టు బీజేపీకి ఎన్నికల్లో ఏవిధంగా బెనెఫిట్ అవుతుందో వేచి చూడాలి. ఏడాదికి రూ.6,000 ఇస్తున్నారంటే నెలకు యావరేజ్‌గా రూ.500 వస్తాయి. రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులతో పోల్చితే ఇంత చిన్న మొత్తం వాళ్లకు ఏ మూలకూ రాదు. మత్స్యకారులకు, పశువుల పెంపకందారులకు ఇస్తున్న వడ్డీ రాయితీ కూడా ఇలాంటిదే.

ట్యాక్స్ రిలీఫ్ పేరిట మధ్య తరగతికి కొన్ని మినహాయింపులు ఇచ్చారు. అవి అమల్లోకి రావటానికి టైం పడుతుంది. కాబట్టి, అవి కూడా రూలింగ్ పార్టీకి పొలిటికల్‌గా ఏ మేరకు ఫలితాన్నిస్తాయో చెప్పలేం. ఎంప్లాయ్‌మెంట్ పెంపునకు ఏం చర్యలు తీసుకోబోతోందో మోడీ ప్రభుత్వం వెల్లడించలేదు. బడ్జెట్‌ను చదివి వినిపించిన పీయూష్ గోయెల్ వివిధ కార్యక్రమాల గురించి తెలిపారు. వాటి ద్వారా ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. కానీ, స్పష్టంగా ఒక పథకాన్ని ప్రకటించలేదు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.61 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిధులు 2018 డిసెంబర్‌లోనే ఖర్చయిపోయాయి. దీన్నిబట్టి ఈ స్కీంకి రానున్న రోజుల్లో కొత్తగా ఒక్క రూపాయి ఖర్చు పెట్టే ఉద్దేశం గవర్నమెంట్‌కి లేనట్లు అర్థమవుతోంది. నిజానికి ఈ పథకానికే ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సి ఉంది. అలా చేయకుండా ఆ బరువును తదుపరి ప్రభుత్వంపై మోపాలనే ప్రయత్నం చేసింది.

'నేషనల్ హెల్త్ మిషన్'కి కూడా నిధులను పెంచలేదు. గవర్నమెంట్ గొప్పగా చెప్పుకునే 'స్వచ్ఛ భారత్'కీ బడ్జెట్‌లో కోతపెట్టారు. తాత్కాలిక బడ్జెట్ లెక్కలను చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు 'క్రియేటివ్ అకౌంటింగ్'కి పని చెప్పినట్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ బడ్జెట్ వల్ల కలిగే స్థూల ఆర్థిక ప్రభావాలను నిజంగా అంచనా వేయలేకపోయినట్లు తెలిసిపోతోంది. అసలు దేశ ఆర్థిక పరిస్థితే పారదర్శకంగా లేదు. అదే తాజా బడ్జెట్‌లోనూ ప్రతిబింబిస్తోంది.

- జయతి ఘోష్, ఎకనమిక్స్ ప్రొఫెసర్, జేఎన్‌యూ
('ది వైర్' సౌజన్యంతో...)

40 ఏళ్ల తర్వాత 3,000 ఏ మూలకు!

ఎన్నికల్లో గెలుపును మోసుకొస్తుందంటూ 'గేమ్ ఛేంజర్'లా భావిస్తున్న మరో పథకం అసంఘటిత రంగంలోని కార్మికులకు పెన్షన్. దీన్ని మరో తప్పుడు హామీగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఇప్పుడు 20 ఏళ్ల వయసులో ఉన్న యువకుడు తనకు 60 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత నెలకు రూ.3000 పింఛన్ పొందాలంటే ఇప్పటినుంచే కంట్రిబ్యూషన్ కట్టడం మొదలు పెట్టాలి. ఇలాంటి పథకాన్ని ఏపీ, తెలంగాణ ఇప్పటికే అమలు చేస్తున్నాయి. 30, 40 ఏళ్ల తర్వాత కూడా ఇంతే మొత్తం ఇస్తామంటే ఎలా?.



బీజేపీకి జాగా దొరుకుతుందా?

జనరల్ ఎలక్షన్ నాటికి కాంగ్రెస్ పార్టీ-డీఎంకే జట్టు కట్టడం ఖాయమైపోయింది. ఆ పార్టీ అధినేత ఎం.కె.స్టాలిన్ ఒక అడుగు ముందుకేసి హస్తం పార్టీ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. ఈ రెండు పార్టీలు అలయెన్స్ విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయలేదు. కానీ.. అన్నాడీఎంకేకి, కమల దళానికి మధ్య ఈ స్థాయిలో అవగాహన ఇప్పటికీ కుదరలేదు. ఈ రెండు పార్టీలు కలిస్తే ఎవరెన్ని సీట్లలో పోటీ చేయాలో తేలట్లేదు. అదే.. చిక్కుముడిగా ఉండిపోయింది.

ఇప్పటికే కుమ్ములాటల్లో చిక్కుకున్న అన్నాడీఎంకే సీనియర్ నేతలు.. మోడీతో జోడీ కట్టి ఎన్నికలకు పోతే ఎన్ని గెలుస్తామనేదానిపై ఒక ఐడియాకి రాలేకపోతున్నారు. అందువల్ల ఎలక్షన్లకు ముందు కొయిలేషన్ కన్నా రిజల్ట్ తర్వాత గవర్నమెంట్ ఏర్పాటుకి సపోర్ట్‌గా నిలవటం మంచి ఆప్షన్‌గా భావిస్తున్నారు. దీనికి బీజేపీ ససేమిరా అంటోంది. ఇదే సమయంలో తమిళనాడులో అధికార పార్టీని నయానో, భయానో ఒప్పించాలని చూస్తోంది. గతంలో తాము చేసిన సాయాన్ని ఇప్పుడు గుర్తు చేస్తోంది. 'పురచ్చితలైవిని గుడ్ ఫ్రెండ్‌గా భావించే మోడీ ఆమె మరణం తర్వాత అన్నాడీఎంకేకి అండగా నిలబడ్డారు. ఆమె పార్టీ ముక్కలు కాకుండా చూశారు. కాబట్టి ఆ పార్టీ తమకు ఉపకారికినుపకారం (పే-బ్యాక్) చేయాల్సిన టైమిది' అని తమిళనాడులోని బీజేపీ నేతలు అంటున్నారు.

జయలలిత చనిపోయిన తర్వాత ఆమె పార్టీలో మూడు సార్లు చీలికలొచ్చాయి. ఎమ్మెల్యేలు వర్గాలుగా విడిపోయారు. అసెంబ్లీలో వాటి బలం రోజుకో తీరుగా మారేది. ఈ నేపథ్యంలో అసలు ఆ పార్టీ మనుగడలో ఉంటుందా? చరిత్రలో కలుస్తుందా? అనే అనుమానాలు చెలరేగాయి.

పళనిస్వామి, పన్నీర్ సెల్వంల నేతృత్వంలోని రెండు ముఠాలతోపాటు శశికళ మేనల్లుడు దినకరన్ మూడో గ్రూప్ ఏర్పాటు చేశారు. దాంతో అన్నాడీఎంకే ముప్పు ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో రంగ ప్రవేశం చేసిన పీఎం మోడీ.. మొదటి రెండు వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి థర్డ్ ఫ్యాక్షన్‌ని విజయవంతంగా ఆపగలిగారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని బీజేపీ నాయకులే కాకుండా ప్రతిపక్ష నేతలు సైతం ఒప్పుకుంటున్నారు. కుప్పకూలిపోవాల్సిన ప్రభుత్వాన్ని నిలబెట్టినందుకు కేంద్రానికి థ్యాంక్స్ గివింగ్ ఇవ్వాల్సిందేనన్నది లోకల్ బీజేపీ లీడర్ల అభిప్రాయం. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త, 'తమిళనాడు విషయంలో మోడీకి కళ్లు, చెవులు'గా భావించే ఎస్.గురుమూర్తి.. బీజేపీ, ఏఐఏడీఎంకే మధ్య 'టై-అప్' బెటరని సమర్థించారు. అన్నాడీఎంకే మాత్రం ఎన్నికల్లో పొత్తు పెట్టుకోకుండా విడివిడిగా నిలబడటమే మంచిదని ఫీలవుతోంది. కమలం పార్టీతో కలిసే విషయాన్ని సీఎం పళనిస్వామి బహిరంగంగా వ్యతిరేకించలేకపోతున్నారు. ఆయన కొలీగ్, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై మాత్రం నిర్మొహమాటంగా వద్దంటున్నారు. మాజీ సీఎం పన్నీర్‌సెల్వం ఏదీ చెప్పకుండా సైలెంట్‌గా ఉంటున్నారు. మరో వైపు.. దినకరన్ తన వర్గం ఎమ్మెల్యేలను కాపాడుకోవడంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. 18 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను అన్‌క్వాలిఫైడ్‌గా స్పీకర్ ప్రకటించడాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. ఆయా స్థానాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అప్పటివరకు సభలో మెజారిటీ సీఎం పళనిస్వామి వైపే ఉంటుంది. బీజేపీ, అన్నాడీఎంకే మధ్య పొత్తుపై ఆ రెండు పార్టీల మధ్య అనధికారికంగా చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. సీట్ల పంపకం వద్ద నిలిచిపోయాయి. మొత్తం 40 లోక్‌సభ ఎంపీ సీట్లలో సగం (20) నియోజకవర్గాలను బీజేపీకి, దాని మిత్రపక్షాలైన పీఎంకే, డీఎండీకేలకి ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. మిగతా సగాన్ని ఏఐఏడీఎంకేకి కేటాయించాలనే బేసిక్ అండర్ స్టాండింగ్‌కి రావాల్సి ఉంది. ఇటీవల తమిళనాడులోని బూత్ స్థాయి కార్యకర్తలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం మోడీ.. పాత మిత్రులకు 'ఆల్వేస్ వెల్‌కం' అని చెప్పేశారు. అయినా, ఆ కూటమిలోకి వెళ్లటానికి తంబిదురై వంటి నేతలు ఆసక్తి చూపట్లేదు. ఇటీవలి అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవటం, కేంద్రంలో అయిదేళ్లుగా మోడీ సర్కారు ఉండటం, ప్రభుత్వ వ్యతిరేకత వంటి కారణాలను చూపుతున్నారు. గతంలో మాదిరిగా గుంపగుత్తగా ఓట్లు పొందే శక్తిని కాషాయం పార్టీ కోల్పోయిందని, మోడీ ఒక్కరి వల్లే ఆ పార్టీ గట్టెక్కే పరిస్థితి లేదని చెబుతున్నారు. అందువల్ల కమలదళంతో కలిసి నడవటం వల్ల కలిసొచ్చేదేమీ ఉండదనే అవగాహనకు వచ్చారు అన్నాడీఎంకే నేతలు. ఆత్మగౌరవం, స్వాభిమానం, తమిళ సంస్కృతి, సొంత భాషాభిమానం లాంటి మరెన్నో అంశాలు అక్కడి రాజకీయాలను మలుపు తిప్పుతాయని మరువకూడదు.

అన్నాడీఎంకే చీఫ్ జయలలిత చనిపోయి రెండేళ్లు దాటింది. అప్పటినుంచి ఆ పార్టీతో బీజేపీ క్లోజ్‌గా ఉంటోంది. ఇది ఓపెన్ సీక్రెటే. ఈ స్నేహం జనరల్ ఎలక్షన్లలో ఏవిధంగా ఓట్లు కురిపిస్తుందో ఇంకా క్లారిటీ రాలేదు. రాష్ట్రంలో మొత్తం లోక్‌సభ సీట్లు 40 (తమిళనాడులో 39, పుదుచ్చేరిలో 1). గత ఎన్నికల్లో అమ్మ పార్టీ 37 స్థానాలు దక్కించుకుంది. బీజేపీ ఒక చోట (కన్యాకుమారిలో), దాని మిత్రపక్షం పీఎంకే మరో చోట మాత్రమే గెలిచాయి.



సాంబారులో గుజరాతీ దాల్!

దక్షిణాదిలో కర్ణాటక మినహా మరే రాష్ట్రంలోనూ బీజేపీకి డైరెక్ట్ ఎంట్రీ దొరకడం లేదు. మరోవైపు ఉత్తరాదిన గతంలో గెలిచినన్ని ఎంపీ సీట్లు 2019లో రాకపోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. దాంతో బీజేపీ లుక్ ఈస్ట్ ప్రోగ్రాంతో వెస్ట్ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లోకి; కాంకర్ సౌతిండియా పేరుతో దక్షిణ రాష్ట్రాల్లోకి చొరబడాలని తెగ తాపత్రయపడుతోంది. దాదాపు 40 సీట్లున్న తమిళనాట అన్నాడీఎంకేతో దోస్తానా చేస్తే కలిసొస్తుందని గుజరాతీ నేతలు (మోడీ-షా జోడీ) అనుకుంటున్నారు. సొంత తెలివితేటలు దండిగా ఉన్న తమిళ జనాలు ఎంతవరకు ఆదరిస్తారన్నదే క్లారిటీగా లేదు.

వీళ్ల దారే రహదారా!

చట్టాన్ని పట్టించుకోని 'సినిమా న్యాయం'

కోట్లాదిమంది చూసే సినిమాల్లో చట్టం, న్యాయం, రాజ్యాంగాలకు కనీస గౌరవం దక్కుతోందా? క్రియేటివిటీ ముసుగులో అన్నీ అపోహలనే ప్రచారం చేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇండియాలో పవర్‌ఫుల్ మీడియా అంటే సినిమాలే. హీరోయిజం పేరుతో రాజ్యాంగంపైనా, పోలీసు, కోర్టులు వంటి వ్యవస్థలపైనా మర్యాద లేకుండా సినిమాలు తీసేస్తున్నారు. యూత్ రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా ఒక సోషల్ నెట్‌వర్క్ 'మిషన్–70' పేరుతో కార్యక్రమం చేపట్టింది.



'దబాంగ్-2'లో పోలీసాఫీసర్ చుల్‌బుల్ పాండే (సల్మాన్ ఖాన్) ఓ గ్యాంగ్‌స్టర్‌ని కొట్టి కొట్టి చంపుతాడు. ఇలాంటి సీన్లను చాలా చిత్రాల్లో చూసుంటాం. నేరస్తులను కోర్టులే శిక్షించాలి తప్ప పోలీసులు కాదు. అయితే, ఈ మూవీలో హీరోయే ఆ పని పూర్తి చేశాడు. అది రీల్ లైఫ్ కదా అంటారేమో. కానీ, రియల్ లైఫ్‌లో ఈ చర్య రాజ్యాంగం చెప్పే మొరాలిటీకి పూర్తిగా వ్యతిరేకం. సినిమా ఎఫెక్ట్‌తో ప్రేక్షకులు అదే కరెక్ట్ అనుకునే ప్రమాదం ఉంది. ఫలానా స్టేట్, ఫలానా ప్రాంతం



అని పేర్లు పెట్టుకొని మరీ ఆ క్యారెక్టర్లు ఇలా రూల్స్‌ని అతిక్రమించినట్లు చూపించటం ముమ్మాటికీ తప్పే. మరి, వీటిని 'తప్పు' అని ఎవరు చెప్పాలి?. 'ఒప్పు' ఏదో ఎలా చూపాలి?.

ఈ బాధ్యతను 'వుయ్, ద పీపుల్ (డబ్ల్యూటీపీ)' అనే నెట్‌వర్క్ భుజాన వేసుకుంది. సినిమాల్లో అలవోకగా చోటు చేసుకునే తప్పుల్ని ఎత్తిచూపుతూ, కాన్‌స్టిట్యూషన్‌పై కనీస అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది. కొన్ని ఆర్గనైజేషన్లు ఇలా ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడి దాని ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. లైఫ్‌లో మూవీలు భాగమైపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో అవే సినిమా సీన్ల సాయంతో మన హక్కులను, బాధ్యతలను సున్నితంగా గుర్తు చేస్తున్నారు. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ వర్క్‌షాప్‌లను, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 'మిషన్-70' కాన్సెప్ట్‌తో వీడియో సిరీస్ విడుదల చేస్తున్నారు.

ఆ వీడియోల కథనం.. థింక్ రిఫ్లెక్ట్, యాక్ట్ విధానంలో సాగుతుంది. 'దృశ్యం', 'దబాంగ్'లలో చట్టపరమైన విధానాలను ఎలా ఉల్లంఘించారో, 'హ్యారీ పోటర్'లో బానిసత్వాన్ని ఎలా ప్రమోట్ చేశారో ఈ వీడియో సిరీస్‌లో వివరించారు. సమానత్వం అనే ప్రాథమిక భావనలను, విలువలను ఎలా ఉల్లంఘించారో కూడా కళ్లకుకట్టినట్లు చూపెట్టారు. చెప్పేది పెద్ద సబ్జెక్ట్ కదా అని ఉపదేశాలు, సందేశాల జోలికి వెళ్లలేదు. అందరికీ అర్థమయ్యేలా, ప్రతి ఒక్కరూ నమ్మదగిన విషయాలపైనే దృష్టి పెట్టారు. ఎన్నికలు, సిటిజన్‌షిప్, ఫ్రీడం, సామాజిక న్యాయం వంటి రిలవెంట్ ఇష్యూస్ పైనా వీడియోలను పొందుపరిచారు.

ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న ఈ నెట్‌వర్క్... అక్కడి గవర్నమెంట్ స్కూళ్లలో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కాన్‌స్టిట్యూషన్‌ను ఆసక్తికరమైన రీతిలో కరికులం యాక్టివిటీగా చేర్చాలని కేజ్రీవాల్ సర్కారు ఇటీవలే నిర్ణయించింది. రాజ్యాంగమంటే సామాన్యులకు అర్థం కాని బ్రహ్మ పదార్థంగా భావించకూడదు. డైలీ లైఫ్‌తో ముడిపడ్డ ముఖ్యాంశం. ఈ క్వాలిటీ సహజ న్యాయానికి సంబంధించిన బేసిక్ ఐడియా. 'దబాంగ్-2'లో దొంగలను చుల్‌బుల్ పాండే చితక్కొట్టుడు కొట్టినట్లు కాకుండా చేతికి బేడీలు వేసి స్టేషన్‌కు తరలించినట్లు చూపిస్తే బాగుండేది. తద్వారా రాజ్యాంగం చెబుతున్న విలువలను కాస్త మెరుగ్గా అర్థం చేసుకునే అవకాశం ఉండేది.



ఆ ఎంపికే కీలకం

ఇండియన్ల లైఫ్‌లో సినిమాల ప్రభావం ఎక్కువ. యువతరాన్ని ఎంగేజ్ చేయడానికి దీన్ని మించింది లేదు. యూత్‌ని ప్రభావితం చేసే స్థాయిలో సినిమాలు కనెక్ట్ అయిపోయాయి. కాబట్టే బాలీవుడ్, హాలీవుడ్ మూవీల క్లిప్పింగ్‌లు ఎంచుకున్నాం. వాటిలో ఏదీ సక్రమంగా చూపడం లేదు. కొన్ని సినిమాల్లో న్యాయ సూత్రాలకు, రాజ్యాంగ విలువలకు ఏమాత్రం విలువ ఇవ్వలేదు. ఇంకొన్ని చిత్రాల్లో ఈక్వాలిటీ, జస్టిస్ లాంటి విలువలను ప్రమోట్ చేస్తున్నారు. ఈ రెండు రకాల సినిమాల్లో వేటిని విమర్శనాత్మకంగా చూడాలి? వేటి నుంచి విలువలను నేర్చుకోవాలి? అన్నదే కీలకం.

– వినితా సింగ్, డబ్ల్యూటీపీ ట్రస్టీ

మిషన్–70

రాజ్యాంగంపై అవగాహన పెంచే కార్యక్రమాల్లో భాగంగా డబ్ల్యూటీపీ నెట్‌వర్క్ వాళ్లు 'మిషన్-70' అనే కాన్సెప్ట్‌ని రూపొందించారు. సంవత్సరం పొడవునా సాగే ఈ క్యాంపెయిన్‌లో రెండు నెలలకు ఒకటి చొప్పున వీడియో సిరీస్‌లను విడుదల చేస్తారు. ఈ ఏడాది జనవరి 25న తమ పార్ట్నర్‌షిప్ ప్లాట్‌ఫాం 'సిటిజన్ అడ్డా'పై 'కాన్‌స్టిట్యూషన్ ఇన్ సినిమా' అనే టైటిల్‌తో తొలి సిరీస్‌ను రిలీజ్ చేశారు. 'దృశ్యం', 'దబాంగ్', 'న్యూటన్', 'హ్యారీ పోటర్' లాంటి హిట్ సినిమాల్లోనూ, పాపులర్ ఆన్‌లైన్ షోల్లోనూ రాజ్యాంగపరమైన నిబంధనలను, విలువలను అతిక్రమించి తీసిన సీన్లను అందులో చూపించారు. వాటిలో తప్పొప్పుల గురించి చెప్పారు.

ఏమన్నారంటే



అందుకే లాభాలు

గత ఆర్థిక సంవత్సరం ఇదే టైంలో నష్టాల్లో ఉన్న మేం ఇప్పుడు లాభాల్లోకి వచ్చాం. కేటాయింపులు భారీగా తగ్గాయి. రుణ నాణ్యత మెరుగుపడింది.

– రజనీశ్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్



ఇదో పెద్ద ప్రాబ్లం

'బాడీ షేమింగ్'ను పట్టించుకోను. హెల్త్ కోసమే జిమ్‌కి వెళుతున్నా. లోకానికి అందంగా కనపడటం కోసం కాదు. ఫ్యూచర్ జనరేషన్ అయినా ఇలాంటి పనికిమాలిన కామెంట్లు చేయరనుకుంటున్నా.

– నేహా ధూపియా, నటి



కోహ్లీ, శాస్త్రి కారణం

టీమిండియా ఇప్పుడు వెలిగిపోతోంది. బ్యాటింగ్, బౌలింగ్ సూపర్‌గా చేస్తోంది. కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి దీనికి కారణం. పదేళ్ల వరకు ట్యాలెంటెడ్ ప్లేయర్ల కొరత లేకుండా చూస్తాం.

– ఎమ్మెస్కే ప్రసాద్, చీఫ్ సెలక్టర్

టాకీస్

అందరికీ నచ్చే యాత్ర



వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ప్రధానాంశంగా తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటించారు. ఈ నెల 8న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మహి వి. రాఘవ్ మాట్లాడుతూ... "ఇది మన నాయకుడి కథ. నా ఒక్కడి కృషితో ఈ సినిమా తయారు కాలేదు. టీమ్ అందరం కలిస్తేనే ఇది సాధ్యపడింది. నాకు వైఎస్సార్‌కి ఎలాంటి సంబంధం లేదు. అందరూ ఆయన గురించి చెప్పిన కథలు విని ఈ సినిమా తీయాలనుకున్నాను. మీకు నచ్చితేనే సినిమా చూడండి" అన్నారు. "మా కథను నమ్మి సినిమా చేసిన మమ్ముట్టిగారికి ధన్యవాదాలు. ఈ సినిమా వైఎస్ అభిమానులకే కాదు, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ నచ్చుతుంది" అన్నారు నిర్మాత విజయ్ కుమార్ చిల్లా. మమ్ముట్టి మాట్లాడుతూ... "చాలా యేళ్ల తర్వాత తెలుగు సినిమా చేయడం సంతోషంగా ఉంది. మీ అందరికీ వైఎస్సార్ అంటే ఎంతో ప్రేమ. అందులో ఒక్క శాతం ప్రేమని నామీద చూపించినా చాలు. మా పని అయిపోయింది. ఇప్పుడిది మీ సినిమా. దీన్ని సక్సెస్ చేయాల్సిన బాధ్యత మీదే" అన్నారు. ఈ సినిమా వైఎస్సార్ ఫ్యాన్స్‌కే కాదు అందరికీ నచ్చుతుందని, అంద రికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని హీరో సుధీర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు పీవీపీ, దామోదర ప్రసాద్, రవిశంకర్, నటుడు విజయ్ చందర్, డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, సంగీత దర్శకుడు కృష్ణకుమార్, కెమెరామెన్ సత్యన్ సూర్యన్, నటి ఆశ్రిత వేముగంటి తదితరులు పాల్గొన్నారు.

కంగనా.. అంత కఠినమా!



'మణికర్ణిక' సినిమా వివాదం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. అందరూ కంగనాది తప్పని కరాఖండిగా చెప్పేస్తున్నారు. అయినా కూడా కంగనా ఏమాత్రం తగ్గడం లేదు. ఏదో ఒకటి మాట్లాడుతూ గొడవను మరింత పెద్దది చేస్తోంది. సినిమా నుంచి ఎందుకు తప్పుకున్నాడో క్రిష్ వివరంగా చెప్పిన తర్వాత అందరూ తనకి సపోర్ట్‌గా మాట్లాడారు. ఈ సినిమాకి పని చేసిన సోనూ సూద్, మిష్టీ చక్రవర్తి కూడా తమకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకొచ్చారు. అవన్నీ విన్న కంగనా అంతెత్తున లేచింది. 'ఈ సినిమాని నేనే డైరెక్ట్ చేశాను. అన్ని ముఖ్యమైన నిర్ణయాలూ నేనే తీసుకున్నాను. నావల్లే ఇది పూర్తై రిలీజయ్యింది. ఈరోజు ఇన్ని ప్రశంసలు పొందుతోంది. అది తెలిసి కూడా ఎవరో ఏదో మాట్లాడేస్తే అది నిజమైపోతుందా' అంటోంది. అది మాత్రమే కాదు... అతి త్వరలో మరో సినిమా డైరెక్ట్ చేసి నా టాలెంటేంటో వాళ్లకి చూపిస్తాను అంటూ సవాలు కూడా చేసింది. అదీ చాలదన్నట్టు... 'సినిమాలో ప్రధాన పాత్రలు కావాలంటే ఊరికే వచ్చేయవు. నాలాగ కష్టపడాలి. అంచెలంచెలుగా ఎదగాలి. అంతే తప్ప మాకు ప్రాధాన్యత ఇవ్వలేదు అంటూ పబ్లిక్‌లో ఫీలైపోతే అవకాశాలు రావు. అయినా ఎవరి పాత్ర ఎంత ఉండాలి అనేది దర్శకురాలిగా నేను డిసైడ్ చేశాను. అందులో తప్పేంటి' అంటూ ప్రశ్నిస్తోంది. కంగనా మాట తీరుకు చాలా మంది షాకయ్యారనే చెప్పాలి. ఇప్పటికే అందరూ ఆమె తీరును తప్పు పడుతున్నారు. అయినా కూడా ఇంత కఠినంగా మాట్లాడుతోంది. మరి దీనికి రియాక్షన్ ఎలా ఉంటుందో.



సుకుమార్‌తో సెట్టయ్యింది

ఓపక్క దర్శకుడిగా టాప్ స్టార్స్‌తో భారీ బడ్జెట్ చిత్రాలను తెరకెక్కిస్తూనే.. మరోపక్క తన నిర్మాణ సంస్థ 'సుకుమార్ రైటింగ్స్' ద్వారా యంగ్ హీరోలతో సినిమాలు నిర్మిస్తున్నాడు సుకుమార్. ఇప్పుడు నాగశౌర్యతో ఓ మూవీ తీయడానికి రెడీ అయ్యాడు. నార్త్ స్టార్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ అధినేత శరత్ మరార్‌తో కలిసి ఈ చిత్రం తీయనున్నాడు. ప్రతిసారీ తాను నిర్మించే సినిమాలతో తన అసిస్టెంట్లకు దర్శకులుగా నిరూపించుకునే అవకాశం కల్పించే సుకుమార్... ఈసారి ఆ అవకాశం కాశీ విశాల్‌కి ఇచ్చాడు. కొంత కాలంగా నాగశౌర్యకి చెప్పుకోదగ్గ విజయాలు లేవు. ఈ సమయంలో సుకుమార్‌తో సినిమా చేయడమంటే మంచి అవకాశమనే చెప్పాలి. మరి నాగశౌర్య కెరీర్‌ని సుకుమార్ ఎలాంటి మలుపు తిప్పుతాడో చూడాలి.

కామెడీ కాదు...సీరియస్



'అర్జున్ రెడ్డి' సినిమాలో హీరోకి సిన్సియర్ ఫ్రెండ్‌గా మెప్పించాడు రాహుల్ రామకృష్ణ. ఇప్పటికే కొన్ని చిత్రాల్లో కామెడీ పాత్రలతో పాటు లీడ్ రోల్స్ కూడా చేస్తున్నాడు. ఇప్పుడు ఒక ఇంగ్లిష్ సినిమాలో కూడా అవకాశం సంపాదించి సర్‌ప్రైజ్ చేశాడు. ప్రదీప్ కాటసాని దర్శకత్వం వహిస్తోన్న 'సిల్క్ రోడ్' చిత్రంలో లీడ్ రోల్ చేస్తున్నాడు రాహుల్. ఈ సినిమా మొత్తం లాస్ ఏంజెలెస్‌లో సాగే సైబర్ క్రైమ్ చుట్టూ తిరుగుతుందట. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి పంపేందుకు గాను అత్యున్నత ప్రమాణాలతో తీస్తున్నారట. ఇందులో రాహుల్ పాత్ర చాలా సీరియస్‌గా ఉంటుందట.

కోర్టుకి వెళ్లయినా రిలీజ్ చేస్తాం


నిర్మాత వెంకట్, దర్శకుడు నాయక్

బెనర్జీ, వెంకట్, ముమైత్ ఖాన్, సంజీవ్ కుమార్, సుమన్ రంగనాథన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'దండుపాళ్యం 4'. వెంకట్ నిర్మించిన ఈ చిత్రానికి కె.టి.నాయక్ దర్శకత్వం వహించారు. చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమాకి సెన్సార్ సమస్యలు తలెత్తడంతో శనివారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా నిర్మాత వెంకట్ మాట్లాడుతూ... "సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేయాలనుకున్నాం. గతేడాది నవంబర్లో కన్నడలో సెన్సార్‌కి అప్లై చేస్తే... ఎలాంటి కారణాలు, కట్స్ చెప్పకుండా సినిమాని తిరస్కరించారు. అందుకే రివైజింగ్ కమిటీకి వెళ్తున్నాం. అక్కడా పని జరక్కపోతే ట్రిబ్యునల్‌కి వెళ్తాం. కోర్టుకి వెళ్లయినా ఈ సినిమాని రిలీజ్ చేస్తాం" అని చెప్పారు. "ఇంతకన్నా పెద్ద క్రైమ్ సినిమాలు సెన్సార్ పూర్తి చేసుకుని విజయవంతంగా ఆడి థియేటర్స్ నుంచి వెళ్లిపోయాయి కూడా. మరి మా సినిమాతో సెన్సార్ బోర్డ్‌కి ఇబ్బందేంటో అర్థం కావడం లేదు. సినిమా బాగా వచ్చింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మార్చిలో రిలీజ్ చేస్తాం" అని దర్శకుడు అన్నారు. ఇదొక రా ఫిల్మ్ అని, ఆర్టిస్టులంతా సహజంగా నటించారని, మంచి హ్యూమర్ ఉంటుందని చెప్పారు దండుపాళ్యం గ్యాంగ్‌కి లీడర్‌గా నటించిన బెనర్జీ. ఈ సినిమా విషయంలో అన్ని రకాలుగా సపోర్ట్ అందిస్తామని తెలుగు ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి ముత్యాల రామదాసు తెలిపారు.

చీప్ కామెంట్స్ ఆపండి



కొన్ని విషయాల గురించి సున్నితంగా మాట్లాడాలి. లేదంటే మనసులు నొచ్చుకుంటాయి. నేహా ధూపియాకి కూడా అలానే అయ్యింది. ఈ మధ్యనే ఒక బిడ్డకు జన్మనిచ్చింది నేహా. దానివల్ల కాస్త ఎక్కువగానే బరువు పెరిగింది. దాంతో ఒక ప్రముఖ మ్యాగజీన్ నేహా బరువు గురించి కాస్త వ్యంగ్యంగా వ్యాసం ముద్రించింది. అది చదివిన నేహా హర్టయ్యింది. "నా శరీరం గురించి నేనెవరికీ సమాధానం చెప్పాల్సిన పని లేదు. ఇలాంటి సమస్యలు అందరికీ వస్తాయి. సెలెబ్రిటీలు కూడా ఇందుకు అతీతం కాదు. ఒక తల్లిగా ఇప్పుడు నేను నా బిడ్డ మీద శ్రద్ధ పెడతాను తప్ప నా ఫిగర్ మీద కాదు. ఆడవాళ్ల లుక్స్ మీద చీప్ కామెంట్స్ చేయడం మానండి. ఎదుటివారి పట్ల కాస్త ప్రేమతో మెలగండి" అంటూ క్లాస్ పీకింది. ఇలాంటి చీప్ రాతలు రాయడానికి, పబ్లిష్ చేయడానికి సిగ్గుపడాలి అంటూ కొందరు సినీ ప్రముఖులు స్ట్రాంగ్‌గానే రియాక్ట్ అవుతున్నారు.

ఈసారి హారర్‌తో



హాలీవుడ్‌లో వచ్చే హారర్ సినిమాల్ని ఎక్కువమంది ఇష్టపడటానికి కారణం... వాటి కథ, కథనం, విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా ఉండటమే. తమ చిత్రం కూడా ఆ స్థాయిలో ఉంటుందంటున్నాడు సచిన్ జోషి. ఆయన హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'అమావాస్య'. నర్గీస్ ఫక్రి హీరోయిన్. భూషణ్ పటేల్ దర్శకుడు. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో సచిన్ మాట్లాడుతూ... 'నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. తెలుగు, హిందీ భాషల్లో ఇప్పటికే చాలా హారర్ సినిమాలొచ్చాయి. వాటన్నింటికీ భిన్నంగా రూపొందిన క్లాసిక్ హారర్ చిత్రమిది. కొత్త టెక్నాలజీని, విజువల్ ఎఫెక్ట్స్‌ని వాడాం. నా పాత్ర పేరు కరణ్. అహనా పాత్రలో నర్గీస్ నటించింది. వీకెండ్‌కి లండన్‌లోని ఓ పురాతన భవంతికి వెళ్లిన వీరి జీవితంలో ఏం జరిగిందనేది కథ. 1920, రాగిణి ఎంఎంఎస్2 వంటి చిత్రాలతో హారర్ సినిమాల ఎక్స్‌పర్ట్‌గా పేరుగాంచిన భూషణ్ అద్భుతమైన కథ, స్క్రీన్‌ప్లేతో తీశాడు' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'దేశంలోనే ఇప్పటివరకూ ఏ హారర్ సినిమాలో చూడని వీఎఫ్ఎక్స్‌ని ఇందులో చూడొచ్చు. ద్వితీయార్ధంలో చాలా ట్విస్టులుంటాయి. క్లైమాక్స్ షాక్‌కు గురిచేస్తుంది' అన్నారు. కపిల్ శర్మ కామెడీ షోతో పాపులరైన అలీ అస్గర్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. హారర్ డోసు ఎక్కువుండే ఈ మూవీలో తన పాత్ర రిలీఫ్ అని, బలవంతపు కామెడీ కాకుండా పాత్ర ప్రవర్తనే నవ్విస్తుందని అలీ చెప్పాడు.



నవ్విస్తుంది... భయపెడుతుంది

అరుణ్ ఆదిత్, నిక్కీ తంబోలి జంటగా సంతోష్ పి. విజయ్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. ఈ చిత్ర ట్రెయిలర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ... "గతంలో 'ఎల్ 7' అనే హారర్ మూవీలో నటించాను. ఘోరంగా ఫెయిలైంది. ఈసారి చేసే హారర్ అద్భుతంగా ఉండాలనుకున్నాను. ఇది అలాగే ఉంటుంది. అడల్ట్ కంటెంటే కాదు, కడుపుబ్బ నవ్వించే కామెడీ ఉంటుంది. నాకు ఇమేజ్ లేదు. అందుకే ప్రయోగాలు చేయగలుగుతున్నాను" అన్నాడు. దక్షిణాదిలో ఈ జానర్ కొత్త అని, అందుకే తమిళంలో హిట్టయిన ఈ సినిమాని తెలుగులో తీశామని తెలిపిన దర్శకుడు... పద్దెనిమిదేళ్లు దాటినవాళ్లే సినిమా చూడాలని చెప్పాడు. ఇది బూతు సినిమా కాదని, మంచి ఎమోషన్ కూడా ఉంటుందని, ఈ సినిమా తనకి 'ఆనందో బ్రహ్మ' స్థాయిలో గుర్తింపు తెస్తుందని తాగుబోతు రమేష్ అన్నాడు.

సమకాలీన రాజకీయాలతో...



దేవీ వరప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపాటి రూపొందించిన చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. అట్లూరి నారాయణ రావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ..."సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్ని వర్గాలకు నచ్చే అంశాలతో పాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి" అన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ...'అనుకున్న దానికన్నా సినిమా చాలా బాగా వచ్చింది. మా దర్శకుడు పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో ఎక్కడా ఇబ్బంది కలుగకుండా సినిమా పూర్తి చేశారు' అన్నారు. ఈ చిత్రానికి ఫణి కళ్యాణ్ సంగీతం అందించారు.


ట్విటర్ టాక్

తాను దర్శకత్వం వహించిన 'ఛలో' సినిమా విడుదలై శనివారానికి సంవత్సరం కావడంతో దర్శకుడు వెంకీ కుడుముల ఇలా ట్వీట్ చేశాడు.



"దర్శకుడిగా నువ్వు నాకు జన్మనిచ్చి సరిగ్గా సంవత్సరమయ్యింది. నేను నా తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందబాష్పాలు చూడగలిగానంటే అది నీవల్లే. థ్యాంక్స్ 'ఛలో'... నాకు అద్భుతమైన జ్ఞాపకాలను ఇచ్చినందుకు, విలువైన పాఠాలను నేర్పినందుకు, ఎనలేని సంతోషాన్ని పంచినందుకు."

ఆన్ లొకేషన్



రెమో డిసౌజా దర్శకత్వంలో డ్యాన్స్ ప్రధానంగా తెరకెక్కిన 'ఏబీసీడీ' సిరీస్ చిత్రాలు విజయం సాధించాయి. ఇప్పుడా సినిమాకి మరో సీక్వెల్ తీస్తున్నాడు రెమో. వరుణ్ ధావన్, శ్రద్ధాకపూర్, నోరా ఫతేహి లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఆ షూటింగ్ లొకేషన్లో విదేశీ ఆర్టిస్టులతో వరుణ్, నోరా.

గప్‌చుప్



తమిళనాట బయోపిక్‌ల హవా పెరుగుతోంది. ఆల్రెడీ జయలలిత బయోపిక్‌ను నలుగురు దర్శకులు ప్రకటించారు. ఇప్పుడు మరో ప్రముఖ వ్యక్తి బయోపిక్ తీయడానికి ప్రతిభన్, కె.రాజేశ్వర్ అనే ఇద్దరు డైరెక్టర్స్ పోటీ పడుతున్నారట. ఎంజీఆర్, జెమినీ గణేశన్‌లతో సమానంగా రెమ్యునరేషన్ తీసుకున్న నటుడు, దర్శకుడు, సింగర్, డ్యాన్సర్ జేపీ చంద్రబాబు... నిర్మాతగా మారి, తీవ్రంగా నష్టపోయి, దుర్భర పరిస్థితుల్లో మరణించాడు. ఆయనపై మూవీ రానుందని, ఆయన పాత్రను ప్రభుదేవా పోషించనున్నాడని వినికిడి.

ఫొటో ఫీస్ట్

మనిషి మీదయితేనేం... జంతువుల మీద అయితేనేం... నిష్కల్మషమైన ప్రేమకు హద్దులు ఉండవంటారు. నిక్కీ గల్రానీకి కూడా తన పెంపుడు కుక్కలంటే చెప్పలేనంత ప్రేమ. వాటిని ఎంత ఆప్యాయంగా ముద్దాడుతోందో చూడండి!



నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.395	రూ.4.55
వరంగల్	రూ.397	రూ.4.55




ఎస్‌బీఐ డేటా సేఫ్

హైదరాబాద్, వెలుగు: డేటా లీకేజ్ పై వస్తున్న వార్తలపై ఎస్‌బీఐ స్పందించింది. తమ డేటా అంతా భద్రంగానే ఉందని, ఎలాంటి లీకేజ్ జరగలేదని స్పష్టం చేసింది. తమ కస్టమర్ల అకౌంట్ల వివరాలను గోప్యంగా ఉంచడానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని, దానికి కావల్సిన అన్నిరకాల భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని తెలిపింది. డేటా లీకేజీ వార్తలను తీవ్రంగా పరిగణించామని, భవిష్యత్‌లో కూడా కస్టమర్ల డేటా భద్రతకు కట్టుబడి ఉంటామని భరోసా ఇచ్చింది. ఎస్‌బీఐ డేటా లీక్ అయినట్లు గురువారం నాడు టెక్ క్రంచ్ ఓ కథనం వెల్లడించింది. దీనిపై స్పందించిన ఎస్‌బీఐ వెంటనే ఇన్వెస్టిగేషన్ ను చేపట్టింది. జనవరి 27న తమ ప్రాసెస్ మిస్‌కాన్ఫిగర్ అయిందని, దాన్ని గుర్తించి వెంటనే సరి చేశామని, అదేరోజు మీడియాకు కూడా దీనిపై సమాచారం అందించామని ఎస్‌బీఐ తెలిపింది.

షేర్లు అమ్మాలె... 90 వేల కోట్లు తేవాలె

ఇదీ సర్కార్ డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్



ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్ 80 వేల కోట్ల రూపాయల్లో ఇప్పటి వరకు 36 వేల కోట్ల రూపాయలే సమీకరించారు.

వచ్చే ఫైనాన్షియల్ ఇయర్‌లో 90 వేల కోట్ల రూపాయలను సమీకరించాలని బడ్జెట్‌లో టార్గెట్‌గా పెట్టుకున్నారు.

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, వాటాల అమ్మకం ద్వారా రూ.90 వేల కోట్లు సంపాదించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం టీహెచ్‌డీసీఐఎల్, రైల్‌టెల్ వంటి 10 ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల అమ్మకానికి ఐపీఓలను నిర్వహించనుంది. ఈ విషయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అతాను చక్రవర్తి వెల్లడించారు. గత బడ్జెట్‌లో డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్ రూ.80 వేల కోట్ల రూపాయలు కాగా ఈ బడ్జెట్‌లో దానిని రూ.90 వేల కోట్లకు పెంచారు.

మూడు రకాలుగా.....

పది పిఎస్‌యుల్లో షేర్లను పబ్లిక్‌కు ఆఫర్ చేయడంతో పాటు కొన్ని పిఎస్‌యుల్లో వ్యూహాత్మకంగా డిజిన్వెస్ట్‌చేస్తారు. అంటే పబ్లిక్ ఇష్యూ మార్గంలో కాకుండా ఆ సంస్థలపై ఆసక్తి ఉన్న కంపెనీలకు గుత్తాగా షేర్లను విక్రయిస్తారు. ఈ రెండు పద్ధతులతోపాటు పెద్దగా వినియోగంలో లేని, ప్రభుత్వానికి ఆసక్తి లేని అసెట్స్‌ను తెగనమ్ముతారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెట్ ఫండ్స్‌కు పెరుగుతున్న ఆదరణ వల్ల మరికొన్ని కొత్త ఇటిఎఫ్‌లను కూడా ప్రభుత్వం ప్రారంభించే అవకాశం ఉందని చక్రవర్తి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత డిజిన్వెస్ట్‌మెంట్ మొదలవుతుంది.

ప్లాన్ రెడీగా ఉంది....

కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.90 వేల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించడానికి ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసి ఉంచామని చక్రవర్తి చెప్పారు. సెక్టర్లవారీ ఈటీఎఫ్‌లలో నష్టభయం లేకుండా రిటైల్ ఇన్వెస్టర్లు మదుపు చేసే విధానాన్ని రూపొందించడానికి తమ శాఖ అధ్యయనం చేస్తుందని వెల్లడించారు. సీపీఎస్ఈలో వాటాల అమ్మకానికి ఈటీఎఫ్ ఉత్తమమైన పద్ధతి అని అన్నారు. అందుకే ప్రభుత్వం ఇది వరకే సీపీఎస్ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్‌లను ప్రవేశపెట్టిందని, వీటితో రూ.17 వేల కోట్లు, రూ.8,325 కోట్ల రాబడి వచ్చిందని వివరించారు. "ఈటీఎఫ్‌ను వ్యక్తిగత షేర్‌గా పరిగణించకూడదు. నష్టాలను తగ్గించడానికి మేం ఈటీఎఫ్‌లో అన్ని షేర్లను కలిపేస్తాం. ప్రస్తుత ఈటీఎఫ్‌లు విదేశాల్లోని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడ్ కావడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం" అని చక్రవర్తి వివరించారు.

ఈ ఏడాది టార్గెట్‌లో సగమే...


ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సీపీఎస్ఈల్లో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80 వేల కోట్ల రూపాయలు. ఇప్పటి వరకు గత పది నెలల్లో సీపీఎస్ఈల్లో వాటాల అమ్మకం, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ బైబ్యాక్స్ ద్వారా రూ.36 వేల కోట్లు మాత్రమే సమీకరించారు. ఈ ఏడాది మార్చిలోపు అంటే మరో రెండు నెలల్లో రూ.44 వేల కోట్లు సమీకరించాల్సి ఉంది. మార్కెట్‌లో ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా ఈ టార్గెట్‌ను ప్రభుత్వం అందుకోగలదా అన్నది అనుమానమే. అయితే ఒక పిఎస్‌యు షేర్లు మరో పిఎస్‌యుకు అమ్మడం ద్వారా ఈజీగా డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్‌ను పూర్తి చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆర్ఈసిలోని సర్కారు షేర్లను పవర్ ఫైనాన్స్‌కు అంటగట్టడం, అలాగే ప్రభుత్వం దగ్గర ఉన్న ఓఎన్‌జిసి, కోల్ ఇండియా, ఐఒసి షేర్లను ఆ కంపెనీలకే అమ్మడం... వంటి వ్యూహాలను గురించి ఆలోచిస్తున్నారు. ఈ పద్ధతిలో కనీసం 27 వేల కోట్ల రూపాయల రాబడిని ప్రభుత్వం అంచనా వేస్తోంది. హెలికాప్టర్ సేవలు అందించే పవన్‌హన్స్ కంపెనీలో కూడా స్ట్రాటజిక్ డిజిన్వెస్ట్‌మెంట్ అంటే ఏదైనా ఒక సంస్థ, కంపెనీకి ఏకమొత్తంగా వాటాలను విక్రయించే అవకాశం కూడా ఉంది. ఇవన్నీ మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.



ఐటీఆర్ తప్పదు!!

న్యూఢిల్లీ: ఐటీ మినహాయింపు పరిమితి ఇప్పటికీ 60 ఏళ్ల లోపు వారికి రూ.2.5 లక్షలు, సీనియర్ సిటిజన్లకు రూ.3 లక్షలేనని, ఈ పరిమితులకు మించి వార్షికంగా ఎంత సంపాదించినా.. కచ్చితంగా ఐటీఆర్ దాఖలు చేయాల్సిందేనని పన్ను నిపుణులు చెబుతున్నారు. ఐటీఆర్ ఫైల్ చేస్తేనే రిబేట్ వస్తుందని సూచిస్తున్నారు. రూ.5 లక్షల ఆదాయం ఉండి కూడా ఐటీఆర్ ఇవ్వకుంటే ఐటీ నోటీసు తప్పదు. 'రూ.5 లక్షలు, ఆ లోపు ఆదాయమున్న వారు ఎలాంటి పన్ను చెల్లించాల్సినవసరం లేదు. కానీ బేసిక్ మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలకు మించి ఆదాయం ఆర్జిస్తే మాత్రం కచ్చితంగా ఐటీఆర్ దాఖలు చేయాల్సిందే' అని ట్యాక్స్ ఫైలింగ్ సంస్థ ట్యాక్స్2విన్.ఇన్ సీఈవో అభిషేక్ సోని చెప్పారు. ఈ ఫైలింగ్‌లో మీ వేతనం, సేవింగ్స్ అకౌంట్, ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి వచ్చే వడ్డీ ఆదాయం వంటివి తెలుపాలని పేర్కొన్నారు. అప్పుడైతేనే అన్ని డిడక్షన్స్, ట్యాక్స్ బ్రేక్స్‌ను మీరు క్లెయిమ్ చేసుకోవచ్చు. స్థూల పన్ను ఆదాయం నుంచి అన్ని డిడక్షన్స్‌ను క్లెయిమ్ చేసుకున్నాక, మీ నికర పన్ను ఆదాయం రూ.5 లక్షలకు మించకపోతే, అప్పుడు సెక్షన్ 87ఏ కింద మీరు రిబేట్‌కు అర్హులు అవుతారు.

బడ్జెట్‌తో బూస్ట్



- డిమాండ్ పెరుగుతుంది
- ఆర్థికవృద్ధికి ఊతం
- వినిమయరంగానికి మేలు
- ఆర్థిక సంస్థల అంచనా

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పన్ను మినహాయింపు పరిమితిని రూ.ఐదు లక్షల వరకు పెంచడం, రైతులకు వార్షిక పరిహారం చెల్లించడం వంటి చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. ఎఫ్ఎంసీజీ, రిటైల్, ఆటోమొబైల్ రంగాల్లో అమ్మకాలు భారీగా పెరుగుతాయని సంస్థ అధ్యయనం తెలిపింది. ఇళ్ల నిర్మాణానికి పన్ను మినహాయింపులు మరింత పెంచినందున పెద్ద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని, రియల్ ఎస్టేట్ సెక్టర్ అభివృద్ధి చెందుతుందని విశ్లేషించింది. "మధ్యతరగతి ప్రజలు, రైతుల చేతుల్లో మరింత డబ్బు ఉండేలా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో చర్యలు తీసుకుంది. ఫలితంగా వినిమయ రంగానికి ఎంతో మేలు జరుగుతుంది. జీడీపీపై 0.45 శాతం ప్రభావం ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వం ద్రవ్యలోటును 3.4 శాతానికి పరిమితం చేసింది. గత కొన్నేళ్ల కంటే మూలధన వ్యయాలు బాగా తగ్గాయి." అని పేర్కొంది. పన్ను మినహాయింపు పరిధిలో రూ.ఐదు లక్షలకు పెంచడంతోపాటు రైతులకు ఏటా రూ.ఆరు వేల చొప్పున చెల్లిస్తామని ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఫలితంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి కలగనుంది.

డిమాండ్ పెరుగుతుంది:

ఇండియా ఇంక్ అధ్యయనం

నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని ఇండియా ఇంక్ అనే ఆర్థిక సంస్థ అధ్యయనం పేర్కొంది. ఇది డిమాండ్‌ను పెంచుతుందని, ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని పేర్కొంది. మధ్యతరగతి ప్రజలకు, రైతులకు, శ్రామికుల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రకటించినందున వారు మరింత ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే పరిస్థితులు రానివ్వకుండానే రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, మధ్యతరగతి ప్రజలను సమస్యలను పరిష్కరించాలని అదానీ గ్రూపు అధిపతి గౌతమ్ అదానీ, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ఐటీసీ ఎండీ సంజీవ్ పురి, వాల్‌మార్ట్ ఇండియా సీఈఓ క్రిష్ అయ్యర్ వంటి పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. "చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు, రైతులు ఆర్థిక వ్యవస్థకు ఆక్సిజన్ వంటి వాళ్లు. ఈ ఏడాది బడ్జెట్ కోట్లాది మంది ఆంక్షలను నెరవేర్చింది" అని అదానీ ట్వీట్ చేశారు. ఆర్థిక వ్యవస్థకు ఇబ్బంది కలుగకుండా మధ్యతరగతి, రైతులకు మేలు చేశారని ఆనంద్ మహీంద్రా అన్నారు.

షేర్లపై సింగిల్ టైం స్టాంప్‌డ్యూటీ

ఒకే చోటు.. ఒకే రేటు



- నగదు మొత్తం నేరుగా రాష్ట్రాలకు బదిలీ
- ఈక్విటీ లావాదేవీలపైనా స్టాంప్‌డ్యూటీ

న్యూఢిల్లీ: బ్రోకర్ల సెక్యూరిటీల కొనుగోళ్లు అమ్మకాలపై లావాదేవీలపై ఇక నుంచి సింగిల్‌టైం స్టాంప్‌డ్యూటీ వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల బ్రోకర్లకు ఇబ్బందులు తప్పుతాయని, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తోంది. బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లులో ఈ మేరకు ప్రతిపాదన చేశారు. స్టాంప్‌డ్యూటీ విధింపులో మార్పులు చేస్తామని గతంలోనే హామీ ఇచ్చామని మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ మేరకు ఇండియన్ స్టాంప్ చట్టంలో మార్పులు చేశారు. ఇక నుంచి స్టాక్ ఎక్స్చేంజ్‌ల ద్వారానే ఈ డ్యూటీని వసూలు చేస్తారు. కొనుగోలుదారుడి నివాస ప్రాంతాన్ని బట్టి సంబంధిత రాష్ట్రానికి స్టాంప్‌డ్యూటీలోని వాటా చెల్లిస్తారు. సెక్యూరిటీస్ లావాదేవీలకు ఒకేరేటు ఉండాలని స్టాక్‌బ్రోకర్లు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన స్టాంప్‌డ్యూటీ ఉంది. సింగిల్‌టైం డ్యూటీని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చాలా శ్రమించింది.

రాష్ట్రాలను ఒప్పించిన కేంద్రం

ఇండియన్ స్టాంప్ యాక్ట్ 1899 ప్రకారం స్టాంప్‌డ్యూటీని కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. ప్రత్యక్ష పన్నుల రాబడి చాలా భాగం స్టాంప్‌డ్యూటీ ద్వారానే వస్తుంది. బిల్స్ మార్పిడి, ప్రామిసరీ నోట్లు, షేర్ల బదిలీ, డిబెంచర్లు, లేడింగ్ బిల్స్ ప్రాక్సీలు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్స్ వంటి ఆర్థిక లావాదేవీలపై స్టాంప్‌డ్యూటీ విధించే అధికారం కేంద్రానికి రాజ్యాంగం కల్పించింది. స్టాంప్‌డ్యూటీ వసూలు కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక చట్టాలు అమలు చేసే అధికారాలు లేవు. స్టాంప్‌చట్టం షెడ్యూల్ 1ఏలోని జాబితాలోని ఆర్థిక లావాదేవీలపై మాత్రమే స్టాంప్‌డ్యూటీ వసూలు చేయడానికి అధికారం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం స్టాంప్ చట్టం ప్రకారం డిబెంచర్లు, షేర్లపై పన్నును నిర్ధారిస్తుంది. రాష్ట్రాలు మాత్రం కాంట్రాక్టు విలువపై స్టాంప్‌డ్యూటీ విధిస్తాయి. వివిధ రాష్ట్రాలు ఈ చట్టాన్ని ఒక్కో రకంగా ప్రయోగిస్తాయి కాబట్టి రేట్లలో తేడా ఉంటుంది. దీంతో బ్రోకర్లు తక్కువ రేట్లు ఉన్న రాష్ట్రాల నుంచి లావాదేవీలు నిర్వహించడానికి మొగ్గుచూపుతారు. దేశవ్యాప్తంగా ఒకేరకమైన స్టాంప్‌డ్యూటీ విధించేలా చేయడానికి స్టాంప్ యాక్ట్‌లో సవరణలు తేవడానికి ప్రభుత్వం ప్రయత్నించినా, రాష్ట్రాలు మాత్రం స్టాంప్‌డ్యూటీ విధించే అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడలేదు. దేశవ్యాప్తంగా జీఎస్టీని అమలు చేయడంలో విజయం సాధించిన ప్రభుత్వం స్టాంప్ చట్టంలో మార్పులకు రాష్ట్రాలను ఒప్పించగలిగింది. ఇక నుంచి సెక్యూరిటీల జారీకి 0.005 శాతం, బదిలీపై 0.015 శాతం స్టాంప్‌డ్యూటీ విధిస్తారు. ఈక్విటీ లావాదేవీలపైనా స్టాంప్‌డ్యూటీ విధించాలని ఫైనాన్స్ బిల్ ప్రతిపాదించింది. సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని రద్దు చేయాలని కోరుతున్న బ్రోకర్లకు ఇది రుచించడం లేదు. స్టాంప్‌డ్యూటీతోపాటు ఎస్టీటీని కలుపుకుంటే లావాదేవీల వ్యయం పెరుగుతుంది. ఇక నుంచి స్టాక్ ఎక్స్చేంజీలే స్టాంప్‌డ్యూటీని వసూలు చేసి సంబంధిత రాష్ట్రాలకు చెల్లిస్తాయి.

కొత్త రూల్స్‌తో అమెజాన్‌కు ఇక్కట్లు!

ఇన్ని రోజులు ఏ వస్తువు కావాలన్నా చేతిలోని ఫోన్ తీసి రెండు నిమిషాల్లో కావాల్సిన వస్తువులను ఆర్డర్ చేస్తే 1,2 రోజుల్లో లేదా ప్రైమ్ కస్టమర్లకైతే 24 గంటల్లోపే డెలివరీ అయ్యేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఈ–కామర్స్ ఎఫ్‌డిఐ పాలసీతో ఇక ఆన్‌లైన్ ఆర్డర్లకు కనీసం 4–7 రోజులు ఎదురుచూడాల్సిందే.



- ఇక నుంచి డెలివరీలు ఆలస్యం
- వేలాది వస్తువులు మాయం
- చవక ధరలు కష్టమే

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-కామర్స్ ఎఫ్‌డిఐ పాలసీ వల్ల ఈటైలింగ్ వెబ్‌సైట్ల ద్వారా కొనుగోలుచేసే కస్టమర్లు ఇక డెలివరీ కోసం 1,2 రోజులు కాకుండా 4-7 రోజులు ఆగాల్సి ఉంటుంది. కొన్ని వస్తువులకు అంతకంటే ఎక్కువ సమయం కూడా పట్టవచ్చు. కొత్త నిబంధనలు అమెజాన్ పై ఎక్కువగా ప్రభావం చూపనున్నాయి. నిబంధనల ప్రకారం స్వంత ఉత్పత్తులతో పాటు ఇతర సంస్థల్లో వాటా ప్రయోజనం ఉన్న ఉత్పత్తులను వెండర్స్ ద్వారా కూడా ఈ-కామర్స్ సైట్లలో అమ్మకూడదు. అమెజాన్ కు క్లౌడ్‌టేల్, అపారియో సెల్లర్ల ద్వారానే దాదాపు 50 శాతం అమ్మకాలు జరుగుతున్నాయి. కానీ ఫిబ్రవరి 1 నుండి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెజాన్ వేలాది వస్తువులను తొలగించింది. కొత్త నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం తప్ప అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు వేరేమార్గం లేదు.

వేలాది వస్తువులు మాయం

కొత్త నిబంధనల నేపథ్యంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల నుండి వేలాది ఉత్పత్తులు మాయమయ్యాయి. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, గ్రోసెరీ, ఫ్యాషన్ తో పాటు పలు విభాగాల్లో ఎన్నో ఉత్పత్తులను తీసివేసింది. అలెక్సా ఎకో స్పీకర్లు, బ్యాటరీలు, క్లౌడ్‌టేల్ ద్వారా అమ్మే ఫ్లోర్ క్లీనర్స్, ఇతర రోజూవారి ఉత్పత్తుల వంటి వేలాది ప్రొడక్ట్స్ అమెజాన్ సైట్ నుండి మాయమయ్యాయి. అమెజాన్ జాయింట్ వెంచర్ పార్ట్‌నర్ గా ఉన్న క్లౌడ్‌టేల్, అపారియో వంటి సెల్లర్లు ఇక అమెజాన్ లో దాదాపు కనుమరుగైనట్లే. ఈ కొత్త పాలసీ అటు అమ్మకందారులతో పాటు కొనుగోలుదారులుపై కూడా ప్రభావం చూపనుంది. ఎప్పటిలా భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరకే వస్తువులు లభించడం కష్టమే. దీంతో పాటు డెలివరీ కూడా ఆలస్యం కానుంది.

ప్రభుత్వ నిర్ణయం పై అసంతృప్తి

ఇండియాలో ప్రైజ్ సెలక్షన్ తో పాటు వెసులుబాటు వంటి వాటితో బిజినెస్ ను నిర్మించుకున్నామని, కానీ కొత్త నిబంధనల వల్ల కస్టమర్లకు, సెల్లర్లకు ఈ విషయంలో ఎలాంటి లాభం ఉండబోదని అమెజాన్ సీఎఫ్‌వో బ్రేన్ ఓల్సావ్‌స్కి అన్నారు. అయినప్పటికీ కస్టమర్లపై ఈ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నిబంధనలను వాయిదా వేయడానికి వాల్‌మార్ట్, అమెజాన్ ఎంత ప్రయత్నించినప్పటికీ, ముందుచెప్పిన డెడ్‌లైన్ లో ఎలాంటి మార్పులేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో 6 నెలల గడువు కావాలని కోరిన ఫ్లిప్‌కార్ట్ ప్రభుత్వ నిర్ణయం పై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఫ్లిప్‌కార్ట్ కు లార్జ్ సెల్లర్స్‌తో ఎలాంటి భాగస్వామ్యం లేనందున ఇప్పటికిప్పుడు పెద్దగా ప్రభావం పడే అవకాశం లేదు. కానీ రానున్న రోజుల్లో ఇన్వెంటరీ అయిపోయిన తరువాత బ్రాండ్స్‌తో మళ్లీ కొత్తగా ఒప్పందాలు కుదుర్చుకోవాలి.

తెరమీదకు కొత్త సెల్లర్లు

24 గంటల్లో ప్లాట్‌ఫామ్ పై కొత్త సెల్లర్లు తెరమీదకు వచ్చారు. క్లౌడ్‌టేల్ కు సంబంధించిన కొన్ని ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇప్పుడు అమెజాన్ డివైజెస్ ను ఫర్ యు మార్కెటింగ్ విక్రయిస్తోంది. దీంతో పాటు జై సమధ కూడా అమెజాన్ లో తమ అమ్మకాలను సాగిస్తోంది.

50 బిలియన్ డాలర్ల నష్టం

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లో 77 శాతం వాటా కొనుగోలు చేసిన వాల్‌మార్ట్ సంస్థ శుక్రవారం తమ మార్కెట్ విలువను 50 బిలియన్ డాలర్ల మేర నష్టపోయాయి. ఇండియన్ రిటేల్ మార్కెట్ పై అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు భారీగా పెట్టుబడులు పెట్టాయి. అమెజాన్ 5 బిలియన్ డాలర్లు పెట్టగా, వాల్‌మార్ట్ గతేడాది ఫ్లిప్‌కార్ట్ లో వాటా కోసం 16 బిలియన్ డాలర్లు వెచ్చించింది. కొత్త రూల్స్ వల్ల ఈ రెండు సంస్థల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. నాస్‌డాక్‌లో అమెజాన్ షేర్లు 5.38 శాతం నష్టపోయి షేర్ విలువ 1626.23 డాలర్లకు చేరుకుంది. దీంతో 45.22 బిలియన్ డాలర్ల మేర మార్కెట్ కాపిటలైజేషన్ ను పోగొట్టుకుంది. వాల్‌మార్ట్ షేర్లు ఎన్‌వైఎస్ఈ లో 2.06 శాతం నష్టపోయి షేర్ విలువ 93.86 డాలర్లకు చేరింది. దీంతో 5.7 బిలియన్ డాలర్ల మేర నష్టపోయింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి యుఎస్ లో అమెజాన్ విలువ 795.18 బిలియన్ డాలర్లు కాగా, వాల్‌మార్ట్ విలువ 272.69 బిలియన్ డాలర్లు.

ప్రైమ్ మెంబర్లకు చేదువార్తే

ఫాస్ట్ డెలివరీ తో పాటు ఇతర సౌకర్యాలను కల్పిస్తూ రూ.999 కు ప్రైమ్ మెంబర్‌షిప్ ను అందించింది. ఇండియాలో గత యేడాది 70 లక్షల మంది ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు న్నట్లు బార్‌క్లేస్ తమ రిపోర్ట్ లో తెలిపింది. నాన్ ప్రైమ్ మెంబర్స్ తో పోలిస్తే ప్రైమ్ మెంబర్స్ తరుచుగా అమెజాన్ లో షాపింగ్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు కొత్త నిబంధనలతో ప్రైమ్ మెంబర్స్ కూడా డెలివరీ కోసం ఎదురుచూడాల్సిందే. చాలా ఉత్పత్తులను వీరికి 24 గంటలలోపే డెలివరీని అందించింది అమెజాన్. కానీ ఇప్పుడు దేనికైనా కనీసం 4-7 రోజులు ఆగాల్సిందే. ఇది ప్రైమ్ సబ్‌స్క్రైబర్లకు నిజంగా చేదువార్తే. నెలసరి సరుకులను ప్రైమ్ నౌ ద్వారా రెండు గంటల్లోపే డెలి వరీ అందిస్తున్న అమెజాన్ కు ఇప్పుడది సాధ్యం కాదు. ప్రైమ్ నౌ స్టోర్ ను పూర్తిగా తొలగించింది. ఇది క్లౌడ్‌టేల్ ఆధ్వర్యంలో నడుస్తున్నందున ఈ మొత్తం సేవలనే నిలిపివేసింది. దీంతో ఈ సేవలపై ఆధారపడ్డ వారికి కూడా తిప్పలు తప్పవు.



బ్లాక్‌స్టోన్ చేతికి ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్

- డీల్ విలువ రూ.2,700 కోట్లు
- దివాన్ అప్పుల సమస్య తీరేనా..?

న్యూఢిల్లీ: వాధ్వాన్ గ్లోబల్ క్యాపిటల్‌కు చెందిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌ను ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్ కొనుగోలు చేసింది. రూ.2,700 కోట్లకు ఈ డీల్ జరిగినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. 'వాధ్వాన్ దివాన్ హౌసింగ్‌కు చెందిన అఫర్డబుల్ హౌజింగ్ ఫైనాన్స్ సంస్థ బిడ్డింగ్‌ను బ్లాక్‌స్టోన్ గెలుచుకుంది. రూ.2,700 కోట్లకు ఈ డీల్‌ను దక్కించుకుంది. ఇది బుక్ పరంగా మూడురెట్లు ఎక్కువ' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ డీల్ తో ఆధార్ హౌసింగ్‌లో వాధ్వాన్ గ్లోబల్ క్యాపిటల్‌కున్న 70 శాతం వాటాను అమ్మినట్లైంది. వాధ్వాన్ గ్లోబల్ క్యాపిటల్ పేరెంట్ కంపెనీ దివాన్ హౌజింగ్ ఫైనాన్స్(డీహెచ్‌ఎఫ్‌ఎల్). ఈ డీల్ డీహెచ్‌ఎఫ్‌ఎల్‌ను కొంత లిక్విడిటీ సమస్య నుంచి బయటపడేస్తుంది. కంపెనీ తన రూ.31వేల కోట్ల రుణాలను దారి మళ్లించిందనే వార్తలు మార్కెట్లోకి పొక్కగానే, డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్లు భారీగా కుప్పకూలాయి. దీనిపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విచారణ జరుపుతుందని రిపోర్టులు కూడా వచ్చాయి. అయితే కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి తాము ఎలాంటి లేఖను పొందలేదని కంపెనీ తెలిపింది. ఈ ఆరోపణలన్నీ కంపెనీ పరువును, ప్రతిష్టను దెబ్బతీయడానికే చేస్తున్నట్టు విమర్శించింది. 'బ్లాక్‌స్టోన్‌తో ఈ డీల్ కార్పొరేట్ రుణ స్థాయిని తగ్గించుకునే ప్రణాళికలో ఒక భాగం. తమ బ్యాలెన్స్ షీటును బలోపేతం చేసుకుంటున్నాం' అని వాధ్వాన్ గ్లోబల్ గ్రూప్ చైర్మన్ కపిల్ వాధ్వాన్ తెలిపారు. ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, జార్ఖండ్, బిహార్ వంటి 13 రాష్ట్రాల్లో కార్యకలాపాలను కొనసాగిస్తోంది. రూ.60 వేల నుంచి రూ.6 లక్షల మధ్య ఆదాయమున్న వారికి రుణాలు ఇస్తూ ఉంటుంది. ఈ ఏడాది అఫర్డబుల్ హౌజింగ్ స్పేస్‌లో జరిగిన డీల్స్‌లో ఇది రెండోది. హెచ్‌డీఎఫ్‌సీ తన అఫర్డబుల్ హౌసింగ్ సబ్సిడరీని బంధన్ బ్యాంక్‌కు అమ్మేసింది.



శిఖరాన మంధాన

వన్డే ర్యాంకింగ్‌లో స్మృతికి టాప్ ప్లేస్

దుబాయ్: టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో సెంచరీ, హాఫ్ సెంచరీతో అదరగొట్టిన మంధాన ఐసీసీ శనివారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు మెరుగు పరుచుకొని టాప్ ప్లేస్ దక్కించుకుంది. పురుషుల విభాగంలో టాప్ ప్లేస్‌లో ఉన్న విరాట్ కోహ్లీ సరసన నిలిచిన మంధాన.. ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఎలిసా పెర్రీ, మెగ్ లానింగ్‌ను వెనక్కు నెట్టింది. పెర్రీ రెండో ర్యాంక్, లానింగ్ మూడో ర్యాంక్‌లో నిలిచారు. కివీస్ టూర్‌లో చెలరేగిన ఆడిన మంధాన తన ర్యాంకింగ్ పాయింట్లను భారీగా పెంచుకుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 751 ర్యాంకింగ్ పాయింట్లు ఉన్నాయి. సెకండ్ ప్లేస్‌లో ఉన్న పెర్రీ 681 పాయింట్లతో నిలిచింది. దాంతో, స్మృతి చాలా కాలం పాటు టాప్ ర్యాంక్‌లో కొనసాగే అవకాశం కనిపిస్తోంది. కివీస్ బ్యాటర్ సాటర్త్‌వైట్ పది స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరింది. టీమిండియా వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ నాలుగు నుంచి ఐదో ర్యాంక్‌కు పడిపోయింది. యువ ఓపెనర్ జెమీమా రోడ్రిగ్స్ ఏకంగా 64 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 61వ ర్యాంకు సాధించింది. బౌలింగ్ విభాగంలో వెటరన్ పేసర్ జులన్ గోస్వామి నాలుగో ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. చెరో ఐదు స్థానాలు ఎగబాకిన పూనమ్ యాదవ్, దీప్తి శర్మ వరుసగా ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో ఉన్నారు. ఏక్తా బిస్త్ 13 ర్యాంకు సాధించింది. ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ నాలుగో ర్యాంకులో నిలిచింది.

వన్డే వరల్డ్‌కప్‌కు ముందు విదేశీ గడ్డపై ఆడనున్న చివరి వన్డేకు టీమిండియా రెడీ అవుతోంది. ఈ మ్యాచ్‌లో నెగ్గి గత పర్యటనలో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవాలని రోహిత్ సేన చూస్తుంటే... లాస్ట్ వన్డేలో నెగ్గి అంతరాన్ని తగ్గించాలని న్యూజిలాండ్ భావిస్తోంది. ధోనీ రాకతో మిడిలార్డర్‌కు కొండంత అండ చేకూరడంతో మొగ్గు మనవైపే కనిపిస్తోంది. స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌పై బ్లాక్‌క్యాప్స్ పేసర్లను రోహిత్ గ్యాంగ్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. లాస్ట్ పంచ్ మనదైతే ఆ కిక్కే వేరు.

లాస్ట్ పంచ్ ఎవరిదో!

నేడు న్యూజిల్యాండ్‌తో చివరి వన్డే

ధోనీ రాకతో బలంగా టీమిండియా ○ ఉ. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



'వరల్డ్‌కప్ సుదీర్ఘ టోర్నీ. తొమ్మిది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. దీంతో గాయాల కారణంగా ఎవరైనా అందుబాటులో లేకుంటే... వారి స్థానాల్లో ఎవరు ఆడతారనే అంశంపై కసరత్తు చేస్తున్నాం. గత మ్యాచ్‌లో అది మాకు అనుభవమైంది. కొత్తగా వచ్చిన ఆటగాళ్లలో ట్యాలెంట్‌కు కొదవ లేదు'
– సంజయ్ బంగర్, ఇండియా బ్యాటింగ్ కోచ్

వెల్లింగ్టన్: వరల్డ్‌కప్‌కు ముందు విదేశీ గడ్డపై ఆడనున్న చిట్టచివరి వన్డేకు టీమిండియా రెడీ అయింది. వరుస మ్యాచ్‌ల్లో విజృంభించి హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ సొంతం చేసుకున్న ఇండియా.. నేడు న్యూజిలాండ్‌తో చివరిదైన ఐదో వన్డే ఆడనుంది. గత మ్యాచ్‌లో ప్రత్యర్థి స్వింగ్‌తో పాటు బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో మూల్యం చెల్లించుకున్న రోహిత్ సేన ఈసారి ఆ తప్పులకు అవకాశం ఇవ్వకుండా చెలరేగాలని భావిస్తోంది. కండరాలు పట్టేయడంతో నాలుగో వన్డేకు దూరమైన మాజీ కెప్టెన్ ధోనీ జట్టుతో చేరనుండటం అదనపు బలమైతే... ఓపెనర్ గప్టిల్ గాయం కారణంగా దూరమవడంతో హోమ్ టీమ్‌కు దెబ్బే. గత పర్యటన (2014)లో 0-4తో సిరీస్ కోల్పోయిన టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ గెలిచి 4-1తో సిరీస్ ముగించాలని పట్టుదలగా ఉంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో కూడా గెలిచి సిరీస్‌ను 2-3తో ముగించాలని బ్లాక్ క్యాప్స్ కసిమీదున్నారు.



ధోనీ రాకతో స్ట్రాంగ్‌గా...

సుదీర్ఘ కెరీర్‌లో గాయాల కారణంగా చాలా తక్కువ సార్లు ఆటకు దూరమైన ధోనీ ఆరేళ్ల అనంతరం హామిల్టన్ వన్డే మిస్సయ్యాడు. అతను తిరిగి కోలుకోవడంతో టీమ్‌కు పెద్ద ఉపశమనం లభించినట్లైంది. నాలుగో వన్డేలో టాపార్డర్ విఫలమవడంతో మిడిల్‌లో ధోనీ లేని లోటు స్పష్టంగా కనిపించింది. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో అరంగేట్రం చేసిన శుభ్‌మన్ గిల్‌కు సీనియర్ల సపోర్ట్ చూస్తుంటే ఈ మ్యాచ్‌లోనూ అవకాశం దక్కొచ్చు. ఇండియా 'ఎ' తరఫున ఆడుతున్న కేఎల్ రాహుల్ ఆకట్టుకోలేకపోతుండటంతో... గిల్ ఈ మ్యాచ్‌లో రాణిస్తే ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో చోటు దక్కించుకోవడమే కాక వన్డే వరల్డ్‌కప్‌కు రిజర్వ్ ఓపెనర్‌గాను ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి. ఓపెనర్లు రోహిత్, ధవన్‌ల తర్వాత కోహ్లీ స్థానంలో గిల్ క్రీజులోకి వస్తాడు. నాలుగులో రాయుడు, ఆ తర్వాత ధోనీ, జాదవ్, పాండ్యా బ్యాటింగ్‌కు దిగుతారు. గత మ్యాచ్‌లో కీపింగ్ బాధ్యతలు మోసిన దినేశ్ కార్తీక్.. ఈ మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితమవ్వచ్చు. బుమ్రా, షమీ గైర్హాజరీలో పేస్ భారం భువనేశ్వర్‌పైనే పడనుంది. మరో పేసర్‌గా ఖలీల్‌నే కొనసాగించే ఛాన్స్ ఉన్నా.. హామిల్టన్‌లో పెద్దగా ప్రభావం చూపని అతన్ని పక్కన పెట్టి సిరాజ్‌కు చోటిచ్చే అవకాశాలను కొట్టిపారేయలేం. పిచ్ స్పిన్‌కు సహకరిస్తే.. మన స్పిన్ ద్వయం చహల్, కుల్దీప్‌ల గురించి చెప్పేదేముంది. గింగిరాలు తిరిగే బంతులతో ప్రత్యర్థికి చుక్కలు చూపడం ఖాయం.

అదే ఊపులో...

ఈ సిరీస్‌లో ఇప్పటివరకు భారీ స్కోర్లు చేయలేకపోయిన న్యూజిలాండ్ చివరి మ్యాచ్‌లోనైనా సమష్టి ఆటతో సత్తా చాటాలనుకుంటోంది. మొదట బ్యాటింగ్ చేసిన రెండు వన్డేల్లో ఓ మోస్తారు స్కోర్లే చేసిన కివీస్ నాలుగో వన్డేలో బౌలింగ్ బలంతో గెలిచింది. ఫస్ట్ వన్డేలో హాఫ్ సెంచరీ తర్వాతా కెప్టెన్ విలియమ్సన్ బ్యాట్ నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. కివీస్ పెద్ద స్కోరు చేయాలంటే కేన్ నిలకడ ముఖ్యం. ఓపెనర్ గప్టిల్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కానుండటంతో మన్రోకు మళ్లీ ఛాన్స్ దక్కనుంది. నికోల్స్‌తో కలిసి అతని ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. మిడిలార్డర్‌లో టేలర్, లాథమ్, గ్రాండ్‌హోమ్ కీలకం కానున్నారు. శాంట్నర్ స్థానంలో ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్ బరిలో దిగొచ్చు. గత వన్డేలో తన పేస్‌తో పాటు స్వింగ్‌తో టీమిండియా బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసిన బౌల్ట్ మరోసారి తన పదును చూపిస్తే టీమిండియాకు కష్టాలే. అతనికి గ్రాండ్‌హోమ్ ఏమాత్రం సహకరిస్తాడో చూడాలి.

పిచ్, వాతావరణం

పిచ్ పేస్‌కు అనుకూలించనుంది. దీంతో బాల్ స్వింగ్ అయ్యే అవకాశాలు ఎక్కువ. సాధారణ ఉష్ణోగ్రత నమోదవ్వచ్చు వేడి గాలులు వీచే వీలుంది. గత మూడేళ్లలో ఈ గ్రౌండ్ సగటు స్కోర్ 207. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే ఛాన్స్ ఉంది.

తుది జట్లు (అంచనా)

ఇండియా: రోహిత్ (కెప్టెన్), ధవన్, శుభ్‌మన్ గిల్, రాయుడు, ధోనీ, జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, చహల్, కుల్దీప్, ఖలీల్/సిరాజ్.

న్యూజిలాండ్: నికోల్స్, మన్రో, విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, లాథమ్, గ్రాండ్‌హోమ్, నీషమ్, బ్రేస్‌వెల్/శాంట్నర్, ఆస్టిల్, హెన్రీ, బౌల్ట్.

డబుల్స్‌లో నెగ్గినా ధమాలే!

కోల్‌కతా: గ్రాస్ ఎఫెక్ట్ పని చేయలేదు. డబుల్స్‌లో అంచనాలను అందుకుంటూ సాధించిన విజయం సరిపోలేదు. డేవిస్ కప్‌లో తొట్టతొలి వరల్డ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాలన్న ఇండియా ఆశ నెరవేరలేదు. సొంతగడ్డపై ఇటలీతో జరిగిన క్వాలిఫయింగ్ పోరులో హోమ్‌టీమ్ 1-3తో ఓడి నిరాశ పరిచింది. ప్రతిష్టాత్మక టోర్నీలో ముందంజ వేయలేకపోయిన మన జట్టు ఈ ఏడాది చివర్లో జరిగే జోన్ గ్రూప్‌లో పోటీపడనుంది. తొలి రోజు రెండు సింగిల్స్‌ల్లో ఓడి 0-2తో వెనుకబడిన దశలో రెండో రోజైన శనివారం ఆట మొదలెట్టిన ఇండియాలో రోహన్ బోపన్న-దివిజ్ ఆశలు రేపారు. రేసులో నిలవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన డబుల్స్‌లో బోపన్న-దివిజ్ జంట 4-6, 6-3, 6-4తో సిమోన్ బెలెలి-మాటెయొ బెరెటిని జోడీపై గెలిచింది. కానీ, తొలి రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లో వరల్డ్ 37వ ర్యాంకర్ ఆండ్రిస్ సెప్పి 6-1, 6-2తో ఇండియా టాప్ సింగిల్స్ ప్లేయర్ ప్రజ్నేశ్ ను చిత్తుగా ఓడించి ఇటలీకి తిరుగులేని విజయం అందించాడు. ఈ గెలుపుతో 12 క్వాలిఫయర్స్ జట్లలో ఒకటిగా నవంబర్‌లో జరిగే ఫైనల్స్‌లో ఇటలీ బరిలోకి దిగనుంది.



○ 1–3తో ఇండియా ఓటమి
○ డేవిస్ కప్ వరల్డ్ ఫైనల్స్‌కు ఇటలీ

ఆసీస్ భారీస్కోరు

కాన్‌బెర్రా: శ్రీలంకతో రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 384/4 తో రెండో రోజైన శనివారం ఆట కొనసాగించిన ఆసీస్ 534/5 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. కుర్టిస్ ప్యాటర్సన్(114 నాటౌట్) కెరీర్‌లో తొలి సెంచరీ చేయగా, టిమ్‌పైన్(45 నాటౌట్) రాణించాడు. పేసర్ విశ్వా ఫెర్నాండో(3/126)కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లంక రెండో రోజు ఆట చివరకు తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 123 రన్స్ చేసింది. కుశాల్ పెరిరా(11) ధనంజయ డిసిల్వా(1) క్రీజులో ఉన్నారు. దిముత్ కరుణరత్నే(46 రిటైర్డ్ హర్ట్) గాయపడడం ఇరుజట్లను కలవరపెట్టింది.

కరుణరత్నే సేఫ్..

లంక ఓపెనర్ కరుణరత్నే తృటిలో పెనుప్రమాదాన్ని తప్పించుకున్నాడు. ఆసీస్ పేసర్ పాట్



కమిన్స్ 142.5 కిమీల వేగంతో వేసిన ఓ బౌన్సర్ తగిలి అతను క్రీజులో కుప్పకూలిపోయాడు. ఇన్నింగ్స్ 30వ ఓవర్లో కమిన్స్ వేసిన బౌన్సర్ భుజానికి, మెడకు మధ్య తగలడంతో కరుణరత్నె నొప్పితో విలవిల్లాడాడు. ఇరుజట్ల ఫిజియోలు పరిస్థితిని గమనించి స్ట్రైచర్‌పై మైదానం బయటకు తీసుకెళ్లారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గాయానికి చికిత్స తీసుకున్న కరుణరత్నే సేఫ్‌గా ఉన్నట్టు లంక టీమ్ తెలిపింది.



కొచ్చి బ్లూ స్పైకర్స్ బోణీ

కొచ్చి: ప్రో వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఘనంగా స్టార్ట్ అయింది. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన ఆరంభ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆరు జట్ల కెప్టెన్‌లతో ప్రతిజ్ఞ చేయించడంతో టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. పీవీఎల్ సీజన్-1 తొలి మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ 4-1తో యు ముంబా వాలీపై గెలిచి బోణీ చేసింది. ఆరంభం నుంచే కచ్చితమైన స్మాష్‌లు, అంతే సూపర్ డిఫెన్స్‌తో ఆకట్టుకున్న కొచ్చి 15-11, 15-13, 15-8, 15-10తో వరుసగా నాలుగు సెట్‌లు గెలిచింది. ఇదే జోరులో మరో సెట్ సొంతం చేసుకుంటే వైట్‌వాష్ కింద 3 పాయింట్లు చేజిక్కించుకునే దశలో పట్టు సడలించి చివరి సెట్‌లో 5-15తో ఓడింది. ఈ విజయంతో కొచ్చి ఖాతాలో 2 పాయింట్లు చేరాయి. కొచ్చి కెప్టెన్ ఉక్రపాండియన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. నేడు జరిగే మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో చెన్నై స్పార్టాన్స్ తలపడనుంది.

తల్లి పోయినా.. గ్రౌండ్‌లోనే

నార్త్‌సౌండ్(ఇంగ్లండ్): క్రీడల పట్ల ఆటగాళ్లు చూపించే ప్రేమ, నిబద్ధతను చూస్తే ఒక్కోసారి కంట నీరు రాకమానదు. ఎంత కష్టం వచ్చినా ఒక్కోసారి జట్టు కోసం బాధను ఓర్చుకుని బరిలోకి దిగుతుంటారు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మూడో రోజు ఆటలో వెస్టిండీస్ యువ పేస్ బౌలర్ ఆల్‌జర్రీ జోసెఫ్ కూడా అదే చేశాడు. జోసెఫ్ తల్లి.. షారోన్ జోసెఫ్ శనివారం ఉదయం మరణించింది. శనివారం మ్యాచ్ ప్రారంభమయ్యే సమయం కంటే ముందే జోసెఫ్‌తో పాటు ఇరు జట్ల ఆటగాళ్లకు ఈ విషయం తెలిసింది. విండీస్ క్రికెట్ బోర్డు కూడా జోసెఫ్ తల్లి మరణించిన వార్తను ట్విటర్ ద్వారా ప్రకటించింది. అయితే తల్లి మరణ వార్త విన్న 22 ఏళ్ల జోసెఫ్.. గుండెల్లో అంత బాధను దాచుకుని మరి శనివారం బ్యాటింగ్‌కు దిగాడు. 20 బంతులు ఎదుర్కొని 7 పరుగులు చేసి ఔటయ్యాడు.

విదర్భ X సౌరాష్ట్ర

నేటి నుంచి రంజీ ఫైనల్

నాగ్‌పూర్: దేశవాళీ మెగా టోర్నీ రంజీ ట్రోఫీ ఫైనల్‌కు వేళయింది. ఆదివారం ప్రారంభమయ్యే తుదిపోరులో డిఫెండింగ్ చాంప్ విదర్భ, సౌరాష్ట్ర అమీతుమీ తేల్చుకోనున్నాయి. టైటిల్ నిలబెట్టుకోవాలని విదర్భ పట్టుదలగా ఉంటే, ఎలాగైనా ట్రోఫీ సాధించాలని సౌరాష్ట్ర కసిగా ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు అదరగొట్టిన ఈ రెండు జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో 1003 రన్స్ చేసిన జాఫర్‌తో పాటు కెప్టెన్ ఫైజ్ ఫజల్(786), అక్షయ్ వాడకర్(680) తో విదర్భ బ్యాటింగ్ దుర్భేధ్యంగా కనిపిస్తోంది. ఉమేశ్ యాదవ్‌తో పాటు రజ్‌నీష్ గుర్బాని, యష్ ఠాకూర్‌తో బౌలింగ్ కూడా బలంగా ఉంది. ఇక, జయదేవ్ ఉనాద్కట్ నాయకత్వంలోని సౌరాష్ట్ర జట్టు టీమిండియా ప్లేయర్ చటేశ్వర్ పుజారాపై భారీ ఆశలు పెట్టుకుంది. పుజారాతో పాటు షెల్డన్ జాక్సన్(838 రన్స్), హార్విక్ దేశాయ్(763 రన్స్) కీలకం. బౌలింగ్‌లో కెప్టెన్ జయదేవ్ ఉనాద్కట్‌తో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర జడేజా ఫామ్‌లో ఉన్నారు.

24నే విశాఖలో టీ20

న్యూఢిల్లీ: ఇండియా, ఆస్ట్రేలియాల మధ్య జరిగే టీ20 మ్యాచ్‌ల వేదికలు మారాయి. 3 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20 ఈ నెల 24న బెంగళూరులో, రెండో పోరు 27న విశాఖపట్నంలో జరగాల్సి ఉండగా.. సీఓఏ వేదికలను మారుస్తూ కొత్త షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 24న జరిగే తొలి మ్యాచ్‌కు వైజాగ్.. 27న రెండో మ్యాచ్‌కు బెంగళూరు ఆతిథ్యమివ్వనున్నాయి.

V6 NEWS ప్రభాత వెలుగు తెలుగు దినపత్రిక
క్రికెట్ టోర్నమెంట్
www.v6velugu.com v6velugu

చెలరేగిన హర్షవర్ధన్, నర్సింహులు

ఆర్మూర్, వరంగల్ ఈస్ట్ ముందంజ ● వెలుగు క్రికెట్ టోర్నమెంట్



హర్షవర్ధన్ (94 నాటౌట్)



నర్సింహులు (5/17)

ఆర్మూర్/వరంగల్/కామారెడ్డి, వెలుగు: వీ6 వెలుగు క్రికెట్ టోర్నమెంట్ వరంగల్, నిజామాబాద్ జిల్లా స్థాయి పోటీల్లో ఆర్మూర్, వరంగల్ ఈస్ట్ జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. నిజామాబాద్ జిల్లా అంచె పోటీల్లో భాగంగా ఆర్మూర్ జావెద్ భాయ్ మినీ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్మూర్ 52 పరుగుల తేడాతో బాల్కొండను చిత్తుగా ఓడించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హర్షవర్ధన్ సింగ్ (77 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 94 నాటౌట్)తో పాటు నరేశ్ (56 నాటౌట్) చెలరేగడంతో మొదట ఆర్మూర్ వికెట్ నష్టపోకుండా 163 రన్స్ చేసింది. అనంతరం ఛేజింగ్‌లో బాల్కొండ 17 ఓవర్లలో 111 రన్స్‌కే ఆలౌటై ఓడిపోయింది. ఇక, కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కామారెడ్డి 109 పరుగులతో భాన్సువాడపై నెగ్గింది. మరో మ్యాచ్‌లో ఎల్లారెడ్డి 60 రన్స్ తేడాతో భాన్సువాడను ఓడించింది. మొదట ఎల్లారెడ్డి 139/6 రన్స్‌చేయగా.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నర్సింహులు (5/17) ధాటికి భాన్సువాడ 79 పరుగులకే ఆలౌటైంది. ఇక, వరంగల్ సీకేఎమ్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జట్టు ఒక్క పరుగు తేడాతో నర్సంపేట్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వరంగల్ ఈస్ట్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 126 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శివ వాట్సన్ (60) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఛేజింగ్‌లో నర్సంపేట్ ఓవర్లన్నీ ఆడి ఎనిమిది వికెట్లకు 125 రన్స్ చేసి ఓడిపోయింది. వరంగల్ బౌలర్ న్సార్ (4/18) నాలుగు వికెట్లు తీశాడు.

రెండడుగుల అనుబంధం



రెండు ఊళ్లు.. జనం తండోపతండాలుగా తరలి వెళుతున్నారు. ఎక్కడికో తెలుసా..? ఓ పెళ్లికి. అలా అని అదేం పెద్దోళ్ల పెళ్లి కాదు. ఓ మామూలు పేద కుటుంబంలో జరుగుతున్న పెళ్లి. మరి, ఆ పెళ్లికి అంత క్రేజ్ ఎందుకు?

మీరట్: పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయంటారు కదా. ఉత్తర్‌ప్రదేశ్ ముజఫర్‌నగర్‌లోని చైతెల్ల గ్రామానికి చెందిన అబ్దుల్ కలాం (24), నాంగ్లా గ్రామానికి చెందిన తరన్నుమ్‌ల పెళ్లి కూడా బహుశా అక్కడే నిర్ణయమైందేమో. కారణం వాళ్ల ఎత్తు. అబ్దుల్ కలాం శారీరక లోపంతో ఎత్తు పెరగలేదు. 2 అడుగుల వద్దే అతడి ఎదుగుదల ఆగిపోయింది. బతుకు బండి లాగేందుకు ఎవరూ పనివ్వలేదు. పెళ్లి చేసుకోవడానికి పిల్లా దొరకలేదు. దీంతో తీవ్రంగా కుమిలిపోయేటోడు. "ఇక నాకు పెళ్లి కాదేమో" అని అమ్మానాన్నల వద్ద గోడు చెప్పుకునేటోడు. ఆ బాధ చూసి వారికీ బాధేసేది. అలాంటి బాధల్లోనే వారికి తరన్నుమ్ రూపంలో సంతోషం, సమస్యకు పరిష్కారం దొరికాయి.

ఎలా కుదిరింది..?

పెళ్లి సంబంధం ఎలా కుదిరిందో తరన్నుమ్ మేనమామ యాసీన్ చెప్పుకొచ్చాడు. తన చెల్లెలు జరీఫీ కూతురే తరన్నుమ్ అని చెప్పిన అతడు.. బావ చనిపోవడంతో కొన్నేళ్లుగా తన వద్దే ఉంటున్నారన్నాడు. అయితే, అబ్దుల్ కలాం తల్లిదండ్రులు యాసీన్‌కు స్నేహితులే. ఓ రోజు తన కొడుకు విషయం గురించి మాట్లాడదామని యాసీన్ ఇంటికి వెళ్లిన కలాం అమ్మానాన్నలు.. తరన్నుమ్‌ను చూశారు. వెంటనే ఉండబట్టలేక సంబంధం మాట్లాడేశారు. ఇద్దరిదీ ఒకే ఎత్తు కాబట్టి.. నిఖా చేస్తే జంట చూడముచ్చటగా ఉంటుందని భావించారు. మాటా ముచ్చట కానిచ్చేసి నిఖా పక్కా చేశారు. అలా వాళ్ల పెళ్లి షామ్లి జిల్లాలోని అంభేత రిందన్ గ్రామంలో జరిగిపోయింది. కలాం బెంగ మొత్తం తీరిపోయింది. అక్కడి వరకు బాగానే ఉంది గానీ.. తమ బతుకుబండి లాగేందుకు ప్రభుత్వమే ఏదో ఒక ఉపాధి కల్పించాలని కలాం కోరుతున్నాడు. తన ఎత్తు వల్ల ఉద్యోగం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావట్లేదన్నాడు. అన్నట్టు కలాం కన్నా తరన్నుమ్ మూడేళ్లు పెద్ద. ఎత్తులోనూ ఓ అంగుళం హైటే. నిజంగా ఈ జంట మేడ్ ఫర్ ఈచ్ అదరే కదూ!!

బుక్కెడు బువ్వ కోసం

జపాన్‌లో కావాలని అదేపనిగా నేరాలు చేస్తూ జైలుకెళుతున్న ముసలోళ్లు

ఓ ముసలాయన సైకిల్ కొట్టేసిండు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు పోయిండు. "దొరా.. ఈ సైకిల్‌ను కొట్టుకొచ్చినా. నన్ను లోపలెయ్యండి" అన్నాడు. పోలీసులు లాకప్‌లో వేసి తర్వాతి రోజు కోర్టుకు తీసుకెళ్లారు. ఆ ముసలాయనకు కోర్టు ఏడాది జైలు శిక్షను వేసింది. ఇంకో ముసలాయనా అంతే.. మరో పళ్లూడిన వృద్ధుడిదీ అదే కథ. అందరిదీ ఒకే కథ.. ఒకే గాథ. అంతా కావాలని జైలుకు వెళుతున్నవారే. మరి వాళ్లు అంత పెద్ద నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారు? బుక్కెడు బువ్వ కోసం. గజం నీడ కోసం. అవును.



జపాన్‌లో ముసలి నేరస్థులు పెరుగుతున్నారు. గత 20 ఏళ్లలో వాళ్ల గ్రాఫ్ క్రమక్రమంగా పెరుగుతోంది. 1997లో 20 మంది నేరస్థుల్లో ఒకరు 60 ఏళ్లపైబడిన వారు ఉండేవారు. కానీ ఇప్పుడు ఐదుగురిలో ఒకరు ఉన్నారు.

ఇదీ తొషియో కథ

69 ఏళ్ల తొషియో తకట ఈమధ్యే జైలు నుంచి విడుదలయ్యాడు. ఎందుకు జైలుకెళ్లావని ఆరా తీస్తే "పెన్షన్ తీసుకునే వయసు వచ్చింది. ఇప్పుడు నా దగ్గర డబ్బుల్లేవు. పేదోడిని.. ఎక్కోడోచోట ఫ్రీగా బతికేయాలి. అది జైలైనా పర్వాలేదు. అందుకే నేరం చేశా.. జైలుకెళ్లా" అని అన్నాడు. "62 ఏళ్ల వయసులో తొలిసారి సైకిలు దొంగిలించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లా. అదే విషయం వాళ్లకు చెప్పా. ప్లాన్ వర్కవుట్ అయింది. కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది" అని చెప్పాడు. బక్కగా, పేలవంగా ఉండే తొషియో.. చూడటానికి దొంగలా ఉండడు. కానీ తన రెండో దొంగతానికి అలానే ప్లాన్ చేశాడు. "పార్కుకెళ్లి చాకుతో కొందరిని బెరించా. వాళ్లలో ఎవరైనా పోలీసులకు ఫోన్ చేస్తాడనుకున్నా. ఒకతను అలానే చేశాడు" అన్నాడు. ఇలా మొత్తంగా ఎనిమిదేళ్లలో నాలుగుగేళ్లు అతను జైల్లోనే గడిపాడు. భార్యాపిల్లలుండుంటే ఇలాంటి పనెందుకు చేస్తానని తొషియో అంటున్నాడు.

- 1997లో 20 మందిలో ఒకరు.. ఇప్పుడు ఐదుగురిలో ఒకరు
- పేదరికం, ఒంటరితనంతో నేరాలు చేస్తూ జైలుకు

ముసలోళ్లే ఎక్కువ

చట్టాన్ని గౌరవించే జపాన్ దేశంలో ముసలివాళ్లు చేస్తున్న నేరాలు పెరిగిపోవడం ఆలోచించాల్సిన విషయం. 1997 నాటి లెక్కలు, ఇప్పటి లెక్కలు పరిశీలిస్తే చాలా తేడా కనబడుతుంది. అప్పుడు 20 మందిలో ఒకరు 60 ఏళ్లపైబడిన వారుంటే ఇప్పుడు ఐదులో ఒకరున్నారు. 65 ఏళ్ల పైబడిన వాళ్ల సంఖ్య కన్నా వేగంగా వాళ్లు చేస్తున్న నేరాలు పెరిగిపోతున్నాయి. పైగా చేసిన వాళ్లే మళ్లీ మళ్లీ నేరాలు చేసి జైలుకెళ్తున్నారు. 2016లో 2,500 మంది 65 ఏళ్ల పైబడినవారు నేరాలు చేస్తే అందులో మూడోవంతు ఇదివరకే ఐదు నేరాలు చేసినవారున్నారు.

చిన్నచిన్న దొంగతనాలే

ముసలివారు చేసిన నేరాల్లో ఎక్కువ షాపు దొంగతనాలే. రూ.2 వేలు కూడా లేని వస్తువులను దొంగతనం చేసి దొరికిపోయినవారే. ఇలాంటి చిన్న చిన్న కేసులకు కూడా జపాన్ కోర్టులు విచారిస్తున్న తీరు విచిత్రంగా ఉందంటున్నారు నిపుణులు. "రూ.130 సాండ్‌విచ్ దొంగతనానికి రెండేళ్ల జైలు. అంటే రెండేళ్లకు తిండి కయ్యే ఖర్చు సుమారు రూ. 54 లక్షలు" అంటున్నారు. జపాన్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ ఎటూ సరిపోకే ఇలాంటి నేరాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. సాధారణంగా పిల్లలే వాళ్ల తల్లిదండ్రులను చూసుకుంటుంటారు. కానీ ఉద్యోగాల కోసం వాళ్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండటంతో ముసలివారు దిక్కులేకుండా అయిపోతున్నారు. పెన్షన్‌తో బతకలేక దొంగతనాలు చేసి జైలుకెళ్తున్నారు. ఎందుకంటే అక్కడ మూడు పూటల తిండి ఉంటుంది. ఉండేందుకు స్థలం ఉంటుంది. పైగా దేనికి డబ్బులు కట్టాల్సిన పని లేదు.

త్వరలో రిటైర్మెంట్ విలేజ్

నేరస్థులు పెరుగుతుండటంతో జపాన్ ప్రభుత్వం జైళ్ల సామర్థ్యం పెంచుతోంది. మహిళా నేరస్థులు పెరుగుతుండటంతో మహిళా పోలీసులను రిక్రూట్ చేస్తోంది. మరోవైపు జైళ్లలోని ఖైదీల మెడికల్ బిల్లు కూడా పెరుగుతోంది. కోర్టు ప్రొసీడింగ్‌లు, ఇతరత్రా విచారణ ఖర్చుల కన్నా కూడా వృద్ధులను వసతులు కల్పిస్తే చాలా వరకు ఖర్చు తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. "దీనికి పరిష్కారంగా రిటైర్మెంట్ విలేజ్‌ను నిర్మించాలనుకుంటున్నాం. ప్రజలు వాళ్ల పెన్షన్‌లో సగభాగం చెల్లిస్తే ఇక్కడ ఉండేందుకు స్థలం, ఆహారం, చికిత్స చేస్తాం" అని అధికారులు అంటున్నారు.

ఆత్మహత్యలూ పెరుగుతున్నయ్

ముసలివాళ్లలో ఆత్మహత్యలూ పెరుగుతున్నాయి. ఒంటరిగా ఉండలేక, పూటగడవక ఇలాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. 'ప్రజల మధ్య సంబంధాలు మారాయి. ఒంటరైపోతున్నారు. సమాజంలో వాళ్లకంటూ ఓ స్థానం ఉండటం లేదు. అందుకే ఒంటరిగా ఉండలేకపోతున్నారు' అంటున్నారు నిపుణులు. ఎక్కువగా ఒంటరితనం నుంచి బయటపడటానికే నేరాలు చేస్తూ జైలుకెళ్తున్నారని చెబుతున్నారు. ఒకసారి జైలుకెళ్లొచ్చాక అక్కడ స్నేహితులు పెరుగుతున్నారని, ఒంటరితనం నుంచి బయటపడేందుకు అలా మళ్లీ నేరాలు చేస్తున్నారని అంటున్నారు. అయితే జైలుకెళ్లడానికి పేదరికమూ కారణం కావొచ్చంటున్నారు.

పందులపై డ్రాగన్ పంజా

స్వైన్ ఫీవర్ భయంతో చంపేస్తున్న చైనా

వచ్చే వారమే చైనాలో 'పందుల సంవత్సరం' వేడుక చేయబోతున్నారు. మరోవైపు అవే పందులపై డ్రాగన్ కంట్రీ పంజా విసురుతోంది. కొన్ని లక్షల పందులను చంపేస్తోంది. ఈ ఆరు నెలల్లో ఏకంగా పది లక్షలకుపైగా పందుల్ని హతమార్చింది. కారణమేంటో తెలుసా? భయం. ఆ భయానికి కారణం.. స్వైన్ ఫీవర్. అంటే పందుల నుంచి వచ్చే జ్వరం. స్వైన్ ఫ్లూ లాంటిదే. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా స్వైన్ ఫీవర్ అదుపులోకి రాకపోతుండడంతో ఇంత పెద్ద నిర్ణయం తీసుకుంది చైనా. మున్ముందు మరిన్ని పందులను చంపేందుకు నిర్ణయించింది. దాని ప్రభావం చైనా పంది మాంసం పరిశ్రమపై పెద్దగానే పడనుంది. ప్రపంచంలో సగం పంది సంపద చైనాలోనే ఉంది. ఏటా 70 కోట్ల పందులను పెంచుతోంది. అదే ఎగుమతుల విషయానికొస్తే కేవలం 16 లక్షలు. ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ అంత ప్రమాదకరమేమీ కాదని హాం కాంగ్ లోని సిటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డర్క్ ఫీఫర్ అంటున్నారు. పందుల నుంచి జనానికి వ్యాపించదని చెబుతున్నారు. ఆ వైరస్ పందులకు మాత్రమే ప్రాణాంతకమంటున్నారు. కానీ, చైనా మాత్రం కొన్ని ప్రాంతాలను రోగకా రక ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని నిషేధించేసింది. ఉన్న పందులను చంపుతూ పోతోంది. అంతే పంది మాంసం మార్కెట్లనూ మూయించేస్తోంది. దాని వల్ల చిన్న చిన్న వ్యాపారులే తీవ్రంగా నష్టపోతున్నారని ఫీఫర్ చెప్పారు.

1921లో తొలిసారి స్వైన్ ఫీవర్...

ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్‌ను తొలిసారిగా 1921లో కెన్యాలో గుర్తించారు. గత ఏడాది ఆగస్టు 3నే చైనాలో ఆ వైరస్ వెలుగులోకి వచ్చింది. కిచెన్‌లోని వ్యర్థాలు, కుడితి లాంటి ద్రవాలను పెట్టడం వల్లే పందులకు ఆ వైరస్ సోకుతోందని నిపుణులు చెబుతున్నారు. చర్మం, లోపలి అవయవాల్లో రక్తం ఎక్కువగా కారుతుందని అంటున్నారు. ప్రస్తుతం ఆ రోగానికి ఎలాంటి వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేదు. అయితే సమస్యపై ముందే స్పందించామని, అది మరింత వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పారదర్శకంగా ఉన్నామని చైనా వ్యవసాయ శాఖ మంత్రి గ్యాంగ్ డెపు చెప్పారు.






డేటింగ్ చేసిండు.. 'లవర్'నే తినేసిండు

25 ఏళ్ల యుటా శినోహరా ప్రేమలో పడ్డాడు. ఏడాది పాటు డేటింగ్ చేశాడు. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ విషాదం ఉంటుందన్నట్టుగా.. ఇతగాడి లవ్ స్టోరీలోనూ విషాదం ఉంది. అతడి లవర్ చచ్చిపోయింది. అలా అని అతడేం ఏడుస్తూ కూర్చోలేదు. హ్యాపీగా లవర్‌ను తినేశాడు. అతడి లవర్ పేరు లీసా. కానీ, మనిషి కాదు. పుర్రెకో బుద్ధి అన్నట్టు అతడు ప్రేమించింది ఓ బొద్దింకను. అవును. ప్రేమ గుడ్డిదంటారు కదా.. అలాగే అతగాడికి ఆఫ్రికాకు చెందిన లీసా అంటే ప్రేమ పుట్టింది మరి. జపాన్‌లోని ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడు తన ప్రేమ గురించి చెప్పుకొచ్చాడు. తనను తినేయడం చాలా సంతోషాన్నిచ్చిందన్నాడు. ఎందుకయా అంటే.. శాశ్వతంగా అది తన కడుపులో ఉండిపోతుంది కదా అంటాడు శినోహరా. స్వతహాగానే అతడికి పురుగుపుట్ర అంటే ప్రేమ అట. ఆ ప్రేమతోనే బొద్దింకను ప్రేమించాడట. దానికి తోడు స్వామి కార్యం కూడా పూర్తవుతదంటున్నాడు. ఎందుకంటే ఆహార భద్రత కోసం ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో).. పురుగులను తినండని చెబుతోంది కదా. ఆ మాట పట్టుకున్న అతడు.. పురుగుల భోజనంపై ప్రచారాలూ చేస్తున్నాడు. దేశంలో రెస్టారెంట్లలో ఆ ఫుడ్డును ప్రమోట్ చేస్తున్నాడు.

నా ఇంటికి నే పోత



- ఐసిస్ ఉగ్రవాదిని పెళ్లి చేసుకున్న జర్మనీ అమ్మాయి
- నాలుగేళ్ల పాటు అష్టకష్టాలు

బాఘౌజ్, సిరియా: నాలుగేళ్ల కిందటి సంగతి.. ఓ 15 ఏళ్ల జర్మనీ అమ్మాయి.. సిరియా వెళ్లింది.. అక్కడ ఇస్లాంలోకి మారింది.. ఆ తర్వాత మూడు రోజులకే ఓ జర్మన్ వ్యక్తిని పెళ్లి చేసుకుంది.. ఆయనకు ఆమె మూడో భార్య.. ఆయనేమో టెర్రరిస్టు.. ఐసిస్‌కు పని చేస్తాడు.. నాలుగేళ్లు ఎన్నో కష్టాలు పడిన ఆమె ఇప్పటికి ఆ చెర నుంచి బయటపడింది.. ఇప్పుడు తన పాత జీవితం కావాలంటోంది.. ఇంటికి (జర్మనీకి) వెళ్తానంటోంది. జర్మనీకి చెందిన లియోనొరా (19) టెర్రరిస్టు మార్టిన్ లెమ్‌కే(28)ను నాలుగేళ్ల కింద పెళ్లి చేసుకుంది. అప్పటికి అతడు ఐసిస్‌లో టెక్నికల్ పని చేస్తున్నాడు. అంటే కంప్యూటర్లు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను బాగు చేసేవాడు. ఆ సమయంలో ఐసిస్ తీవ్రత విపరీతంగా ఉంది. సిరియాలోని చాలా ప్రాంతాలను, ఇరాక్‌లోని కొద్ది ప్రాంతాన్ని ఐసిస్ తన అధీనంలోకి తీసుకుంది. లెమ్‌కేతోపాటు సిరియాలోనే ఉన్న లియోనొరా తొలుత సిరియా రాజధాని రక్కాలో కొన్నిరోజులు గడిపింది. ఓ భార్యగా తాను అక్కడున్నానని, ఇంటిపని, వంటపని చేసేదాన్నని, ఇద్దరు పిల్లల్ని చూసుకునేదాన్నని చెప్పింది.

కొన్నిరోజులు సాఫీగా సాగినా..

కొన్నిరోజులు రక్కాలో లియోనొరా జీవనం సాఫీగా సాగినా కుర్దిష్ నేతృత్వంలోని ఎస్‌డీఎఫ్ దళాల దాడులు పెరగడంతో పరిస్థితి మారిపోయింది. వైమానిక దాడులూ భారీగా పెరిగాయి. ఎప్పుడు ఎక్కడ దాడి జరుగుద్దో తెలియని పరిస్థితి. చివరికి 2017లో కుర్దిష్ ప్రభుత్వం రక్కాను తమ అధీనంలోకి తీసుకుంది. ఐసిస్ అధీనంలో నరకం అనుభవించామని అక్కడి స్థానికులు చెప్పారు. పబ్లిక్‌గా తలలు నరికేసేవారని, శిలువ వేసేవారన్నారు. 'రక్కాను కోల్పోయాక ఐసిస్ బృందాలు ప్రతివారం ఒక్కో ప్రాంతంపై పట్టు కోల్పోవడం మొదలైంది. కాబట్టి వారం వారం ఇళ్లు మారేవాళ్లం' అని లియోనొరా వివరించింది. కుర్దిష్ దళాలు దాడి చేస్తున్నప్పుడు ఐసిస్ ఉగ్రవాదులు తమ కుటుంబాలను అక్కడే వదిలి పారిపోయేవారంది. 'పిల్లలతో ఒంటరిగా ఖాళీ అయిన నగరంలో కూర్చునేవాళ్లం' అని ఆవేదన చెందింది. ఈ మధ్య జరిగిన దాడిలో కుర్దిష్ అధీనంలోని ప్రాంతంలోకి వెళ్లామని.. గురువారం వాళ్లు లేమ్‌కేను పట్టుకున్నారని చెప్పింది. ఇక తనకు పాత జీవితం కావాలని కోరుతోంది. జర్మనీకి వెళ్తానంటోంది.



ఇప్పుడు కుట్టు సూద్దాం..

- దోమ కాటుకు సహజసిద్ధమైన రిపెల్లెంట్
- ఏలికపాముల్లో ఉండే జినోర్హాబ్డస్ నుంచి తయారీ

దోమలను తరిమేందుకు దోమ తెర, లిక్విడ్‌లు, ఫ్లాష్ కార్డులు, రిపెల్లెంట్స్.. అబ్బో రకరకాల అస్త్రాలు వాడుతుంటాం. రిపెల్లెంట్‌లలో డీఈఈటీ (ఎన్, ఎన్-డై ఇథైల్ మెటా టొలువామైడ్) ఉన్నవి ఎక్కువగా వినియోగిస్తాం. ఇది ఎంత ప్రభావవంతమైందో అంతే విషపూరితం. అందుకే చాలా మంది సైడ్ ఎఫెక్ట్స్ లేని సహజసిద్ధ రిపెల్లెంట్ కావాలనుకుంటున్నారు. వాళ్ల ఆలోచనకు తగినట్టుగా ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్‌లోని సైంటిస్టు మౌర్య కజ్జా, విస్కాన్సిన్-మాడిసన్ యూనివర్సిటీలోని అతని స్నేహితులు దోమల విరుగుడుకు సహజసిద్ధమైన కొత్త మందును కనుగొన్నారు. అదీ నేలలోని బ్యాక్టీరియా జినోర్హాబ్డస్ నుంచి. ఏలికపాములు (రౌండ్‌వామ్స్)లో ఉంటూ ఇతర కీటకాలు వాటి దగ్గరకు రాకుండా ఈ బ్యాక్టీరియాలు వాటిని కాపాడుతుంటాయి. క్రిములు, కీటకాలు, ఫంగస్‌తోనూ పోరాడగల సత్తా కూడా వీటికుంది. అందుకే ప్రయోగానికి వీటిని ఎంచుకున్నారు.

తక్కువ తాగుతాయి

ప్రయోగంలో భాగంగా తొలుత దోమ ఆహారం తీసుకునే వ్యవస్థను మౌర్య ఏర్పాటు చేశారు. ఆహారం సిద్ధం చేసి దానిపై రకరకాల బట్టలను కప్పారు. ఒక్కో బట్టపై ఒక్కోరకం రిపెల్లెంట్‌ను చల్లారు. ఎక్కువగా వాడే డీఈఈటీ, పికారిడిన్ లాంటి రిపెల్లెంట్‌ల పని తీరును పరిశీలించారు. తర్వాత జినోర్హాబ్డస్‌ను ఓ ద్రావకంలో పెంచి దాన్ని శుద్ధి చేసి బట్టలపై చల్లారు. ఆహారం తీసుకోడానికి దోమలు రాగానే పట్టుకొని చంపేసి వాటి కడుపును పరిశీలించారు. ఎంతమొత్తంలో ఆహారం ఉందో చూశారు. డీఈఈటీ, పికారిడిన్‌ల కన్నా జినోర్హాబ్డస్ బాగా పని చేసింది. ఎలా అంటారా? జినోర్హాబ్డస్ రిపెల్లెంట్ ఉన్న ప్రదేశం నుంచి చాలా తక్కువ మొత్తంలో దోమలు ఆహారం తీసుకున్నాయి. దాన్ని కాస్త ఎక్కువ చల్లితే చాలా తక్కువ దోమలే ఆహారంపై వాలాయి. ఇలా బ్యాక్టీరియాతో రిపెల్లెంట్‌ను కనుగొనడం తొలిసారని, దీనిపై క్లినికల్ ట్రయల్స్ చేయాల్సి ఉందని సైంటిస్టులు చెప్పారు. దీన్ని మనుషుల శరీరంపైనా ప్రయోగించి చూడాలన్నారు. సాధారణంగా రిపెల్లెంట్స్ రెండు రకాలు. శరీరంపై దోమలు వాలకుండా చేసేవి స్పేషియల్ రకం ఒకటైతే ఎక్కువ రక్తం తీసుకోకుండా చేసేవి కాంటాక్ట్ రెపెల్లెంట్స్ రెండో రకం. బ్యాక్టీరియాతో తయారయ్యేవి కాంటాక్ట్ రకానికి చెందినవి.

విదేశీ రాకెట్‌తో దేశీ ప్రయోగం

జీశాట్ 31ను నింగికి చేర్చనున్న ఏరియన్ రాకెట్.. 6న ప్రయోగం

శ్రీహరికోట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. విదేశీ రాకెట్‌తో స్వదేశీ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనుంది. ఫిబ్రవరి 6న ఫ్రెంచ్ గయానా నుంచి ఏరియన్ 5 (వీఏ 247) రాకెట్ ద్వారా జీశాట్ 31 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపుతామని ఇస్రో శుక్రవారం ప్రకటించింది. తెల్లవారుజామున 2.31 గంటలకు ప్రయోగం ఉంటుంది. జీశాట్ 31 బరువు 2,535 కిలోలు. గతంలో ఇస్రో ప్రయోగించిన ఇన్‌శాట్ /జీశాట్ కాల పరిమితి పూర్తి కావడంతో జీశాట్ 31 ప్రయోగాన్ని చేపడుతోంది. వీశాట్ నెట్‌వర్క్, టీవీ అప్‌లింకులు, డిజిటల్ శాటిలైట్ వార్తా సేకరణ, డీటీహెచ్ సేవలు, సెల్‌ఫోన్ కనెక్టివిటీ తదితర సేవలను జీశాట్ 31 అందిస్తుంది. దాదాపు 15 ఏళ్ల పాటు పనిచేసే ఈ ఉపగ్రహం.. అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహాసముద్ర ఉపరితలాలపై సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేయనుంది. సౌదీ జియోస్టేషనరీ శాటిలైట్ 1/హెల్లాస్ శాట్ 4నూ నింగిలోకి మోసుకెళ్లనుంది ఏరియన్ రాకెట్.





అనగనగా ఓ నావ.. ప్రపంచంలోనే పెద్దదంట



యాట్ అనగానే.. పెద్దోళ్ల ఎట్లయిన ఊరేగు తరు అని ఓ మామూలు మనిషి అనుకోవడం సహజం. కానీ, మామూలు మనిషికి ఆ కోరిక తీరితే బాగుంటుంది కదా. అందుకే ఓ యాట్ డిజైనర్ ఆ కలను సాకారం చేసే దిశగా ప్లాన్ చేశాడు. అదే ఈ యాట్. 24 బస్సులను వరుసగా నిలబెడితే ఎంత పొడవుంటుంది..? రెండు ఫుట్ బాల్ గ్రౌండ్‌లు ఎంత పెద్దగుంటాయి? ఇదిగో.. ఈ యాట్ అంత పెద్దగుంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద యాట్ ఇది. పొడవు 2 29 మీటర్లు (750 అడుగులు). వాల్కైరీ ప్రాజెక్ట్ పేరిట దక్షిణ కొరియాకు చెందిన షల్వాన్ పార్క్ (36) అనే యాట్ డిజైనర్ దీనికి రూపమిచ్చాడు. లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్‌కు చెందిన పామర్ జాన్సన్ సహకారంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు డిజైన్ చేశాడు పార్కర్. ఈ ప్రాజెక్టు విలువ సుమారు ₹5612 కోట్లు (60 కోట్ల పౌండ్లు). 52 మంది అతిథులు, 92 మంది సిబ్బందికి సరిపోయేలా ఉండే దీనిని అల్యూమినియం, కార్బన్ ఫైబర్‌తో నిర్మించారు. గంటకు 46 కిలోమీటర్ల వేగంతో ఇది నీటిలో దూసుకుపోతుంది. ఇందులో కాసినో, థియేటర్లు, రెస్టారెంట్లు, ఆర్ట్ గ్యాలరీల వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. అయితే, దీన్ని ఏ ఒక్కరికో పరిమితం చేయాలనుకోవట్లేదని దీనికి డిజైన్ చేసిన పార్కర్ చెబుతున్నాడు. మామూలు జనం హాలిడేను ఎంజాయ్ చేయడానికి దీనిని వాడతామన్నాడు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే మంచి ఆఫర్లు వచ్చాయని, దేనికీ ఇంకా సంతకం చేయలేదని చెప్పాడు. జస్ట్ ఇది డిజైన్ మాత్రమే. త్వరలోనే దాని నిర్మాణాన్ని ప్రారంభించనున్నాడు. ప్రస్తుతం దుబాయ్ రాజు ఖలీఫా బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌కు చెందిన యాటే పెద్దది. దాని పొడవు 180 మీటర్లు. వాల్కైరీ ప్రాజెక్ట్ పూర్తయితే.. ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోతుంది.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.